thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 244 కరీంనగర్ మంగళవారం, 11 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.

# 'బీహార్ దంగల్'




# టెన్షన్... టెన్షన్...

## దేశ రాజకీయాల్లో బీహార్ ప్రకంపనలు!!

బీహార్ ఒక పెద్ద రాష్ట్రం. హిందీ బెల్ట్ లో అతి కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక రాజకీయంగా మార్పు వస్తే అది జాతీయ స్థాయిలోనే బిగ్ సౌండ్ చేస్తుంది. బీహార్ మీద అందుకే అందరూ ఫుల్ ఫోకస్ పెట్టేశారు. బీహార్ మహా ఘట్ బంధన్ ని గెలిపించడండి. ఈ ఒక్క ఓటుతో జాతీయ స్థాయిలో రాజకీయం కూడా మారుతుంది అని కాంగ్రెస్ నేతలు చాలా కాలంగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. బీహార్ కి డైరెక్ట్ గానే కేంద్ర రాజకీయాలతో సంబంధం ఉంది. దాని పేరే జేడీయూ, దాని అధినేత ప్రస్తుత సీఎం నితీష్ కుమార్ కూడా చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.

**నితీష్ ఓడితే :** బీహార్ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న రానున్నాయి. ఈ ఫలితాలు కనుక మహా ఘట్ బంధన్ కి అనుకూలంగా వస్తే మాత్రం జాతీయ స్థాయిలో అతి పెద్ద సంచలనమే అవుతుంది అని అంటున్నారు. నితీష్ కుమార్ ఓటమి చెంది మాజీ సీఎం అయితే మాత్రం అది ఒక్కలా ఉండదని అంటున్నారు. ఆయన గత రెండు దశాబ్దాలుగా ఖాళీగా అయితే లేరు. ఆయన కూటములు మార్చి మార్చి సీఎం పదవిలో అలా రెండు దశాబ్దాల పాటు కొనసాగారు. ఇపుడు ఆయన కనుక ఒక్కసారి మాజీ సీఎం అనిపించుకుంటే అపుడు ఎలా అన్నది ఒక చర్చ.

**చెన్నారెడ్డి పోలిక :** నితీష్ కుమార్ కి ఇక్కడ ఉమ్మడి ఏపీ సీఎం మర్రి చెన్నారెడ్డితో ఒక పోలిక కూడా పెడుతున్నారు విశ్లేషకులు. చెన్నారెడ్డిని ఎపుడూ కాంగ్రెస్ ఖాళీగా ఉంచలేదు, ఏదో ఒక పదవిని ఇస్తూ ఆయనను అలా అధికార కేంద్రంగానే చేస్తూ వచ్చింది. ఆయన కనుక ఖాళీగా ఉంటే పన్నే వ్యూహాలు ఏకంగా కొంప ముంచేస్తాయి అన్నది కాంగ్రెస్ ఆనాటి పెద్దల నమ్మకం. అదే నిజం కూడా. ఇపుడు నితీష్ కుమార్ కూడా అలాంటి స్టామినా ఉన్న వారే అని అంటున్నారు. ఆయన ఓటమిని ఓర్వలేరు అని అంటున్నారు. ఆయన మాజీ అయితే తరువాత పరిణామాలు ఎలా ఉంటాయో అన్న చర్చ సైతం సాగుతోంది.

**ఎన్డీయే సర్కార్ కి కుదుపు :** కేంద్రంలో ఎన్డీయే సర్కార్ కి రెండు కీలక పార్టీల మద్దతు అందుతోంది. ఏపీ నుంచి టీడీపీ పదహారు ఎంపీ సీట్లు బీహార్ నుంచి నితీష్ కుమార్ కి చెందిన జేడీయూ ఎంపీలు 12 మంది కొమ్ము కాస్తున్నారు ఇందులో నితీష్ కుమార్ ఇండియా కూటమి వైపు టర్న్ తీసుకుంటారా అన్న చర్చ సైతం సాగుతోంది ప్రస్తుతానికి అది ఎంతో ఊహాజనితమైన ఆలోచన అయినప్పటికీ రాజకీయాల్లో ఏదీ జరగదు అన్నది ఏమీ లేదు దాంతో కనుక చూస్తే బీహార్ లో ఓటమి తరువాత నితీష్ కుమార్ ఎత్తుగడలు ఏ విధంగా ఉంటాయి అన్నది కమలనాథులు సైతం అంచనా వేస్తున్నారా లేదా అన్నది ఒక డౌట్.

**అదే కనుక జరిగితే :** బీహార్ లో ఓటమి తరువాత నితీష్ కుమార్ ను కేంద్రానికి తీసుకుని రావాలి. కేంద్రంలో ఆయనకు కీలక శాఖలు ఇస్తూ ఉప ప్రధానిగా చేయాలన్న డిమాండ్ ఏమైనా పెడతారా అన్నది కూడా ప్రచారంలో ఉన్న మాట. దానికి బీజేపీ పెద్దలు అంగీకరిస్తారా అన్నది మరో సందేహంగా ఉంది అన్నది సైతం ప్రచారం. అలా కాకుండా నితీష్ ని మాజీ సీఎం గా అలా ఉంచితే అది అటు ఇటూ తిరిగి ఏకంగా ఎన్డీయే సర్కార్ కే ఎసరు తెస్తుందా అన్నది మరో చర్చ. అలా జరగాలనే కాంగ్రెస్ బలంగా కోరుకుంటోంది అని అంటున్నారు ఇండియా కూటమి ఆలోచనలు అలాగే సాగుతున్నాయి. అయితే కేంద్రంలో ప్రభుత్వం మాత్రం తుమ్మితే ఊడే ముక్కు అయితే కాదు, బలమైన ప్రధానిగా మోడీ ఉన్నారు. ఇక నితీష్ కుమార్ ఎన్డీయేలోనే కొనసాగేలా చూస్తారు.

అంతే కాదు ప్లాన్ బీ కూడా రెడీ చేసుకుని పెట్టుకుని ఉంటారు అని అంటున్నారు. సో బీహార్ ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు అనుకూలంగా వస్తే ఇండియా కూటమికి దెబ్బ పడి అక్కడ ప్రకంపనలు పుడతాయి అని కూడా ఉంది. కాదు అనుకుంటే ఏమి జరుగుతుంది అన్నది కూడా ఉంది. సో వెయిట్ అండ్ సీ.





## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. డ్రోన్ మానిటరింగ్‌తో భద్రత పెంపు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రేపు జరుగనుంది. రేపు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పో లింగ్ నిర్వహించనున్నారు ఎన్నికల అధికారులు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి లో మొత్తం 4 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఉపఎన్నిక సందర్భంగా 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. యూసఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామాగ్రిని వివిధ పోలింగు స్టేషన్లకు పంపిణీ చేశారు ఎన్నికల అధికారులు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ మీడియాతో మాట్లాడారు. డీఆర్సీ సెంటర్‌లో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ స్టేషన్లని ఎన్నికల అధికారులు కేటాయిస్తున్నారని వివరించారు. ఇవాళ సాయంత్రం ఈవీఎంలతో పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది చేరుకోనున్నారని వెల్లడించారు. తాను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నానని పేర్కొన్నారు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్.

**డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తాం: తఫ్సీర్ ఇక్బాల్...** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రాసెస్ జరుగుతోందని హైదరాబాద్ జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు చేరు కుంటారని వివరించారు. ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తామని చెప్పుకొచ్చారు. ఒక్కో అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్ ఇస్తున్నామని వెల్లడించారు. ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎక్కువ ఉండటంతో పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల వరకు పెంచామని స్పష్టం చేశారు హైదరాబాద్ జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్. 65 ప్రాంతాల్లో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పారామిలిటరీ బలగాలు ఉంటాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పుకొచ్చారు. నియోజకవర్గంలోని స్థానికులు తప్ప ఇతరులను బయటకు పంపుతున్నామని పేర్కొన్నారు. హొటల్స్, హాల్స్, ఫంక్షన్ హాల్స్ అన్నింటిని పరిశీలించి ఇతరులను నియోజకవర్గం నుంచి పంపించేస్తామని తెలిపారు. ఒకవేళ ఇతరులు నియోజకవర్గంలో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదని తెలిపారు. 1,761 మంది లోకల్ పోలీసులు బందోబస్తులో ఉంటారని స్పష్టం చేశారు. ఎనిమిది కంపెనీల CISF బలగాలు బందోబస్తులో ఉంటాయని హైదరాబాద్ జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ పేర్కొన్నారు.




హైదరాబాద్: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అందెశ్రీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి లాలాపేటలోని ఇంటికి తరలించారు. అనంతరం స్థానిక జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయన 1961 జులై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలోజన్మించారు. గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.'మాయమైపోతున్నడమ్మో' గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రగీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఆయనకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పురస్కారం అందించింది. ఆశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందుకున్నారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం లభించింది. అందెశ్రీ లోక్‌నాయక్ పురస్కారాన్ని అందుకున్నారు.

**తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది: తెలంగాణ సీఎం రేవంత్...** అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సీఎం సంతాపం వ్యక్తం చేశారు.

**అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించింది: ఏపీ సీఎం చంద్రబాబు..** అందెశ్రీ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు.

తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.




ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో ఓ కారులో పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా.. 24 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సోమవారం సాయంత్రం 6.55 గంటలకు పేలుడు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. ప్రమాదం అనంతరం ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్, ఎన్ఐఏ రంగంలోకి దిగాయి. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**భీతావహ వాతావరణం...** భారీ పేలుడుతో ఘటనా స్థలంలో భీతావహ వాతావరణం నెలకొంది. పేలుడు ధాటికి చుట్టుపక్కలే ఉన్న పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆరు కార్లు, రెండు ఇ-రిక్షాలు, ఒక ఆటో రిక్షా మంటల్లో కాలి బూడిదయ్యాయి. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. "ఈ పేలుడు జరిగినప్పుడు నేను గురుద్వారా వద్ద ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది.

అదేంటో మాకు అర్థంకాలేదు. అంత పెద్దగా వినిపించింది. ఆ వాహనానికి సమీపంలో ఉన్న మరికొన్ని వాహనాలూ పూర్తిగా దగ్ధమయ్యాయి" అని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు.

**ఢిల్లీ సహా సరిహద్దు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం...** పేలుడు నేపథ్యంలో ఢిల్లీ సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఈ ఉదయం భారీగా పేలుడు సామగ్రి పట్టుబడటం.. సాయంత్రమే ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలోని కారులో భారీ పేలుడు ఘటన నేపథ్యంలో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ, హరియాణా, యూపీలను కలిపే అన్ని సరిహద్దు పాయింట్ల వద్ద పోలీసు నిఘాను పెంచారు. రైల్వే స్టేషన్లు, మెట్రోస్టేషన్లు వంటి సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను పెంచారు. స్పెషల్ సెల్, క్రైం బ్రాంచ్ సహా అన్ని విభాగాలను అప్రమత్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీ- హరియాణా సరిహద్దు సమీపంలో వాహనాలు, లాడ్జీలను తనిఖీ చేయాలని బృందాలను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా సింఘు, టిక్రీ, బదర్‌పుర్ సరిహద్దుల వద్ద అదనపు పికెట్‌లను ఏర్పాటు చేసి గస్తీని ముమ్మరం చేశారు.




హైదరాబాద్, నవంబర్ 10: దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించిన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం సైతం హై అలర్ట్ ప్రకటించడంతో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ చెకింగ్స్ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాతబస్తీతో పాటు హైదరాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలన్నింటికీ హైఅలర్ట్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఆయా నగరాల్లో సెక్యూరిటీని టైట్ చేశారు. ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో భద్రతా బలగాలు అప్రమత్తం అయ్యాయి. అటు, ఉత్తర ప్రదేశ్ లోనూ అప్రమత్తత ప్రకటించారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక: తెలుగుదేశమే కింగ్ మేకర్ కానుందా?



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.. ఇక రిజల్ట్ ఎలా వస్తుంది అనేది రెండు తెలుగు రాష్ట్రాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి.. ఇదే తరుణంలో అక్కడ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బిజెపి నుంచి లంకల దీపక్రెడ్డి పోటీ చేస్తున్నారు.. ఈ విధంగా జూబ్లీహిల్స్ లో ఎవరికి వారే ఎన్నికలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్ లో రెండు పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ బీఆర్ఎస్ హోరాహోరిగా తలపడుతుంది. అయితే మొత్తం నాలుగు లక్షల ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో , కేవలం 50% మాత్రమే ఓటింగ్ జరుగుతుంది. ఇందులో ముస్లిం ఓట్లు హిందువుల ఓట్లు ఉంటాయి. ఇందులో సెటిలర్స్ తెలుగుదేశం పార్టీకి చెందిన ఓట్లే కీలకం కానున్నాయి.. మరి వీరి ఓట్లు ఎవరికి పడనున్నాయి అనేది చూద్దాం.. జూబ్లీహిల్స్ లో తెలుగుదేశం పార్టీకి చెందిన అభిమానులు ఎక్కువగా ఉన్నారు. అయితే మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం స్టార్ట్ చేశారు. ఆయనకు ఎక్కువగా అక్కడ పరిచయాలు ఉన్నాయి. అలాగే లంకల దీపక్రెడ్డి కూడా తెలుగుదేశం నుంచి తన ప్రస్తానాన్ని స్టార్ట్ చేసి బిజెపిలోకి వచ్చారు. బిజెపితెలుగుదేశం పార్టీ పొత్తులో ఉంది. అలాగే నవీన్ యాదవ్ చిన్న శ్రీశైలం యాదవ్ తెలుగుదేశం పార్టీ మనిషి.. ఆ తర్వాత కాంగ్రెస్లో చేరారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాత తెలుగుదేశం పార్టీ నాయకులంతా పరిచయమన్నారు. ఈ విధంగా మూడు పార్టీల నుంచి అందరూ నాయకులు తెలుగుదేశం పార్టీకి చెందినటువంటి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరి ఓట్లు ఎవరికి పడనున్నాయి.. వారు ఏ వైపు ఎక్కువగా మొగ్గు చూపితే ఆ వైపు విజయం వస్తుందనేది తథ్యం.




## మిత్రులే ప్రత్యర్థులు.. ఆసక్తి కలిగిస్తున్న చతుర్ముఖ పోటీ


కహల్‌గావ్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. కీలకమైన రెండో విడత పోలింగ్ మరి కొద్ది గంటల్లోనే (నవంబర్ 11) జరగనుండటంతో అన్ని పార్టీల్లోనూ ఉత్కంఠ నెలకొంది. తొలి విడత భారీగా పోలింగ్ నమోదు కావడంతో రెండో విడతపై అంచనాలు బలంగానే ఉన్నాయి. ఈసారి పోలింగ్ జరుగుతున్న పలు నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామ్య పార్టీల నేతలే ప్రత్యర్థులుగా తలపడుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. కొన్ని చోట్ల టిక్కెట్లు నిరాకరించడంతో రెబల్ అభ్యర్థులు సైతం పోటీలో ఉన్నారు. అలాంటి నియోజకవర్గాల్లో భాగల్‌పూర్ జిల్లాలోని కహల్‌గావ్ నియోజకవర్గం ఒకటి. ఇక్కడ చతుర్ముఖ పోటీ నెలకొనడం ఆసక్తిగా మారింది. కహల్‌గావ్‌లో జేడీయూ అభ్యర్థిగా సుభానంద్ ముఖేష్ పోటీలో ఉన్నారు. ఆయన దివంగత నేత, బిహార్ అసెంబ్లీ మాజీ స్పీకర్ సదానంద్ సింగ్ కుమారుడు. సదానంద్ సింగ్ కాంగ్రెస్ టిక్కెట్‌పై రికార్డు స్థాయిలో తొమ్మిది సార్లు ఇక్కడి నుంచి గెలిచారు. సుభానంద్ ముఖేష్ వృత్తిరీత్యా ఇంజనీర్ కాగా, ఆయన భార్య డాక్టర్. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేశారు. అయితే బీజేపీ అభ్యర్థి పవన్ కుమార్ యాదవ్ చేతిలో ఓడిపోయారు. ఈ ఏడాది ఆయన జేడీయూలో చేరారు. సీట్ల షేరింగ్ ఒప్పందంలో భాగంగా ఈ నియోజకవర్గాన్ని జేడీయూకు బీజేపీ వదులుకుంది. దీంతో సుభానంద్ ముఖేష్‌కు జేడీయూ టిక్కెట్ ఇచ్చింది. నితీష్ కుమార్ కనుసన్నల్లో తాను పెరిగాయని, తన తండ్రి వారసత్వం కూడా తనకు ఉందని, తన గెలుపు ఖాయమని సుభానంద్ ధీమా వ్యక్తం చేశారు.

కాగా, కహల్‌గావ్ బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పవన్ కుమార్ తనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఆయన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇండిపెండెట్ అభ్యర్థిగా ఆయన పోటీలో ఉన్నారు. మరోసారి తన గెలుపు తథ్యమని, గత ఐదేళ్లుగా తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన తెలిపారు. కహల్‌గావ్ సీటు విషయంలో బీజేపీ, జేడీయూ మధ్య అవగాహన కుదిరినప్పటికీ, విపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్ మాత్రం ఎలాంటి అవగాహనకు రాలేకపోయాయి. దీంతో స్నేహపూర్వక పోటీ పేరుతో రెండు పార్టీలు ఇక్కడ పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ తరపున ప్రవీణ్ కుష్వాహ, ఆర్జేడీ నుంచి రజనీష్ యాదవ్ పోటీ చేస్తున్నారు. రజనీష్ తండ్రి సంజయ్ యాదవ్ జారా?ండ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. తానే మహాగఠ్‌బంధన్ అభ్యర్థినని, ఓట్లు చీలే ప్రసక్తే లేదని రజనీష్ తెలిపారు. కుష్వాహ ర్యాలీలకు జనం ఉండటం లేదని, తన సభలకు భారీగా జనం వస్తున్నారని, దానిని బట్టే ఓట్లు చీలే అవకాశం లేదని చెప్పారు. అయితే తమ పార్టీ గట్టి పోటీ ఇవ్వడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి కుష్వాహ తెలిపారు.

**ఓటర్ల మనోగతం...** కహల్‌గావ్‌లో రసవత్తమైన చతుర్ముఖ పోటీ నెలకొన్నప్పటికీ ఓటర్లు మాత్రం నిరుద్యోగితే ప్రధాన సమస్య అని, ఉపాధి అవకాశాల కల్పనకే తమ ఓటు అని చెబుతున్నారు.

'బిహార్‌లో విద్య నాసిరకమైన స్థితిలో ఉంది. విద్యాధికుడు మాత్రమే విద్యను అందించగలడు. ఫలానా వ్యక్తి అనో, పార్టీ అనో మేము చెప్పం. విద్య గురించి మాట్లాడే వాళ్లనే ఎన్నుకుంటాం' అని యువ ఓటరు ఒకరు చెప్పారు.

## ఆ ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుంది: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 10: భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. మహనీయుడి జయంతి రోజునే జాతీయ విద్యా దినోత్సవం (నవంబర్ 11) నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఏఐటీలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకముగా పోరాడారని గుర్తు చేశారు. జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించాడని తెలిపారు. స్వాతంత్య్రం అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు.




పాట్నా: నవంబర్ 14వ తేదీ తర్వాత బిహార్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆర్జేడీ నేత, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ తెలిపారు. బిహార్‌ను అట్టడుగు స్థాయిలోకి ఎన్డీయే నెట్టేసిందని, పోలింగ్‌కు ముందు ఎన్నికల అధికారులను కేంద్ర మంత్రులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ మరికొద్ది గంటల్లోనే జరుగనుండటంతో సోమవారంనాడు మీడియా సమావేశంలో తేజస్వి మాట్లాడారు. 'నవంబర్ 14 తర్వాత బిహార్‌ను దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకువెళ్తాం. ఆహార ఆధారిత యూనిట్లు, విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఇరిగేషన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఎడ్యుకేషనల్ సిటీలు, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క బిహారీ కూడా ఇతర సిటీలకు వెళ్లాల్సిన పని లేదు' అని తేజస్వి తెలిపారు. ఈసారి చాలా స్పష్టంగా బిహార్‌లో మార్పు కనిపిస్తోందని, ఉద్యోగాలు కల్పించే ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు బలంగా తీర్మానించుకున్నారని, ప్రజలు చరిత్ర సృష్టించనున్నారని చెప్పారు.

**డాటా దాచిపెట్టారు...** నవంబర్ 6న తొలి విడత పోలింగ్ జరిగి నాలుగు రోజులైనా గణాంకాలను ఇంతవరకూ ఈసీ బయటకు వెల్లడించలేదని తేజస్వి ఆరోపించారు. గతంలో ఎన్నికల రోజే ఓటింగ్ గణాంకాలను వెల్లడించేవారని, ఇప్పుడు ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ పాపాలను ఎన్నికల కమిషన్ కప్పిపుచ్చుతోందని, ఎన్నికల కమిషన్ నిర్జీవంగా, బిజేపీకి ఒక ఉపకరణంగా మారిందని విమర్శలు గుప్పించారు. తొలి విడత పోలింగ్‌లో మహిళలు, పురుషుల ఓటింగ్ శాతాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు ప్రచురించలేదో వివరణ ఇవ్వాలని తేజస్వి డిమాండ్ చేసారు. లెక్కలు ఎందుకు దాచిపెడుతున్నారో చెప్పాలన్నారు. వీవీప్యాట్ స్లిప్పులు వీధుల్లో కనిపిస్తున్నాయని, సీసీటీవీ కెమెరాలను మూసిపెట్టి ఉంచుతున్నారని, ఈ అవకతవకలపై ఈసీ వివరణ ఇవ్వాలని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ నవంబర్ 6న ప్రశాంతంగా జరిగింది. 65.08 శాతం పోలింగ్ రికార్డయింది. 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. రెండో విడత పోలింగ్ 123 నియోజకవర్గాల్లో నవంబర్ 11న జరుగనుంది. దీంతో ఓటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## ప్రచారం కోసం సుప్రీంకోర్టుకు రావొద్దు.. కేఏ పాల్‌కి అత్యున్నత న్యాయస్థానం చివాట్లు!

ఢిల్లీ, నవంబర్, 10: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మీద దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీడియాలో ప్రచారం కోసం పిటిషన్లు దాఖలు చేస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. దీంతో మరో మారు కేఏ పాల్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురైనట్లైంది. ఇక, కేసు వివరాల్లోకి వెళ్తే, ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను పీపీపీ మోడ్‌లో పూర్తి చేసి నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని కేఏ పాల్.. సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. దీనిపై కేఏ పాల్‌పై అత్యున్నత ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని కేఏ పాల్‌కు సూచించింది.

కాగా, ఇప్పటికే కేఏ పాల్ అనేక అంశాల్లో చాలా సార్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే, కేఏ పాల్ వేసిన చాలా పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది. ప్రస్తుత పిటిషన్ తరహాలోనే 2024లో తిరుమలను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలంటూ సుప్రీం కోర్టులో పాల్ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషన్ డిస్మిస్ చేసింది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లకు (ఈవీఎం) బదులు.. బ్యాలెట్ పేపర్లను వినియోగించాలంటూ 2024లో కేఏ పాల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టేసింది. 2023లో తెలంగాణ సెక్రటేరియట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై సీబీఐ విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు దేశంలో జరిగే అగ్నిప్రమాదాలపై సీబీఐతో విచారణ జరిపించాలా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది.




ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరియాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. "అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశాం. దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామాజిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారు" అని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజమ్మిల్ అహ్మద్, లఖ్‌నవూకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మమహ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు.. షాహీన్ కారులో ఓ ఏకే-47 రైఫిల్ లభ్యమైంది. "ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని ఆయా ప్రాంతాలతోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది.

వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది" అని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు.




## నల్గొండ జిల్లాలో ఉల్లిపాయల లారీ బోల్తా.. బస్తాలను ఎత్తుకెళ్లిన జనం

నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి ఏపీ లింగోటం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. యూటర్న్ తీసుకుంటున్న స్కూల్ బస్సును ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. బస్సులోని ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఉల్లిపాయల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అటుగా వెళుతున్న వాహనదారులు ఉల్లిపాయల బస్తాల కోసం ఎగబడ్డారు. అందినకాడికి తీసుకెళ్లారు. కాసేపటికి అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని నిలువరించారు.




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని.. లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి నేతలతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని వీడియో, ఫొటోల ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. సీ విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసినా కొందరు పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. "అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. జూబ్లీహిల్స్ ఓటర్లు తగిన రీతిలో బుద్ధి చెబుతారు. ఇంత అధికార దుర్వినియోగం జరుగుతున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదు. అన్ని విషయాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొచ్చాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరుతూ.. ఆయా బూత్‌ల వివరాలను సమర్పించాం. ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఆయా చోట్ల నియమించాలని కోరాం. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. నకిలీ ఓటర్ కార్డులు తయారు చేశారు. ఆ వీడియోను ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రికి గత రెండేళ్లుగా ఆరు గ్యారంటీలపై సమీక్ష నిర్వహించేందుకు సమయం దొరకలేదు. ఈ రోజు 6 గ్యారంటీలపై రివ్యూ పెట్టడం ఎందుకు? జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి మోకాళ్లపై తిరుగుతున్నారు. ఇవాళ 6 గ్యారంటీలపై సమీక్ష నిర్వహించడం జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేయడమే. కాంగ్రెస్ దివాలాకోరు రాజకీయాలు ప్రజలకు అర్థమయ్యాయి. రేవంత్‌రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారు" అని హరీశ్‌రావు అన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్: కిషన్‌రెడ్డి




సికింద్రాబాద్: శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దాలనేది తన ఆకాంక్ష అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. " రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం"అని కిషన్‌రెడ్డి తెలిపారు.



చురకలు

మంగళవారం 11 నవంబర్ 2025


# మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర - నవంబర్ 11... ఆంధ్ర పితామహుని వర్ధంతి



మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహాసంస్థ. ఆయన జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజానాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృతిని కలిగించి, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహుభాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీయుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రో ద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్రమహా సభలలో వాహినిగా ప్రవహించింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణాలో గ్రంథాలయాల అభివృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి) న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసేవాడు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణాత్మకమైన సంస్థలద్వారా జరిగింది. ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధనీ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడు తున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటించారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవమానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్రజన సంఘం. అధ్యక్షుడు రావు బహదూర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంతరావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డాయి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ డానికి వర్తక సంఘాలను స్థాపించింది. పటేల్– పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధపడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగించారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అనుమతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టుపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టిపూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభవోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులుగా కొండా వెంకటరంగారెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులుకు తులాభారం జరుపగా, సంబంధిత రూ.6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుమంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించిన పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది. బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియాకు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశంలో ప్రప్రథమ బాలికల పాఠశాలల్లో ఒకటైన మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణ గూడలో స్థాపించారు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేట్ బిరుదు నిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్లలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా. బాబు రాజేంద్రప్రసాద్ హైదరాబాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాలతో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, గనిసొరంగం, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాదు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లి కాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడపాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'. రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగారు తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిరహంకారంలో నిక్కచ్చి వంటివి కలిగిన వ్యక్తి. అందరినీ కలుపుకు పోయే లక్షణం, ఉద్వేగం లేని స్వభావం వల్ల ఆయన అజాత శత్రువుగా నిలిచారు.రాజకీయాల్లో ఆయన మితవాది, అయినా ఆయన రాజకీయాదర్శాలను వ్యతిరేకించే కమ్యూనిస్టులు కూడా ఎంతగానో గౌరవించేవారు. శాసన మండలి అధ్యక్ష పదవీ విరమణ అనంతరం విశ్రాంతి జీవితాన్ని గడుపుతూ 1970 నవంబరు 11వ తేదీన తమ 86వ ఏటా మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేశ తొలి విద్యా మంత్రి అబుల్ కలాం

## ఐ ఐ టి వ్యవస్థాపకుడు ఆజాద్ - నవంబర్ 11... అబుల్ కలాం ఆజాద్ జయంతి




దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశాడు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888 ఁ ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో 1888 నవంబర్ 11 న జన్మించారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చాడు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వచ్చాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించాడు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసు కున్నాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టాడు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్స రాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసాడు. ఆ సమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించ సాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నాదని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించాడు. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ –ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించాడు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినాడు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యా గ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించాడు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతేకాదు ఆయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలామ్' అనేది బిరుదు.. 'ఆజాద్' అనేది ఆయన కలం పేరు. ఆయన అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషలలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. స్వయంగా సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశాడు. చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహించారు. పాఠశాలలు, కళాశాలల నిర్మాణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించాడు. 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చాడు. అలాగే "ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం వ్యక్తి జన్మహక్కుగా పరిగణించాలి. లేదంటే పౌరులుగా తమ విధులను పూర్తిగా నిర్వర్తించలేరు'' అని అబుల్ కలామ్ ప్రాథమిక విద్య గురించి వివరించాడు. అంతే కాదు, ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొచ్చాడు. ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించ బడింది. ఆయన ఒక దూరదృష్టిగల వ్యక్తి, భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతాడు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుంది అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నాడు. గాంధీజీ ఆయనను భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఆయనను మౌలానా, మీర్–ఎ–కారవాన్ అని పిలిచేవాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# హాస్య నటనకు నిఘంటువు రమణారెడ్డి

## నవంబర్ 11... బహుముఖ ప్రజ్ఞాశాలి వర్ధంతి



తెలుగులో తొలి తరం హాస్య నటులలో సాటి లేని మేటి, బహుముఖ కళాకారుడు, ఇంద్ర జాలికుడు, రంగస్థల నటుడు, సమాజ సేవకుడు, ఉదారుడు, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో రాణించిన హాస్య రత్నం తిక్కవరపు వెంకట రమణారెడ్డి. ఒకనాడు తెలుగునాట ప్రతి ఇంటా నవ్వుల పువ్వులు పూయించి, ముప్పై ఏళ్ల క్రితం హాస్య నటుడుగా ఒక వెలుగు వెలిగిన మహా నటుడు రమణారెడ్డి. అప్పట్లో సన్నగా, బక్క పల్చగా ఎత్తుగా ఉన్న వాళ్లని రమణా రెడ్డి లా ఉన్నావని పోలుస్తుండే వారు. నేటికీ రమణారెడ్డి ఆట, పాట, నటన టీవీలలో చూసి ఆనందించటమే కాకుండా నేటి యువ కళాకారులు కూడా ఆదర్శ ప్రాయంగా తీసుకునే గొప్ప నటుడుగా నిలిచి పోయాడు. నేటి తరానికి కూడా ఆయన నటనా నిఘంటవు. ఆయన ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదులుకొని సినీ రంగప్రవేశం చేశాడు. మూడు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించాడు. మాన వతా గుణంతో ఉచితంగా మ్యాజిక్ ప్రదర్శనలు ఇచ్చారు. సమాజ సేవలో ఉదార స్వభావాన్ని చూపాడు రమణారెడ్డి. నెల్లూరు జిల్లా జగదేవిపేట గ్రామంలో అక్టోబరు 1, 1921లో తండ్రి సుబ్బరామిరెడ్డి, తల్లి కోటమ్మలకు రెండో సంతానంగా జన్మించాడు. ప్రాథమిక విద్యను అభ్యసించే రోజుల నుంచే ఆయన నాటకాలలో నటించటం మొదలు పెట్టాడు. నెల్లూరు వీఆర్ కాలేజీలో ఎఫ్ఏ చదివేటప్పుడు మన మసను కవి ఆచార్య ఆత్రేయ, డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఊరూర నాటక ప్రదర్శనలు ఇస్తుండేవాడు. అదీకాక ఆత్రేయ రాసిన ఎన్జీవో నాటకంలో రమణారెడ్డి తండ్రి పాత్ర పోషించి తాను ఏడవకుండా ప్రేక్షకులను కంట తడిపెట్టించటమే ఆయనను సహజ నటుడుగా చేసింది. రమణా రెడ్డి కేవలం నటుడే కాకుండా ఒక రచయితగా కూడా సుప్రసిద్ధుడు. ఆ రోజుల్లో నెల్లూరులో నారపరెడ్డి రామిరెడ్డి నడిపిన మెరుపు సాహిత్య పత్రికలో మరణరే కలం పేరుతో రమణారెడ్డి ఒక ప్రత్యేక కాలం రాయటం గమనించాల్సిన అంశం. సినిమా రంగానికి రాక ముందు గుంటూరు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్ స్పెక్టర్ గా పని చేస్తూ మంచి మెజీషియన్ గా ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ ఆ తరువాతనే సినిమా పరిశ్రమలో అడుగు పెట్టాడు. సినిమా పరిశ్రమలో కూడా ఆ విద్యను హాబీగా ప్రదర్శిస్తూ ఉండేవాడు. లవకుశ చిత్ర నిర్మాత నెల్లూరు జిల్లా వాసి అయిన శంకర్ రెడ్డి ప్రోత్సాహంతో ఆయన మద్రాసుకు వెళ్లేందుకు మార్గం సులువైయింది. మొదటి నుంచి మ్యాజిక్ చేయటం సరదా అయినా దానిని అతి కొద్ది కాలంలోనే అభ్యసించాడు. తీరిక దొరికినప్పు డల్లా మ్యాజిక్ విద్యలో మరింత మెలకువలు నేర్చుకుంటూ కడుపుబ్బా నవ్వించేవాడు. రమణారెడ్డి మ్యాజిక్ ప్రదర్శనలు ఉచితంగా ఇచ్చేవాడు. సేవా సంఘాల సహాయ నిధికి ఉచితంగా ప్రదర్శనలు ఇచ్చేవాడు. డబ్బు సంపాదించేందుకు సినిమా ఉంది కదా, ఇది సమాజ సేవ కోసం అంటూ తన ఉదార స్వభావాన్ని చాటుకునేవాడు. నా మ్యాజిక్ పేదలకు ఏ మాత్రం ఉపయోగ పడినా తనకు ఆనందమే. అనటమే కాకుండా ఇందులో అనేక మంది వారసులను కూడా తీసుకు రాగలిగాడు. కొన్ని తెలుగు చిత్రాల షూటింగ్ విరామం సమయంలో అనేక గమ్మత్తులు ప్రదర్శించేవాడు. ఆ సమయంలోనే కవి రచయిత ఆరుద్ర కూడా చిన్న చిన్న మ్యాజికు చేస్తూ కలిసి మెలసి ఉండేవాడు. సినిమా పరిశ్రమలో ఏ పర్సనాల్టీతో మొదలయ్యాడో ఆదే శరీర ఆకృతితో ఉండేవాడు. కాని రబ్బరు బొమ్మలాగా చేతులు, కాళ్లు శరీరాన్ని తిప్పుతూ అత్యంత చలాకీగా ఉండేవాడు. కొన్ని సమయాల్లో ఉన్నట్టుండి కూలి పోవటం, దబాలమని పడిపోవడం, జరుగుతుండేది. ఆయన తొలి చిత్రం మానవతి. దర్శకులు వైవీ రావు. జంగం దేవర పాత్ర పోషించి తొలి ప్రయత్నంలోనే మంచి పేరు సంపాదించు కున్నాడు. పరిశ్రమలో రేలంగి, రమణారెడ్డి జంట హాస్యం చాలా కాలం గొప్ప స్థాయిలో నడుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునేది. అటు జానపదాలైన, సాంఘికమైన, పౌరాణికమైనా నెల్లూరు యాస ఆయన మాటల్లో దోబూచలాడు తుండేది. నీ పాసుగోల.. అనే పదం రమణారెడ్డి నోట ప్రత్యేకంగా ఉచ్చరించ బడుతుండేది. పైకి తమాషాగా కనిపిస్తూ ప్రదర్శించే విలన్ పాత్రకు పెట్టింది పేరు. ముఖ్యంగా హాస్యం కోసం కోతి చేష్టలు వేయటం, వెలికి వేషాలు వేయటం ఆయన పాత్రలలో మచ్చుకైనా కనిపించేది కాదు. కేవిస్ ప్రకాష్ రావు, తిలక్ వంటి ప్రసిద్ధ దర్శకుల చిత్రాలలో రమణారెడ్డి ఉండి తీరాల్సిందే రోజుల్లో ప్రేక్షకులతో పాటు దర్శక నిర్మాతలు ఎక్కువగా రమణారెడ్డి హాస్యాన్ని కోరుకునే విషయం అక్షర సత్యం. డిస్ట్రిబ్యూటర్లు కొనుగోలు దారులు రమణారెడ్డి ఉన్నారా అని అడిగి వ్యాపారం చేసుకునే వారు. వ్యక్తిగా ఆయన సౌమ్యుడు. తెరమీద ఎంత అల్లరి ఆర్భాటాలు చేసి నవ్వించే వాడో బయట అంత సీరియస్ గా ఉంటారు ఏమైన జోకు వేసినా సైలెంట్ గా ఉండేది. గట్టిగా కూడా మాట్లాడేవాడు కాదు. ఆయన సున్నిత మనస్కుడు. ఏనాడు ఏ ఒక్కరి గురించి చెడుగా గానీ, విమర్శలు కానీ చేయరనేది పరిశ్రమలో ఆయనకు ఉన్న మంచి పేరు. ఆయన నటించిన ఒక చిత్రానికి రఘుపతి వెంకయ్య కుమారుడు ప్రకాష్ దర్శకత్వం వహించాడు. వాహిని వారి సుమంగళి, దేవత చిత్రాలతో పాటు బంగారు పాప, మిస్సమ్మ చిత్రాలలో ముఖ్య భూమికలు పోషించారు. ముఖ్యంగా మిస్సమ్మ, బంగారు పాప చిత్రాల ద్వారా ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యాడు. కేవీ రెడ్డి పౌరాణిక చిత్రం మాయా బజారులో రమణారెడ్డి పోషించిన చిన్మయ పాత్ర గుర్తిండి పోయేదిగా మలచ బడింది. తొలి రోజుల్లో వేషాల వేటలో అనుభవం కోసం డబ్బింగ్ చిత్రాలకు గాత్ర దానం కూడా చేశాడు. నిర్మాతలు డబ్బులు ఎగ్గొట్టిన సందర్భాలలో, తన గాత్రం, దానంగానే మిగిలి పోయిందని, సరదాగా అనేవాడు. గుండమ్మ కథ చిత్రంలో సూర్య కాంతం అన్న గరటయ్యగా ఆయన పోషించిన పాత్ర గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందింది. ఆ చిత్రం యావత్తు ఆయన ఒకే ఒక కోటుతో కనిపించడం ఆశ్చర్యం. కుల గోత్రాలు చిత్రంలో పేకాట ప్రియుడుగా ప్రేక్షకులను మెప్పించాడు. అయ్యయ్యో జేబులో డబ్బులు పోయనే పాటలో నటన అతి సహజంగా అభిమానాన్ని పొందింది. అలాగే మిస్సమ్మలో డేవిడ్ పాత్ర కూడా అంతే సహజంగా నిలిచింది. కేవిస్ ప్రకాష్ రావు ఒక సినిమాలో నారదుడి వేషం వేయించటం, ముందుగా రమణారెడ్డి నేను నారదుడుని ఏమిటని, ఈ రోజు నారదుడు అంటారు.. రేపు హనుమంతుడు అంటారని ప్రకాష్ రావుతో వాదించినా దర్శకుడైన ప్రకాష్ రావు వినలేదు. రమణారెడ్డి నటన పట్ల ఆయనకు ఉన్న నమ్మకం అటువంటిది. అందువలనే ప్రకాష్ రావు నారదుడి వేషం వేయించి ఆయన ఎముకలు కూడా కనిపించకుండా జుబ్బా తొడిగి నటింప చేసిన ఘనత ఆయనకే దక్కింది. బంగారు పాపలో కూడా ముక్కు, గొంతుతో మాట్లాడినట్లు అత్యంత వెరైటీగా పాత్రను మలిచాడు. భానుమతితో అంతస్తులులో నటిస్తూ దులపర బుల్లోడా.. పాటలో నటించటం అప్పట్లో సంచలనంగా మారింది. శంకర్ రెడ్డి లవకుశలో సూర్య కాంతం ఆయనకు అర్ధాంగిగా నటించింది. ఇందులో వీరి హాస్యం ప్రేక్షకులను గిలిగింతలు పెడుతుంది. ఇంకా ఎన్నో చిత్రాల్లో ఎన్నో జిమ్మిక్స్ మ్యాజిక్స్ చేసి ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం పొందాడు. కొంగ కాళ్ల వంటి చేతుల విసుర్లు, స్పీడ్ నటన రమణారెడ్డి పేరు వినగానే గుర్తుకొస్తాయి. మనసారా నవ్వు పుట్టిస్తాయి. దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైగా స్టేజి, సినిమా, ప్రదర్శనలతో ఆయన తెలుగు ప్రేక్షకులను అలరించి, చిరస్మణీయుడుగా నిలిచి పోయాడు. అనారోగ్యానికి గు రైన ఆయన 1974 నవంబరు 11న శాశ్వతంగా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. ఆయన నటన ముఖ్యంగా హాస్యం, పెద్దరికం పాత్రలు, సాఫ్ట్ విలనిజం లాంటి పలు అంశాల పాత్రలకు ఆయన మోడల్ గా నిలుస్తూ ఎందరికో అధ్యయనం కలిగిస్తూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నేటికీ, రేపటికి కూడా చిరస్మరణీయుడుగా మిగిలిపోయిన మహానటుడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కవితలో కాలం పలికిన స్వరం ...అందెశ్రీ



తెలుగు నేలపై తన గొంతుతో, తన గీతాలతో ప్రజల గుండెల్లో నినదించిన పేరు అందెశ్రీ. అసలు పేరు అందె ఎల్లయ్య. విద్యా ప్రక్రియలో అడుగుపెట్టక పోయినా, ప్రజల మనస్సుల్లో పఠితుడైన కవి ఆయన. నిరక్షరాస్యుడైనప్పటికీ తన హృదయాన్ని కవిత్వంగా మార్చుకొని, తెలంగాణ భూమి, దాని భాష, దాని మనుషులు, దాని పోరాటాలకు స్వరం ఇచ్చిన అపూర్వ గేయకవి అందెశ్రీ. 1961 జూలై 18న అప్పటి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ఆయన జన్మించారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా పెరిగారు. చదువు లేకపోవడం ఆయన కవిత్వానికి అడ్డంకి కాలేదు. గొర్రెల కాపరిగా, తాపీ పనికూలీగా జీవనం సాగించిన ఈ కవి, తన అంతరంగంలోని వేదనను, ప్రకృతి పట్ల ప్రేమను, మానవతా విలువలను గీతాలుగా మలచాడు. నిజామాబాద్ ప్రాంతంలో తాపీ పని చేస్తున్నప్పుడు ఆయన పాటలు విన్న శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహారాజ్ ఆయనను చేరదీసి, ఆయన ప్రతిభను వెలికితీశారు. ఆ పరిచయమే కవి జీవితాన్ని మలుపుతిప్పింది. అక్షరాలను నేర్చుకోకపోయినా, అక్షరాలకు అర్థం చెప్పిన కవి ఆయన. తన ఆశు కవిత్వం, స్వతంత్ర వాక్యనిర్మాణం, అంతర్భావం ఆయనను ప్రజాకవిగా నిలబెట్టాయి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న రోజుల్లో, అందెశ్రీ గీతాలు ప్రజల్లో ఉత్సాహం నింపాయి. ఆయన గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందడం చారిత్రక ఘట్టం. ప్రతి విద్యాసంస్థలో, ప్రభుత్వ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయాన్నే ఆ గీతం ప్రతిధ్వనించడం ఆయన కవిత్వం ప్రజల్లో పొందిన స్థిరమైన స్థానం యొక్క సాక్ష్యం. అందెశ్రీ రచనల్లో మట్టి వాసన, మనిషి శ్వాస, భాష సౌందర్యం మిళితమై ఉంటాయి. ఆయన గీతాలు కేవలం వినోదం కోసం కాదు, అవి ప్రజల ఆత్మగీతాలు ఁ చైతన్యరాగాలు. "మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు" అనే గీతం (ఎర్ర సముద్రం సినిమా) సమాజంలో నశిస్తున్న మానవత్వంపై ఆయన ఆవేదనను ప్రతిబింబిస్తుంది. ఈ గీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు తెలుగు సిలబస్‌లో చేర్చడం ఆయన కవిత్వానికి లభించిన అంగీకారానికి చిహ్నం. "పల్లె నీకు వందనములమ్మో", "గలగల గజ్జెల బండి", "కొమ్మ చెక్కితే బొమ్మరా" వంటి పాటలు ఆయన సృజనలోని గ్రామీణ రసాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిఫలిస్తాయి. "జనజాతరలో మన గీతం", "యెల్లిపోతున్నావా తల్లి" వంటి పద్యాలు ఆయన లోని మానవతా కవి స్వభావానికి ఉదాహరణలు. 2006లో వచ్చిన 'గంగ' సినిమాకు ఆయన రాసిన పాటకు నంది పురస్కారం లభించింది. అదే సంవత్సరం నుంచి ఆయన పేరు రాష్ట్ర సరిహద్దులను దాటి ప్రతిధ్వనించింది. ఆయన ప్రతిభను గుర్తించిన కాకతీయ విశ్వవిద్యాలయం 2008లో గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఆ తర్వాత అమెరికాలోని అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డి.సి. వారిచే ఆయనకు గౌరవ డాక్టరేట్, లోకకవి బిరుదు లభించాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర విశిష్టమైనది. తెలంగాణ ధూంధాం కార్యక్రమ రూపశిల్పిగా ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం రగిలించిన కవి ఆయన. ఆయనే ప్రజా గీతాల రూపంలో ఉద్యమానికి ఊపిరి పోశాడు. 2014లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరును పద్మశ్రీ పురస్కారం కోసం ప్రతిపాదించింది. 2025 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు రూ. కోటి నగదు పురస్కారం అందజేయడం ఆయన సాహిత్య కృషికి లభించిన గౌరవం. అందెశ్రీ సాహిత్యం మట్టిలోనుంచి మొలిచినది. అది భాషలో, బతుకులో, బంధాలలో, బతుకుబాటలో దాగి ఉన్న మానవ వేదనను ప్రతిబింబిస్తుంది. కవిత్వం అనేది పుస్తకాలలో ఉండే అక్షరం కాదని, పల్లెలో వినిపించే గళమని ఆయన నిరూపించారు. తన గీతాలతో తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు రూపం ఇచ్చిన ఆయనకు, కవి కాకుండా ప్రజా భావజాలానికి ప్రతినిధి అనే విశేషణం సముచితమవుతుంది. సాహిత్య సృష్టులు ఆయన జీవితం ఁ ఆయన గీతాల్లో జలజీవన వేదన ఉంది, పల్లెల మనసు ఉంది, తెలంగాణ ఆత్మ ఉంది. నవంబర్ 10, 2025న ఆయన పరమపదించినా, ఆయన స్వరం తెలంగాణ మట్టి, గాలి, జలంలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అందెశ్రీ కవిత్వం ఁ తెలంగాణ గళం, ప్రజల హృదయం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం


# ఒకటి పక్కన 12 సున్నాలు.. మస్క్ ఆ డబ్బంతా ఏం చేస్తాడు?

చరిత్రలో ఏ సీఈఓకు లేనంత జీతం ప్యాకేజీతో ఎలాన్ మస్క్ రికార్డు పుస్తకాల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. టెస్లా వాటాదారుల సమావేశంలో.. మస్క్ కు $1 ట్రిలియన్ వేతన ప్యాకేజీని ఆమోదించారు. దీంతో ఎలాన్ మస్క్ సంపద టాపిక్ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మస్క్ ఇంత డబ్బును ఏమి చేస్తారు.. ఎలా ఖర్చు పెట్టుకుంటారనేది ఆసక్తిగా మారింది. అవును... ఇప్పటికే ఈ భూగ్రహంపై అత్యంత ధనవంతుడిగా నిలిచిన ఎలాన్ మస్క్ కు ఒకటి పక్కన 12 సున్నాలు పెడితే ఎంతవుతుందో అంత డబ్బుతో ఏమి చేస్తాడు, ఎలా ఖర్చు పెడతాడు అనేది ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఆ డబ్బుతో ఈ ప్రపంచ అకలిని అంతం చేయవచ్చు. అయితే ఎలాన్ మస్క్ డబ్బు ఖర్చు చేసే విషయంలో రెండు రకాల వెర్షన్స్ వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా... మస్క్ చాలా సింపుల్ లైఫ్ అనుభవిస్తారాని, ఉన్నవాటితో సర్దుకుపోతారే తప్ప భారీ లగ్జరీని పెద్దగా ప్రిఫర్ చేయడని చెబుతుంటారు కొంతమంది. మరోవైపు పలు అంతర్జాతీయ మీడియాల్లో వచ్చిన కథనాల్లో.. మస్క్ దగ్గర అద్భుతమైన లగ్జరీ లైఫ్ కి సంబంధించిన సౌకర్యాలు ఉన్నాయని చెబుతారు. అయితే వాటిలో కొన్నింటిపై అధికారిక ధృవీకరణ రాని పరిస్థితి. ఎలాన్ మస్క్ అసలు బిలియనీర్లా జీవించడు సరికదా.. కొన్ని సార్లు దారిద్ర్యరేఖకు దిగువన కూడా జీవిస్తుంటాడంటూ అతని మాజీ పార్టనర్ గ్రిమ్స్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. 2022లో వానిటీ ఫెయిర్ లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇదే సమయంలో. ఆమె ఎటువంటి భద్రా లేకుండా $40,000 ఇంటిలో నివసించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు! మరోవైపు మస్క్ లో ఉన్న ఈ జాగ్రత్త, పొదుపు చర్యలు, కాస్త పిసినారితనాన్ని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గుర్తించారని.. అందుకే ఆయనకు అత్యంత ప్రతిష్టాత్మకమైన డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) విభాగ నాయకత్వ బాధ్యతలు అప్పగించి ఉంటారని చెబుతారు. ఇదే సమయంలో... తనకు డబ్బుపై ఉన్న వ్యామోహం, అవసరం గురించి గతంలో మస్క్ చేసిన ట్వీట్ ను పలువురు ఈ సందర్భంగా కోట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా.... తనకు డబ్బు అవసరం లేదని.. తనను తాను అంగారక గ్రహం, భూమికి అంకితం చేసుకుంటున్నానని.. ఆస్తిపాస్తులు మిమ్మల్ని బరువుగా చేస్తాయని ఎలాన్ మస్క్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

**నాణానికి మరో వైపు!:** పైన చెప్పుకున్న పొదుపు, జాగ్రత్త, సింపుల్ సిటీ, పిసినారి అనే వెర్షన్స్ అలా ఉంటే... మరోవైపు మస్క్ దగ్గర అత్యంత విలువైన ఆస్తులతో పాటు లగ్జరీ సౌకర్యాలు ఉన్నాయని చెబుతుంటారు. ఇందులో భాగంగా... తన 11 మంది పిల్లలు, ముగ్గురు మాజీ భాగస్వాములను ఉంచడానికి టెక్సాస్ లో 14,400 చదరపు అడుగుల కాంపౌండ్ ను $35 మిలియన్లకు ట్రంప్ రహస్యంగా కొనుగోలు చేసినట్లు చెబుతుంటారు. ఇదే సమయంలో... అతని వద్ద జలాంతర్గామిగా మారగల ఒక కారు కూడా ఉందని.. పది లక్షల డాలర్ల విలువైన అనేక గల్ఫ్ స్ట్రీమ్ మోడల్ లతో సహా ప్రైవేట్ జెట్ కలక్షన్ కూడా ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలొచ్చాయి! వీటితో పాటు ఆయన వద్ద ఉన్న వాహనాల్లో 20వ శతాబ్దపు తొలి భారీ ఉత్పత్తి ఫోర్డ్ మోడల్ టీ కూడా ఉందని.. దీంతోపాటు 1967 జాగ్వార్ ఈ-టైప్ రోడ్ స్టర్, మొదటి టెస్లా మోడల్ టెస్లా రోడ్ స్టర్ కూడా ఉన్నాయని అంటారు. వీటిలో.. అత్యంత ప్రత్యేకమైన వాటిలో.. 1977 జేమ్స్ బాండ్ చిత్రం 'ది స్పై హూ లవ్డ్ మీ'లో ప్రదర్శించబడిన 1976 మోడల్ లోటస్ ఎస్ప్రిట్ ఒకటని అంటారు. ఈ సినిమాలో వెట్ నెల్లీ అనే మారుపేరుతో ఉన్న ఈ కారు జలాంతర్గామిగా రూపాంతరం చెందగలదు. మస్క్ ఈ కారును వేలంలో దాదాపు %వి%1 మిలియన్లకు కొనుగోలు చేసినట్లు చెబుతారు!

# రాజకీయంగా దిగజారిన ద్రోహులు సోను, సతీష్ లకు మా పార్టీ పంథాను తప్పు పట్టే హక్కు లేదు

## మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ

రాజకీయంగా దిగజారిన ద్రోహులు సోను, సతీష్ లకు
మా పార్టీ పంథాను తప్పు పట్టే హక్కు లేదు
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథానే కొనసాగిస్తుంది


చురకలు ప్రతినిధిహైదరాబాద్, నవంబర్, 10 మావోయిస్ట్ పార్టీ దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథానే కొనసాగిస్తుందని తమ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్న సోను, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న సతీష్ లు అవకాశవాదంతో, విచ్ఛిన్నకర వైఖరితో మరి కొందరు కేడర్ లను మోసగించి తీసుకుని వెళ్లి మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ ప్రభుత్వాలకు లొంగిపోయారని మావోయస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతి నిధి అభయ్ పేరుతొ ప్రకటన విడుదల చేశారు. ఆ లేఖ యాదవీధిగా అందిస్తున్నాం. రాజకీయంగా దిగజారిన వీరిద్దరూ మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందం చేసుకుని, పథకం ప్రకారం లొంగిపోయారు. దాదాపు 3 నెలల క్రితమే మహారాష్ట్ర ముఖ్యమంత్రి సోను లొంగిపోయేందుకు తమతో సంప్రతించారని పత్రికా ముఖంగా ప్రకటించారు. సతీష్ పాత్రికేయుల ద్వారా ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రితో సంప్రతింపులు జరిపారు. ఈ సంప్రతింపుల మేరకు, కొద్ది కాలం పాటు ఈ ప్రాంతాలలో ఆపరేషన్ లను నిలిపి వేస్తున్నట్టుగా గఢ్ చిరోలి జిల్లా పోలీసు అధికారి బహిరంగంగా ప్రకటించారు. నారాయణపూర్ జిల్లా పోలీసు అధికారి ఆదేశాలు జారీ చేసారు. ఈ రెండు రాష్ట్రాలలో గఢ్ చిరోలి, బీజాపూర్, నారాయణపూర్ జిల్లాల ప్రభుత్వ సాయుధ బలగాలు రక్షణ కల్పించాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఇంద్రావతి నదీ తీరంలో, దాని సమీప ప్రాంతాలలో అక్టోబర్ 13వ తేదీ నుంచి 16వ తేదీన వీరు లొంగిపోయే వరకు పెద్ద ఎత్తున బలగాలను మొహరించాయి. వీరి లొంగుబాటును సుగమం చేసాయి. గడచిన దశాబ్దాల తమ రాజకీయ జీవితాన్ని వీరిద్దరూ ఈ రకంగా వర్గ సామరస్య ధోరణితో, రాజ్యంతో కుమ్మక్కై ముగించుకున్నారు. భారత రాజ్యానికి లొంగిపోయిన సోను, సతీష్ తమ రాజకీయ దిగజారుడును కప్పి పుచ్చుకునేందుకు పార్టీ పంథాను తప్పు పడుతున్నారు. ప్రస్తుత దేశ కాల పరిస్థితులలో వచ్చిన మార్పుల కారణంగా దీర్ఘకాలిక ప్రజా యుద్ధ వ్యూహానికి కాలం చెల్లిందని, అందువల్ల సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నామని, బహిరంగంగా ప్రజా పోరాటాలలో పాలు పంచుకుంటామని చెబుతున్నారు. అలాగే మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాళ్ల కేశవరావ్ అమరుడు కావడానికి ముందు ఆయుధాలు విడిచిపెట్టి శాంతి చర్చలకు సిద్ధం కావాలని అన్నారని చెబుతున్నారు. ఇది శుద్ధ తప్పు. సోను, సతీష్ లు వాస్తవాలను వక్రీకరించి చెబుతున్న విషయాలివి. వాస్తవానికి, శాంతి చర్చలకు సంబంధించి సతీష్ అవగాహనలో ఉన్న లోపాలను వివరిస్తూ అమరుడు కామ్రేడ్ సంబాళ్ల కేశవరావ్ అతనికి ఉత్తరాలు రాసారు. ఈ ఉత్తరాలలో, ఆయుధాలు విడిచిపెట్టడం గురించి పార్టీ ఆలోచించరాదని, అటువంటిదంటూ ఏమన్నా ఉన్నా కూడా అది కేంద్ర కమిటీ మాత్రమే ఆలోచించాల్సిన విషయం అని వివరించారు. ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో ఆయా దేశాలలో తీవ్రమైన నిర్బంధం విరుచుకుపడినప్పుడు విప్లవ పార్టీలు అనేక నష్టాలు చవి చూసాయని, ప్రజలు కష్టాలు, కడగండ్ల పాలయ్యారని గుర్తు చేసారు. చిలీ దేశంలో సాయుధ పోరాటాన్ని విరమించి బహిరంగం అయిన పార్టీ ఎందుకూ కాకుండా పోయిందని రాసారు. కగార్ ఆపరేషన్ లో ఎదుర్కొంటున్న నష్టాలను నివారించేందుకు కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో 2024 ఫిబ్రవరి, ఆగస్టులలో రూపొందించిన ఎత్తుగడలను అమలు చేసేందుకు దృఢంగా పూనుకోవాలని, అలాగే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎక్కడికక్కడ ఎత్తుగడలు చేపట్టాలనివివరించారు. కాబట్టి ఆయుధాలు విడిచిపెట్టి శాంతి చర్చలకు వెళదామన్నది కామ్రేడ్ సంబాళ్ల కేశవరావ్ అభిప్రాయం కాదు అని స్పష్టంగా తెలియజేస్తున్నాం.

దేశ కాల పరిస్థితులలో మార్పుల గురించి చర్చించిన కేంద్ర కమిటీ 2021లో 'భారత దేశంలో ఉత్పత్తి సంబంధాలలో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం' దస్తావేజును రూపొందించింది. దేశంలో భూస్వామ్యం ఒక మేరకు బలహీనపడినప్పటికీ, ఇప్పటికీ భూస్వామ్యమే ప్రధాన వైరుధ్యంగా ఉన్నదని స్పష్టం చేసింది. అలాగే పెట్టుబడిదారీ సంబంధాలలో గతంతో పోల్చుకున్నప్పుడు కొన్ని మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, మెజారిటీ ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, భూమి సమస్య మౌలికమైనదని, కాబట్టి దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాను కొనసాగించాలని వివరించింది. దేశంలో గడచిన దశాబ్దాలలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కారణంగా వచ్చిన మార్పులను వివరంగా చర్చించి, ఎత్తుగడలలో మార్పులను రూపొందించింది. ఆయా ప్రాంతాలలో నిర్దిష్ట పరిస్థితులను బట్టి ఎత్తుగడలు ఎక్కడికక్కడ చేపట్టాలన్న మార్గదర్శకత్వం అందించింది. ఈ దస్తావేజుపై వచ్చిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చింది. ఈ దస్తావేజుతో సోను కానీ సతీష్ కానీ విభేదం వ్యక్తం చేయలేదు. ఇప్పుడు తమ అభిప్రాయాలను దస్తావేజుకు భిన్నంగా బహిరంగంగా మాట్లాడుతున్నారు. నిజానికి దేశ పరిస్థితులను అధ్యయనం చేసి వారు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ఉంటే పార్టీకి ఉపయోగపడేది. పార్టీలో అంతర్గత చర్చ కొనసాగించి ఉంటే ఆరోగ్యకరంగా ఉండేది. కానీ, వారు తామున్న బాధ్యతాయుత స్థానాలను, కేడర్ లలో రాజకీయ అధ్యయనంలో ఉన్న బలహీనతను వినియోగించుకుని కేడర్ లను తప్పు దోవ పట్టించారు. బాధ్యతా రహితంగా వ్యవహరించి కర్తవ్యాలను ఉల్లంఘించారు. కొందరు ఎస్ జడ్ సీ సభ్యులు కూడా ఈ తప్పుడు సూత్రీకరణలను ఆమోదించి వారితో కలిసి లొంగిపోవడం వారిలో అధ్యయన లేమిని తెలియజేస్తుంది..భారత దేశంలో కానీ మరే దేశంలో కానీ విప్లవోద్యమంలో ఉద్యమం పురోగమిస్తున్నందుకే దోపిడీ పాలక వర్గాలు నిర్బంధ క్యాంపెయిన్ లు చేపడతాయి. ఈ క్రమంలో విప్లవోద్యమం ఆటుపోట్లకు, ఎగుడు దిగుడులకు, మలుపులు మెలికలకు గురి అవుతుంది. కేడర్ లలో పారుబోతుతనం వస్తుంది. ప్రజలలో బలహీనుల నుంచి రాజ్యానికి ఉపయోగపడే శక్తులు తయారవుతాయి. తీవ్రమైన నష్టాలు ఎదురవుతాయి. అయితే వీటి వల్ల పార్టీలు వ్యూహం మార్చుకోవు. వ్యూహం దేశ కాల పరిస్థితులపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. సోను, సతీష్ లు మారిన పరిస్థితులంటున్న విషయానికి వివరణ ఇవ్వాలి. పైపై మాటలు రాజకీయ చర్చ కాదు. వారి అవగాహన, ద్రోహం ప్రాణ భయంతో వచ్చినవే తప్ప మరేమీ కాదు. పార్టీ ఎన్నడూ తన లోపాలను, పొరపాట్లను కప్పి పుచ్చుకోదు, కప్పిపుచ్చుకోలేదు. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటన అనే మూడు అద్భుత ఆయుధాలతో భారత కార్మికవర్గ అగ్రగామిగా విప్లవోద్యమానికి మార్గదర్శకత్వం వహించడంలో జరిగిన పొరపాట్లను కాంగ్రెస్ అనంతర 14 సంవత్సరాల కార్యాచరణను సంశ్లేషించి, విశ్లేషించిన కేంద్ర కమిటీ 2020లో రూపొందించిన కేంద్ర రాజకీయ నిర్మాణ సమీక్షలో పేర్కొంది. వివిధ సర్క్యులర్ లలో పేర్కొంది. వీటి గురించి పార్టీలో సభ్యుల వద్ద నుంచి పై స్థాయి కమిటీల వరకు ఎవరికైనా చర్చించే హక్కు, మార్పులు, చేర్పులు చేసే హక్కు ఉంటుంది. పార్టీ నిబంధనావళిని అనుసరించి ఈ రకమైన చర్చ చేయడం బాధ్యత గల కార్యకర్తలు చేయవలసిన పని. సోను, సతీష్ లు ఒక మేరకు ఈ చర్చ చేసి ఉండవచ్చు. కానీ దస్తావేజుతో తమకు భిన్నాభిప్రాయం ఉన్నదని అనలేదు. ఇప్పుడు 'కేంద్ర కమిటీ అన్నీ తప్పులే చేసిందం'టూ సోను ప్రజలకు క్షమాపణలు చెప్పడం. 'ఇక పార్టీ ఏం చేయలేదు. అందరం వచ్చిపోతాం, లేదా సరెండర్ చేయించుకుంటాడం'టూ సతీష్ ఏప్రిల్ నాటి నుంచి మాట్లాడడం ఒక కొసకు వెళ్లి ఆలోచించడం. వారు ఇంతకాలం నమ్మిన మార్క్సిస్టు తత్వశాస్త్ర గతితార్కిక నియమానికి విరుద్ధం. నిజమైన కమ్యూనిస్టులు గతితార్కిక భౌతికవాద దృష్టితో చూస్తారు. అప్పుడే ప్రతి అంశంలోను ఉన్న పాజిటివ్, నెగిటివ్ అంశాలు అర్థం చేసుకోగలుగుతారు. అనుకూలతలు ఉన్న కాలంలో రాబోయే ప్రతికూలతలను అంచనా కడతారు. అలాగే ప్రతికూలతలలో అనుకూలతలను చూడగలుగుతారు. ఇలా చేయకపోతే పెడధోరణి పట్టి, ఒక కొసకు వెళ్లిపోతారు. సోను, సతీష్ లు చేసినదిచే.

పరిస్థితులకు తగిన విధంగా తమ్ము తాము ఎదిగించుకోకపోవడం వల్లనే సోను, సతీష్ లు పెడతోవ పట్టారు. వారిలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, వ్యవహారపర లోపాలను పై, తమ, కింది స్థాయి కమిటీల నుంచి వస్తున్న విమర్శలను స్వీకరించి, సరిదిద్దుకోవాలన్న నిజాయితీ కొరవడడంతో నేడు ఈ స్థితికి చేరుకున్నారు. పైగా కేంద్ర కమిటీని దుమ్మెత్తి పోస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యునిగా సోను కమిటీలో చర్చ చేయకుండా, కేంద్ర కమిటీ ఏకగ్రీవంగా నిరాకరించిన తన అభిప్రాయాలను ప్రజలకు అపీల్ పేరుతో బహిరంగం చేయడం అతనిలో రాజకీయ దిగజారుడును, అవకాశవాదాన్ని తెలియజేస్తుంది. ఎస్ జడ్ సీ స్థాయిలో సతీష్ కేంద్ర కమిటీ అందించిన సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను, ఎత్తుగడలను చొరవతో అమలు చేయగలిగితే ఉద్యమానికి ఎంతగానో ఉపయోగపడేది. కానీ తన స్వంత అంచనాలతో కొనసాగాడు. ఈ ఇద్దరూ శత్రు నిర్బంధాన్ని అతిగా అంచనా వేసుకున్నారు. సుదీర్ఘ విప్లవ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. తమ అవగాహనా, ఆచరణా లోపాలను కప్పి పుచ్చుకుంటూ కేడర్ లను తప్పు దోవ పట్టించారు. అనేక నష్టాలు పొందడం, ఈ సంవత్సరం కేంద్ర కమిటీ సభ్యులు ఎనిమిది మంది అమరులు కావడం, కగార్ ప్రారంభమయిన నాటి నుంచి ఇప్పటి వరకు 16 మంది రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులు, పదుల సంఖ్యలో డీవీసీ, ఏసీ స్థాయి సభ్యులు, పార్టీ, పీఎల్ జీఏ సభ్యులు, విప్లవ ప్రజానీకం అమరులు కావడంతో, నష్టాలను నివారించుకోలేకపోతున్నామన్న ఆందోళనకు గురి అయిన కొందరు కేడర్ లు సోను, సతీష్ లు పార్టీ పంథాకు భిన్నంగా పెడమార్గంలో చెప్పిన సాయుధ పోరాట విరమణ, బహిరంగ కార్యకలాపాలే మార్గంగా భావించారు. పై స్థాయి కమిటీ సభ్యులుగా సోను, సతీష్ లు చెప్పిన దానిని నమ్మారు. ఇది వారి అవగాహనా లోపం. సుదీర్ఘ కాల రాజకీయ ఆచరణలో నేర్చుకున్న విషయాలను, ప్రజలు వారిపై పెట్టుకున్న ఆశలను మననం చేసుకుని వారంతా పునరాలోచించాల్సిందిగా కోరుతున్నాం. దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యం పీడిత వర్గాలు, సమూహాల పట్ల అంతులేని అన్యాయాలు, అత్యాచారాలు చేస్తున్నది. వీటి పట్ల ప్రజలలో తీవ్రమైన నిరసన, ప్రతిఘటన సాగుతున్నాయి. ఎక్కడికక్కడ పోరాటాలు జరుగుతున్నాయి. వీటిని సంఘటితం చేయడంలో పార్టీ వెనుకపడుతున్నదని కేంద్ర కమిటీ గుర్తించి, అందుకు తగిన నిర్ణయాలు చేసింది. ఈ నిర్ణయాలను అమలు చేయడంలో తీవ్రమైన సమస్యలు ఎదురయ్యాయి, లోపాలు జరిగాయి. అయితే వీటిని అధిగమించడం అసాధ్యం కాదు. ప్రకృతిలో తుఫానులు, కరువులు, వ్యాధులతో మరణాలు ఉన్నట్టుగానే విప్లవంలో నిర్బంధాలు, పారుబోతుతనాలు, నష్టాలు ఉంటాయి. ఈ చారిత్రక భౌతికవాద, గతితార్కిక నియమాన్ని అర్థం చేసుకున్న వారెవ్వరూ విప్లవం ఇక చేయలేం అని నిరాశకు గురి కారు. రాజకీయ వెనుకబాటుతనం, సైద్ధాంతిక గందరగోళానికి గురి అయిన వారు ప్రజల కోసం, అంతిమ విప్లవ లక్ష్యం సాధించేవరకు పోరాడాలనే దృఢ దీక్షను కోల్పోతారు. ప్రాణాలు అర్పించాలన్న అంకిత భావంతో విప్లవంలోకి అడుగు పెట్టిన వాళ్లు చివరి వరకు కొనసాగకపోగా, విప్లవానికి ద్రోహం తలపెట్టాలని కుటిల బుద్ధితో విప్లవ సిద్ధాంతంపై, రాజకీయ పంథాపై, పార్టీపై తప్పుడు మాటలు మాట్లాడతారు. ప్రజలను, కేడర్ లను గందరగోళానికి గురి చేస్తారు. పార్టీకి బహిష్కృతులై, ప్రజలకు దూరమై ఎందుకూ కొరగాకుండా పోతారు. లేదా ప్రజా వ్యతిరేకులుగా మారతారు. తెలిసీ తెలియకుండా తప్పు దోవ పట్టిన వాళ్లు, సరైన పద్ధతిలో ఆలోచిస్తే, ఎప్పటికైనా తిరిగి విప్లవం పక్షం వస్తారు. వర్గ రాజకీయాలను గుర్తెరిగిన విప్లవ కేడర్ లు, ప్రజలు ఎవ్వరూ ఈ అవకాశవాదుల మూర?పు మాటలు నమ్మరు. దేశంలో పీడిత ప్రజలు, సమూహాలు, ప్రజాస్వామికవాదులు, ప్రగతి కాముకులు, పాత్రికేయులు, ప్రజలూ అందరూ ఈ విషయాలను అర్థం చేసుకుంటూ తమ వంతు కర్తవ్యంగా విప్లవంలో భాగస్వాములుగా కొనసాగుతారని ఆశిస్తున్నాం. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దేశంలో వ్యవసాయ విప్లవం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, ప్రజల రాజ్యాధికారం సాధించి, సమసమాజ స్థాపన దిశగా అంతిమంగా కమ్యూనిజం సాధించే దిశగా ప్రయాణం చేస్తూ ఉంటుందని ఈ సందర్భంగా మరోసారి తెలియజేస్తున్నాం.

# విద్యా హక్కు పరి రక్షణ అందరి బాధ్యత - నవంబర్ 11... జాతీయ విద్యా దినోత్సవం

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటున్నాం. దీన్నే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారు. 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా విద్యా హక్కు పరి రక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. విద్యా హక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగంమందిబీ ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55% షెడ్యూల్డ్ తెగల్లో 63% దాకా ఉందని అంచనా. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించ గలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా




పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రప్రతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్సాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యా యులు గుర్తుంచుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించవలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఇందుకు ఉదాహరణ లుగా శ్రీరాముడు- విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు- సాందీపుడు, శివాజీ- సమర్ధ రామదాసు, వివేకానంద- రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ- పితృదేవోభవ- ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించడానికి, వెనకబడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్క భవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారిపోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# ఆగని వివక్ష!

పెద్దపల్లి : పెద్దపల్లి ప్రాంతానికి మంజూరైన చాలా కార్యాలయాలు, నిర్మాణాలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా ఈ ప్రాంతవాసులు వివక్షకు గురవుతూ నష్టపోతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని కార్యాలయాలు, వసతులు ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. తాజాగా గతంలో ఇక్కడి నుంచి తరలించిన ఆర్పీఎఫ్ అవుట్‌పోస్టు ఇదే తరహాలో మరోచోట ఏర్పాటు చేశారు.

**అడిగేవారేరీ..** పెద్దపల్లికి నలభై ఏళ్ల కిందట ఆర్టీసీ బస్‌డిపో మంజూరైంది. గతేడాది డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఏడాది గడిచినా పనులు ప్రారంభం కాలేదు. 20 ఏళ్ల కిందట మినీ స్టేడియం మంజూరైంది. కానీ నిధులు వెనక్కి వెళ్లి ఇప్పటి వరకు ఎలాంటి స్టేడియం నిర్మాణం జరగలేదు. రాజీవ్‌రోడ్డు నిర్మాణ సమయంలో స్టేట్ హైవే అథారిటీ కార్యాలయాన్ని ఏర్పాటు



చేశారు. కొన్నాళ్లకే ఇక్కడి నుంచి జగిత్యాలకు అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో జిల్లాలో హైవేల నిర్మాణం ప్రక్రియ అటకెక్కింది. 2003లో బైపాస్ రోడ్డు మంజూరైంది. గతేడాది బైపాస్ నిర్మాణానికి ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ సర్వే పనులు మొదలు కాలేదు.

**రైల్వేలోనూ..**

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌పై రైల్వేశాఖ మొదటి నుంచి వివక్ష ప్రదర్శిస్తుంది. రైళ్ల హాల్టింగ్‌ల నుంచి వసతుల కల్పన వరకు ఇది కొనసాగుతోంది. గతంలో ఇక్కడి హాల్టింగ్‌లు ఒక్కొక్కటిగా తరలిపోయాయి. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపిన మొదటి ఎక్స్‌ప్రెస్ హిమాసాగర్‌కు వరంగల్ తర్వాత మొదటి హాల్టింగ్ పెద్దపల్లి మాత్రమే. కానీ ఈ హాల్టింగ్ ఎత్తేశారు. చివరికి కరోనా కంటే ముందు వరకు హాల్టింగ్ కలిగిన పలు రైళ్ల హాల్టింగులను ఇప్పటి వరకు పునరుద్ధరించలేదు. తాజాగా పదేళ్ల కిందట ఎత్తేసిన రైల్వే భద్రత దళం అవుట్‌పోస్టుపై ఇన్నాళ్లు పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి. తాజాగా కరీంనగర్ స్టేషన్‌లో ఆర్పీఎఫ్ అవుట్‌పోస్టును ప్రారంభించారు.

# దూదీ.. ఏదీ..!

మిర్యాలగూడ : మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. పర్వదినాలు, సోమవారాల్లో ఉమ్మడి జిల్లాలోని బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో వారు అనేక అవస్థలు పడుతున్నారు. బస్సుల్లో నిలబడి ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చిన్నచిన్న ప్రమాదాలు జరిగిన సమయాల్లో చికిత్స అందించేందుకు బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు ఉండాలి. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నడుస్తున్న బస్సుల్లో 70 శాతం పైగా ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం గమనార్హం. చిన్న చిన్న గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు సదరు పెట్టెలో అవసరమైన మందులు, కాటన్, కట్టు




కట్టే వస్త్రం వంటివి అందుబాటులో ఉంచాలి.

ఇటీవల కొత్తగా వచ్చిన బస్సులు మినహాయిస్తే బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోగా.. ఉన్న బస్సుల్లో వాటిని సిబ్బంది మందులకు బదులుగా టిక్కెట్ ముద్రణ కాగితం, ఇతర సామగ్రి దాచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. లక్షలాది మంది ప్రయాణికులు నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో ఎవరో ఒకరు ఏదో ఒక చోట ప్రమాదాల బారిన పడుతూ గాయాలపాలవుతుంటారు. ఈ సమయంలో ప్రథమ చికిత్స పెట్టెల్లో వైద్య సామగ్రి ఉంటే ఎంతో మేలు కలుగుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

**పెట్టెల ఏర్పాటుకు చర్యలు...**

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్గొండ.

కొత్తగా వచ్చిన బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉన్నాయి. పాత వాటిలో గడువు తేదీ ముగిసిన వాటిని తొలగిస్తున్నాం. త్వరలోనే అన్ని బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు, వాటిలో సామగ్రి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం.

# రెచ్చిపోతున్న.. రాచపుండు

నిజామాబాద్ : క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధే కాని.. తొలిదశలో గుర్తిస్తే నివారణ ఎంతో సులువు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడితో జిల్లాలో బాధితుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఆరోగ్య సంరక్షణ, బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేటి 'ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవ' కథనం. దాచుకుంటే.. కుంగదీస్తుంది..జిల్లాలో గత సంవత్సరం ఆశా కార్యకర్తలు క్యాన్సర్ బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. 10,200 మందిలో ప్రాథమిక లక్షణాలను గుర్తించారు. తుది నిర్ధారణ పరీక్షలను ఏడుగురికి నిర్వహించారు. ఆడవాళ్లలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బయటపడుతోంది. పురుషుల్లో నోరు, ఊపిరితిత్తులకు వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తోంది. ఈ మధ్య కాలంలో ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ తినేవారిలో జీర్ణాశయ, అన్నవాహిక, పెద్దపేగు క్యాన్సర్లు పెరిగినట్లు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఉన్నత స్థాయి, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు సమస్య ఉన్నా బయటకు చెప్పుకోవడం లేదని, ఇది ప్రాణాపాయాన్ని కొనితెస్తుందని అన్నారు.

**సగం మంది ఆడవాళ్లే**

జిల్లాలోని క్యాన్సర్ బాధితుల్లో 50 శాతం మంది మహిళలే
60శాతం మందికి సర్వైకల్ క్యాన్సరే నిర్ధారణ అవుతోంది
మరో 30 శాతం రొమ్ము, పది శాతం ఇతర క్యాన్సర్ కేసులు బయటపడుతున్నాయి
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితుల్లో 80 శాతం మంది కోలుకుంటున్నారు.

ఆధునిక టీకాలతో కేసులు తగ్గాయి

క్యాన్సర్ కేసులు పెరగడంతో ప్రభుత్వం గత నెలలో జీజీహెచ్‌లో ప్రత్యేక చికిత్సా విభాగాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి.. కీమోథెరపీ, ఇతర చికిత్సలను జీజీహెచ్‌లో అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 85 మందికి ఉచిత చికిత్స అందుతోంది. స్త్రీలు రొమ్ము క్యాన్సర్ బారినపడకుండా మమోగ్రఫీ విధిగా చేయించుకోవాలి. సర్వైకల్ క్యాన్సర్‌ను 'పాప్ స్మియర్' టెస్ట్‌తో గుర్తించడం తేలిక. –డా.చైతన్య, క్యాన్సర్ వైద్య నిపుణుడు

# పేదోళ్ల పేరిట.. తోడేళ్ల దోపిడీ..!



ఖమ్మం : మధిర మండలం నక్కలగరుబు ఇసుక బజారు నుంచి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు కూపన్‌తో దెందుకూరుకు తరలించాల్సిన ఇసుకను వాహనంలో మాటూరుకు తీసుకెళ్తుండగా అక్టోబర్ 7న పోలీసులు పట్టుకున్నారు. సిరిపురం గ్రామం కూపన్‌తో మాటూరు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌నూ అదేరోజు స్వాధీనపరచుకున్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం అమలుచేస్తోంది. నిర్మాణ పనులు లబ్ధిదారులకు భారం కావొద్దనే ఉద్దేశంతో ఉచితంగా ఇసుక అందజేస్తోంది. దీనికోసం ఒక్కో లబ్ధిదారుకు గృహనిర్మాణశాఖ ఏఈ సూచన మేరకు తహసీల్దార్లు ఎనిమిది కూపన్లు ఇస్తున్నారు. వీటితో కొందరు వ్యాపారులు అక్రమ వ్యాపారానికి తెరలేపారు. ఒక్కో కూపన్‌పై ఒక ట్రాక్టర్‌లో తరలించాల్సి ఉండగా.. ఎక్కువ ట్రిప్పుల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. తనిఖీలూ కొరవడటంతో లబ్ధిదారు గ్రామానికి బదులు మరో ఊరికి తరలించి.. నిల్వచేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

**మూడు పర్మిట్లు.. ఆరు లోడ్లుగా దందా**

అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇసుక దందా మూడు పర్మిట్లు, ఆరు లోడ్లుగా సాగుతోంది. కూపన్లు ఉంటే ట్రాక్టర్ ఇసుకను రూ.3వేలకు విక్రయిస్తున్నారు. లేకుంటే ఒక ట్రాక్టర్‌కు రూ.3500–4,000 వసూలు చేస్తున్నారు. దమ్మపేటలో రూ.4వేలకుపైగా తీసుకుంటున్నారు. అశ్వారావుపేట మండలంలో గుండేటివాగు నుంచి తెచ్చుకునేలా అధికారులు కూపన్లు ఇస్తున్నారు. పెద్దవాగు, లోతువాగు నుంచి తెచ్చేదంతా అక్రమమే. ములకలపల్లి మండలంలో పాములేరు, సాకివాగు నుంచి అధికంగా తరలిస్తున్నారు. చంద్రుగొండ మండలంలో ఎదుళ్లవాగు నుంచి ఇసుక తోడేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసేది అక్రమమే. గోదావరి ఇసుక కావాలంటే 100కి.మీ. దూరంలోని భద్రాచలం, బూర్గంపాడుకు వెళ్లాలి. రవాణా ఖర్చులు ఎక్కువ కావటంతో వాహన యజమానులు స్థానికంగా పారే వాగులను తోడేస్తూ కాసులు దండుకుంటున్నారు. అనంతారంలో పెద్దవాగు నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే గ్రామస్థులకు ట్రాక్టర్‌కు రూ.200 చెల్లించాలి. దానికి రసీదూ ఇస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు జరపకపోవటం గమనార్హం. ప్రస్తుతం ఖమ్మం, కూసుమంచి, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని ఇసుక బజార్లు ఖాళీ అవటంతో ముందే నిల్వ చేసుకున్న వ్యాపారుల పంట పండుతోంది.

మొంథా తుపాను ప్రభావంతో రోడ్లు దెబ్బతిని వాహనాలు దిగబడుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఖమ్మం, కూసుమంచి, సత్తుపల్లి బజార్లకు ఇసుక తరలిస్తాం. ఇందిరమ్మ లబ్ధిదారుల పేరిట వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై తహసీల్దార్ల సహకారంతో చర్యలు తీసుకుంటాం. శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీడీ, భద్రాద్రి కొత్తగూడెం

# ధర్మకర్తల మండలి ఏర్పాటుకు వేళాయె



భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానానికి ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దేవాదాయశాఖ ద్వారా గురువారం ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. కొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఆశావహులు నిర్ణీత నమూనాతో నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు కొద్ది రోజులు గడువు ఇస్తారు. గడువు పూర్తయిన వెంటనే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుంది. పోలీసు కేసులు లేని వారికే దేవుడి గుడిలో కుర్చీ లభించనుంది. అన్నీ అనుకూలిస్తే ముక్కోటి ఏకాదశికి కొత్త ట్రస్ట్‌బోర్డు కొలువుదీరే వీలుందని భావిస్తున్నారు.

**ఆశలు చిగురించిన వేళ**

రామాలయంలో 2012లో 11 మంది ధర్మకర్తలు ఉండగా ఇందులో కురిచేటి పాండురంగారావు ఛైర్మన్‌గా పని చేశారు. తర్వాత మళ్లీ ధర్మకర్తల మండలి ఏర్పడలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ట్రస్ట్‌బోర్డు ఉంటుందని పలువురు పైరవీలు సాగించినా అవకాశం దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొద్ది నెలల క్రితం ధర్మకర్తల మండలి అవసరం ఉందని ప్రకటించడంతో పార్టీ నాయకులతో పాటు సామాజికవేత్తలు ధార్మిక సంఘ ప్రతినిధులు దరఖాస్తులు చేశారు. ఇదీ మూలన పడడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఈ పరిస్థితుల్లో దేవస్థానంలో దాదాపు 15 మందికి అవకాశం ఉండేలా నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రావడంతో ఆశలు చిగురించాయి. **సభ్యుడిగా నామినేట్ అయినా చాలు**

ఏడాదికి సుమారు రూ.80 కోట్ల ఆదాయం, 24 లక్షల మంది దర్శించుకునే కోవెల ఇది. ఇక్కడ చేసే శ్రీరామ నవమి వేడుక ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకం. దీంతో ఛైర్మన్ పదవి రాకపోయినా కనీసం సభ్యుడిగా అవకాశం వచ్చినా ఆ ప్రొటోకాలే వేరు అన్న భావన ఆశావహుల్లో ఉంది. రూ.350 కోట్ల బృహత్తర ప్రణాళిక అమలు చేయాల్సి ఉన్న ఈ తరుణంలో ట్రస్ట్ బోర్డు ఏర్పడుతుందా? లేక ఇంతకు ముందు లాగానే కాలయాపన చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

# ఉపాధి అంచనాకు గ్రామసభలు



కొణిజర్ల : వలసలను అరికట్టి స్థానికంగా ఉపాధి కల్పించటమే ఉపాధిహామీ పథకం లక్ష్యం. ఏటా వేల సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు జరుగుతున్నాయి. స్థానిక ఎన్నికల కారణంగా ఆలస్యమైనా ఇప్పుడు మళ్లీ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

**266 ప్రణాళికలు..** ఈ పథకంలో మొత్తం 266 పనులు జాబితాలో ఉన్నాయి. ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, కోళ్లఫాం, భూ అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఉపాధి పథకం గ్రామసభలు జరుగుతుండగా, మరికొన్ని మండలాల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంచనా విలువలతో పాటు పనుల సంఖ్య, అవసరమయ్యే కూలీల పనిదినాలను గుర్తిస్తారు. ఆ తర్వాత ఆమోదం కోసం మళ్లీ గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ముదిగొండ, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, తల్లాడ, కల్లూరు, కూసుమంచి, బోనకల్లు, మధిర మండలాల్లో ఎక్కువ ఉపాధి పనులు జరుగుతాయి. గుర్తించిన పనులు ఆ ఏడాదిలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో వ్యవసాయ రంగంపై 80 శాతం మంది ఆధారపడి ఉన్నారు. గ్రామాల్లో ఆయా సీజన్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక పనులకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. ఈ ఏడాది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో సైతం కూలీల సాయం తీసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో ఇంటికి 90 రోజులు పనిదినాలు కల్పించాలని నిర్ణయించింది. ఉద్యాన పంటలకు సంబంధించి రైతులకు గుంతలు, మొక్కలు నాటడం, నిర్వహణ కోసం పనులు గుర్తించవచ్చు. భూగర్భజలాల పెంపునకు సంబంధించి సేద్యం కుంటలు, సరిహద్దు కందకాలు, ఇంకుడుగుంతలు, భూ అభివృద్ధి పనులు, ముళ్ల కంపల తొలగింపు, మట్టి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమి స్తున్నారు. పంట కాలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించటం లేదు. జిల్లాలో ఇలా..పంచాయతీ లు– 571 జాబ్‌కార్డులు– 3.05 లక్షలు యాక్టివ్ కూలీలు– 2.86 లక్షలు

# మహమ్మారి.. పల్లెలపై సవారీ

ఆదిలాబాద్ : క్యాన్సర్.. పల్లెలపై విరుచుకు పడుతోంది.. ఒకప్పుడు ఎప్పుడో ఒక కేసు వెలుగుచూస్తుండగా.. నేడు సర్వసాధారణంగా మారింది. చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటు న్నారు.. చివరి దశ వరకు గుర్తించలేకపోవడం పెను ముప్పుగా మారుతోంది.. దైనందిన జీవితంలో మారిన ఆహారపు అలవాట్లు, ధూమపానం, తంబాకు, గుట్కా సేవనం కారణంగా అత్యంత వేగంగా విస్తరిస్తోంది. రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా క్యాన్సర్ విస్తరిస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వ్యాధి నిర్ధారణకు కొన్ని రకాల పరీక్షలు రిమ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారు.

**రిమ్స్‌లోనే కీమోథెరపీ**

రిమ్స్‌లో క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ అందించే గది ఇది.. ఇదివరకైతే ఈ సేవలకు బాధితులు హైదరాబాద్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే సెప్టెంబర్‌లో స్థానికంగానే బాధితులకు కీమోథెరపీ అందించటానికి ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు 8 మందికి చికిత్స చేశారు. మహిళలు సర్వైకల్, రొమ్ము, ఛాతి క్యాన్సర్ బారిన పడుతుండగా.. మద్యం, దూమపానం, తంబాకు, గుట్కా తినేవారు పెద్దపేగు, నోటి క్యాన్సర్ బారినపడుతున్నారు. మహిళలు వ్యాధులకు గురవకుండా ఉండటానికి ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని కొనసాగిస్తూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే



గుర్తించి చికిత్స అందిస్తోంది. అదేవిధంగా ఈ మహమ్మారి బారినపడి జీవిత చరమాంకంలో ఉన్నవారు నొప్పి తెలియకుండా తుది శ్వాస విడిచేలా రిమ్స్‌లో పాలియేటివ్ కేర్ సేవలందిస్తోంది. రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు రిమ్స్‌లో మామోగ్రఫీ అందుబాటులో ఉంది. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక దశలోనే వ్యాధి అరికట్టవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**కారణాలివీ..**

మద్యం, ధూమపానం గుట్కా, తంబాకు నమలటం..
ప్రాథమిక దశలో చికిత్స తీసుకోకపోవటం..
చిన్నపాటి గడ్డలు ఏర్పడినప్పుడు నిర్ధారణ పరీక్షలు చేయించుకోకపోవటం వాడిన నూనెను మళ్లీ వాడి తయారుచేసే ఆహార పదార్థాలు భుజించటం.. ప్లాస్టిక్ డబ్బాల్లో వేడి పదార్థాలు నిల్వ చేసి తినడం..

అధికారిక గణాంకాల మేరకు ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ బాధితులు 1,871 మంది ఉన్నారు. ప్రైవేటులో చికిత్సలు తీసుకునేవారు అదనం. ఇందులో కాలేయ, రక్త, గర్భాశయ, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, మెదడు, రొమ్ము క్యాన్సర్‌లు ఉన్నాయి. జిల్లాల వారీగా అధికారిక గణాంకాల ప్రకారం ఇలా.. ఉమ్మడి జిల్లాలో 1,871 కేసులుమంచిర్యాల 605 ఆదిలాబాద్ 618 కుమురంభీం 168 నిర్మల్ 480 జాగ్రత్తలు తీసుకుంటేనే రక్షణ

క్యాన్సర్ బారిన పడకుండా ఉండటానికి ముందు జాగ్రత్తలు పాటించాలి. 20–40 ఏళ్ల వయసు యువత ఎక్కువగా దీని బారిన పడుతున్నారు. 40 ఏళ్లు దాటిన వారు విధిగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.. దురలవాట్లకు దూరంగా ఉండాలి.. మహిళలు మామోగ్రఫీ పరీక్షలు చేయించుకోవాలి.

డాక్టర్ జక్కుల శ్రీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ సర్జికల్ అంకాలజీ, రిమ్స్ రిమ్స్‌లో ఏడాదిగా క్యాన్సర్ శస్త్ర చికిత్సలు

ఫిమేల్ జెనటల్ ఆర్గాన్ 95 ఇతర క్యాన్సర్లు 29 ఓరల్ క్యాన్సర్ 85 ఛాతి 92 గ్యాస్ట్రో 52 ప్యాంక్రియాటిక్ 03 మూత్రాశయ సంబంధిత 22 థైరాయిడ్ 35

# చలికి వణుకు.. చీకటైతే బిక్కుబిక్కు!

ఉట్నూరు : నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఏర్పాటు చేశారు. కానీ, కనీస సౌకర్యాలు లేకపోవడం, గ్రామాలకు దూరంగా నిర్మాణాలు చేపట్టడంతో నిత్యం విద్యార్థులు భయంగా గడపాల్సిన పరిస్థితి.. చలి గాలులకు, రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లాలో మొత్తం 12 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. ఇచ్చోడలో 2, ఉట్నూరు 3, బజార్‌హత్నూర్ 1, ఆదిలాబాద్ 2, ఇంద్రవెల్లి 2, బోథ్‌లో 2 కొనసాగుతున్నాయి. 3 వేల మంది విద్యార్థులు అక్కడే ఉంటూ కళాశాలలకు వెళ్లి విద్యనభ్యసిస్తారు. గ్రామాలకు దూరంగా పంట పొలాలకు సమీపంలో ఉన్నాయి. కనీసం ప్రహరీలు కరవయ్యాయి. విషజీవులు, అడవి పందులు వస్తున్నాయి. ఉదయం, సాయంత్రం క్రీడలు ఆడే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల అద్దె భవనంలో, ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. కిటికీలు సరిగా లేకపోవడంతో తమ వెంట తెచ్చుకున్న దుప్పట్లను అడ్డుగా పెట్టి వసతి పొందుతున్నారు.

ప్రహరీ లేక..ఇది ఉట్నూరులోని పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహం..



ప్రహరీ లేకపోవడంతో విషజీవులు, మూగజీవాలు సంచరిస్తున్నాయి. దాదాపు 600ల మంది విద్యార్థులు భయంగా గడుపుతున్నారు. భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ కరవైంది.

**దుప్పట్లే అడ్డుగా**

కిటికీలకు దుప్పట్లు అడ్డుగా పెట్టిన ఈ దృశ్యం ఇచ్చోడలోని బాలుర పోస్టు మెట్రిక్ వసతి గృహంలోనిది.. ఇక్కడ 120కి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. కిటికీలు, ప్రహరీ లేవు. చలిగాలులకు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పోస్టుమెట్రిక్ వసతి గృహాలు : 12
విద్యార్థులు : 3000 (దాదాపు)

# కమల వ్యూహం.. గెలుపే లక్ష్యం

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భాజపా ప్రచారంలో సర్వశక్తులు ఒడ్డుతోంది. క్షేత్ర స్థాయిలో ఓటర్లను కలుసుకోవడమే లక్ష్యంగా రెండంచెల కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సహా పార్టీ ముఖ్యనేతలంతా ప్రచారంలో భాగస్వామ్య మయ్యారు. ద్వితీయ శ్రేణి నాయకులు నేరుగా ఓటర్లను కలుస్తుండగా.. రాష్ట్ర నేతలు ర్యాలీలు, రోడ్‌షోలను నిర్వహిస్తూ ఎక్కువమందికి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ముఖ్యనేతలు పాల్గొంటున్నారు. కీలక వర్గాలతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు.

**క్షేత్రస్థాయి కార్యాచరణ**

గత ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన బూత్‌లపై ఈ సారి ప్రత్యేక దృష్టి సారించింది. గతం కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకునేలా ప్రయత్నిస్తోంది. నేతలకు లక్ష్యాలను నిర్దేశించారు. నియోజకవర్గంలోని రోడ్లు, మురుగు, తాగునీటి సమస్యలతో పాటు వరద, పేదల ఇళ్ల నిర్మాణం వంటి అంశాలను లేవనెత్తుతోంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సుమారు 10 రోజులుగా ప్రతి డివిజన్‌లో అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ర్యాలీలు నిర్వహిస్తూ రోడ్‌షోల ద్వారా ఎక్కువమందిని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంఐఎంపై ప్రధానంగా అస్త్రాలు సంధిస్తోంది.

# గనుల వేట!

మేళ్లచెరువు : ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొత్త గనుల కోసం వేట మొదలుకానుంది. దీనికి సంబంధించిన భౌగోళిక స్థితిగతులపై భూగర్భ గనుల శాఖ ఇప్పటికే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నట్టు తెలిసింది. సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో సున్నపురాయి నిక్షేపాల ఆధారంగానే సిమెంటు పరిశ్రమల్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ జిల్లాల్లో దాదాపు 16 సిమెంటు పరిశ్రమలను స్థాపించగా, కొన్ని మూతపడ్డాయి. మరికొన్ని నడుస్తూనే ఉన్నాయి.

ఈ పరిశ్రమలతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని సిమెంటు కంపెనీలకు చెందిన పట్టా భూములూ వేలాది ఎకరాలు ఈ జిల్లాల్లోనే ఉన్నాయి. ప్రధానంగా సిమెంటు ఉత్పత్తికి అవసరమైన ఈ సున్నపురాయి కోసమే ఈ భూముల్ని ఆయా కంపెనీలు కొనుగోలు చేశాయి. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూముల్లో గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలోనే ఆదాయం సమకూరుతోంది. వందేళ్ల లీజు ఉన్న ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూముల్లోనూ సున్నపురాయి వెలికితీత నేపథ్యంలో ప్రభుత్వం మరింతగా ఆదాయ వనరును పెంచుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొత్త గనుల ఏర్పాటుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ఎంపిక చేయాలని నిర్ణయించి అధికార యంత్రాంగాన్ని క్షేత్రస్థాయికి పంపిస్తోంది. భూగర్భ గనుల శాఖ అధికార యంత్రాంగం ఈ పర్యటనలో నిమగ్నమైంది.

ప్రధానంగా మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లితో పాటు నల్గొండ జిల్లాలో సిమెంటు పరిశ్రమలు, సున్నపురాయి గనులకు అవకాశం ఉన్న మరికొన్ని మండలాలపైనే దృష్టి సారించినట్టు సమాచారం. ప్రధాన సిమెంటు కంపెనీలు ఈ జిల్లాల్లోనే నెలకొన్నాయి. వీటిలో కొన్ని కంపెనీల నుంచి ఇతర దేశాలకూ సిమెంటు ఎగుమతైన



సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో మున్ముందు గనుల విస్తరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటు ఆదాయాన్నీ పెంచుకోవాలని సంకల్పించిన ప్రభుత్వం ప్రైవేటు పట్టా భూముల్లో గనుల అన్వేషణ కోసం సర్వే చేపట్టనుంది. కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం పంట పొలాలున్నందున సర్వే చేయడం సాధ్యం కాదు. భూగర్భంలో గనులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలంటే.. కొంత లోతు వరకు తవ్వి శాంపిళ్లు సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ చేపట్టాలంటే దాదాపు ఎంపిక చేసిన ప్రాంతాలన్నీ రైతుల పట్టా భూములే కాబట్టి.. ముందు రెవెన్యూ అధికారుల సహకారం అవసరం. వారి సహకారం కోసం ఇప్పటికే భూగర్భ గనుల శాఖ యంత్రాంగం రెవెన్యూ అధికారుల్ని సంప్రదిస్తో ంది. శాంపిళ్ల పరీక్షల అనంతరం ఆయా భూముల సేకరణకు రైతులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపే అవకాశాలున్నాయని అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

# విలాసాలే లక్ష్యం.. 'మత్తు'మార్గం!



హైదరాబాద్: తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. పేదరికం.. చెడు స్నేహాలు యువత తప్పటడుగులు వేసేందుకు కారణాలుగా భావించేవారు. ఇటీవల సైబర్‌క్రైమ్, డ్రగ్ స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడుతున్న వారిలో అధికశాతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు ఉంటున్నారు. ఒక్క సంపాదన, ఈఎంఐలతో బతుకీడ్చటం నచ్చని వారు.. విలాస జీవితాన్ని ఆస్వాదించేందుకు అక్రమ కార్యకలాపాలను ఎంచుకుంటున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. అరెస్ట్ చేస్తున్న ప్రతి వెయ్యి మందిలో 800 మంది 25–40 ఏళ్ల మధ్య వయస్కులే. వీరందరి నోట వచ్చిన ఒకేమాట.. 40 ఏళ్ల లోపు ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాత ఏ కష్టం చేయకుండా గడిపేయాలంటూ చెప్పటం ఆశ్చర్యానికి గురి చేసిందని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. నగదు స్వాధీనం చేసుకునేఅవకాశం లేకుండా క్రిప్టో రూపంలో మార్చేస్తున్నారు. విదేశాల్లోని మిత్రులను బినామీలుగా మార్చి ఆస్తులు బదిలీ చేస్తున్నారు.

**ఎంజాయ్ చేయాలని..**

చెన్నైకు చెందిన రాహుల్(31).. ఉన్నత విద్య పూర్తిచేశాడు. నెదర్లాండ్స్‌లోని ప్రముఖ కంపెనీలో భారీ వేతనంతో కొలువు సంపాదించాడు. పబ్‌లో సరదాగా తీసుకున్న డ్రగ్స్‌కు బానిసగా మార్చాయి. నెమ్మదిగా పెడ్లర్‌గా అవతారమెత్తాడు. హెరాయిన్, కొకైన్ పెద్దఎత్తున తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. రెండుచేతుల సంపాదన.. వారాంతం ఇష్టమైనచోట వినోదాల విందు. రెండేళ్లకే రూ.కోటి చేసుకున్నాడు. నగరంలోని కొనుగోలుదారులకు డ్రగ్స్ ఇచ్చేందుకువచ్చి హెచ్‌న్యూపోలీసులకు చిక్కాడు. ఇదేబాటలో ఐటీఉద్యోగి రాహుల్, డీజే సిద్దార్థ, వ్యాపారి సంజయ్ మెహ్రా, ప్రైవేట్ ఉద్యోగి జాన్సన్‌రాజ్ డ్రగ్స్, క్రిప్టో కరెన్సీ మార్పిడితో అక్రమాలకు పాల్పడుతున్నారు.

**నగదు డ్రాతో ఊచలు..**

బిహార్‌కు చెందిన రంజీ క్రికెటర్ రిషి తుషార్(30). బరోడా జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఇంజినీరింగ్ చదివిన ఆయన ఉద్యోగం చేస్తే వచ్చే చాలీచాలని జీతం వద్దనుకున్నాడు. గోవాలో పరిచయమైన సైబర్ నేరస్థులతో చేతులు కలిపి విదేశీ ఫోన్‌నంబర్లతో సామాజిక మాధ్యమాల గ్రూపులు రూపొందించి వేల మంది అమాయకులకు లాభాల వల విసిరి మోసాలకు సహకరించాడు. వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చటం, అక్కడ జమ చేసిన నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్చి విదేశాలకు తరలిస్తూ రూ.లక్షల సంపాదనకు అలవాటుపడ్డాడు. ఒక బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా చేసిన నగదు ఇతడిని సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టిచ్చింది.

# ఇంతింతా వచ్చి.. అంతా ఆక్రమించి!



తాండూరు: జిల్లాలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా సంబర్భాల్లో ఆక్రమణలను నిర్ధారించుకోకుండా రెవన్యూ అధికారులు పట్టాలు జారీ చేస్తుండడంపై ఇటీవల హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రెవెన్యూ, నీటి పారుదల శాఖల సమన్వయ లోపంతో అడ్డులేకుండా పోతోందన్న విమర్శలున్నాయి.

**పొలాల్లో కలిసిపోతున్న శిఖం భూములు..**

గ్రామాలకు దూరంగా ఉండే చెరువుల శిఖం భూములను ఆనుకునే వ్యవసాయ పొలాలున్నాయి. రాజకీయ అండదండలున్న కొందరు శిఖం భూములను పొలాల్లో కలిపేసుకుంటున్నారు. దీనికి కొందరు రెవెన్యూ అధికారులు వంత పాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు సమీపంలోని చెరువు శిఖం భూముల్లోనైతే ఏకంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. వరద కాలువలను సైతం ఆక్రమిస్తున్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద పారే పరిస్థితులు లేకపోవడంతో ముంపు సమస్య తలెత్తుతోంది. సమీప పొలాలు, కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. తాండూరులో ఇప్పటికే మూడు కుంటలు కనుమరుగయ్యాయి.

**ఎక్కడెక్కడ..**

యాలాల మండలం కోకట్ చెరువు శిఖం భూమి 12 ఎకరాలుంటుంది. ఇప్పటికే ఎకరం భూమి ఆక్రమణకు గురైంది. స్థిరాస్తి వ్యాపారులు దీన్ని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఇప్పటికీ కొంత శిఖం భూమిలో నాపరాళ్ల వ్యర్థాలు, సుద్ద పోసి ఆక్రమణకు పాల్పడేందుకు తతంగం నడుపుతున్నారు.

వికారాబాద్ శివారెడ్డి పేటలో 11 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో లేఅవుట్లకు అనుమతి ఇవ్వడంతో ప్లాట్లు చేశారు. పరిగిలోని రుకుంపల్లి గేటు సమీపంలో చెరువు శిఖం భూమి 42 ఎకరాలు. ప్రస్తుతం 14– 20 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలింది ఆక్రమణకు గురైంది.

తాండూరు పట్టణంలోని గొల్లచెరువు శిఖం భూమి 78 ఎకరాలు. పదెకరాలు ఆక్రమణకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కడుతున్నారు.

ఏక్తా ఫసల్ కింద పంటలు సాగు చేయొచ్చు..

చెరువులు, కుంటల్లో నీరు లేకుంటే పంటలు పండించి ఆర్థికంగా లబ్ధి పొందొచ్చు. కొందరు సొంతానివని అమ్ముకొని సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మండలాలు: 20

చెరువులు, కుంటలు: 1,124

**రెవెన్యూ, పురపాలిక అధికారులకు ఫిర్యాదు చేశాం..**

– శిరీష, డీఈఈ, నీటిపారుదల శాఖ, తాండూరు

తాండూరు గొల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పురపాలిక, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. గొల్లచెరువు ఆక్రమణలకు సంబంధించి సంయుక్త సర్వేకు రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. ఎవరైనా శిఖం భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

# అనుమతి లేకపోతే బాదుడే



కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల్లో నూతన భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొత్తగా ఇంటిని నిర్మించుకునే కొందరు పట్టణ ప్రణాళిక ద్వారా అనుమతులు తీసుకోవడంలేదు. మరికొందరు అనుమతి ఒకలా, నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. అనుమతి కోసం వస్తే నిబంధనల పేరిట ముప్పు తిప్పలు పెడతారని, పెద్ద ఎత్తున ఫీజు చెల్లించాల్సి వస్తుందనే భయంతో అధికారుల వద్దకు రాకుండా, ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి ఎంతో కొంత అందించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. కానీ ఆ తర్వాత వచ్చే చిక్కులు మాత్రం గుర్తించడం లేదు.

**ఆస్తిపన్నులో వందశాతం జరిమానా**

రూ.లక్షలు ఖర్చు చేసి అనుమతి లేకుండా అన్ని హంగులతో భవనాలు నిర్మించుకుంటున్నారు. ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ విషయం బయటపడుతోంది. అనుమతి పత్రం లేకపోతే ఆస్తిపన్ను మదింపులో జరిమానా విధిస్తారని తెలుసుకోవడం లేదు.

మొత్తమే అనుమతి లేకపోతే వందశాతం, అదనపు నిర్మాణాలుంటే 25–75 శాతం అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ భవనాలకు జాతీయ బ్యాంకుల్లో రుణాలూ మంజూరు కావు. ఈ విషయం తెలియక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పురపాలికల్లో నాలుగేళ్ల వ్యవధిలో భవన నిర్మాణానికి 7,144 దరఖాస్తు చేయగా 5,261 అనుమతులు ఇచ్చారు. 1,883 అర్జీలను తిరస్కరించారు. వీరంతా భవనాలు నిర్మించుకొని పరోక్షంగా ఆస్తిపన్నులో జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కరీంనగర్‌లో అక్రమ నిర్మాణాల సంఖ్య లెక్కనే లేదు. వేల సంఖ్యలో ఉన్న ఇళ్లకు జరిమానా పడుతుందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరముంది.

కొత్తగా బిల్డ్ నౌ ద్వారా అనుమతి

కొత్త పురపాలక చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక విధానం రావడంతో నిర్దిష్ట సమయంలో అనుమతులు జారీ చేసేలా సులువు పద్ధతులు తీసుకొచ్చారు. సెప్టెంబరు 15లోపు టీజీబీపాస్ ద్వారా అనుమతులు ఇవ్వగా, ఆ తర్వాత నుంచి బిల్డ్ నౌ ఆప్, పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణ ప్రణాళిక అధికారులు మాత్రం ఏ విధానం వచ్చినా సరే పరిశీలించడంలో జాప్యం చేస్తున్నారు.

# ముగ్గు పోయరు.. మొగ్గు చూపరు..!

సూర్యాపేట: ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా మొదటి విడతలో పైలట్ గ్రామాలను ఎంపిక చేసి వారికి ధ్రువపత్రాలు అందజేయగా.. వారు నిర్మాణం చేపడుతున్నారు. ఇక రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా జాబితా ప్రకారం అర్హులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. నిబంధనల ప్రకారం ప్రొసీడింగ్ కాపీలను అందించిన 40 రోజుల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది. పనులు చేపట్టకుంటే వారిని తిరస్కరించి ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ జిల్లాలో మాత్రం అలాంటి వారి వివరాల సేకరణే మొదలు పెట్టలేదు. దీంతో అర్హుల జాబితాలో ఆ తర్వాత స్థానాల్లో ఉన్న తమకు అందని ద్రాక్షగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రెండో విడతలో ఇళ్లకు సంబంధించి అర్హులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి 70 రోజులు అవుతోంది. వారి



జాబితాను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు సేకరించి గృహ నిర్మాణశాఖ అధికారులకు, ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ఆ తరవాత వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తిరస్కరణ కోసం వారికి సంతకం తీసుకోవాల్సి ఉంది. కానీ కొందరు లబ్ధిదారులు సంతకం పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించడడానికి వీలు లేకుండా పోయింది.

**ఈ నెల అవకాశం ఇస్తున్నాం**

సిద్దార్థ, హౌసింగ్ పీడీ, సూర్యాపేట

అర్హులను ఎంపిక చేసి ప్రొసీడింగ్ కాపీలను అందించాం. ఈ కాపీలు అందుకున్న 40 రోజుల్లో ఇళ్లు ప్రారంభించకుంటే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. కాగా కొందరు ఇంటి నిర్మాణానికి సుముఖంగా లేరు. వారి వివరాలు ఎంపీడీవోల వద్ద నుంచి రావాల్సి ఉంది. ఈ నెల వరకు వారికి అవకాశం కల్పిస్తున్నాం. లేనట్లయితే తిరస్కరించి కొత్త వారికి అవకాశం కల్పిస్తాం.

# బకాయిలున్నా.. భరించాల్సిందేనా..!

హుజూర్‌నగర్: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలలో కోతలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. మరో వైపు యాసంగిలో మిల్లులకు ఇచ్చిన సీఎంఆర్ ఇంకా పూర్తి కాలేదు. అది పూర్తి చేయకపోతే కొత్త సీఎంఆర్ ఇవ్వబోమని అధికారులు అంటున్నా.. సీజన్ ముమ్మరంగా జరిగే సమయంలో ధాన్యం తీసుకోక, కేటాయింపులు చేసుకోక తప్పని పరిస్థితి ఉంది.



అధికారులు గత నెలలో విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఉమ్మడి జిల్లాలో గత వానాకాలం సీఎంఆర్ లక్ష్యంలోనూ ఇంకా కొంత మేరకు బకాయిలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నుంచి దాదాపు 30 శాతం, యాదాద్రి జిల్లా నుంచి 13 శాతం బకాయిలు ఉన్నాయి. ఇక యాసంగికి సంబంధించి సూర్యాపేట జిల్లా నుంచి కేవలం 22 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయింది. నల్గొండ 58 శాతం, యాదాద్రి జిల్లా నుంచి 39 శాతం మాత్రమే వసూలయ్యాయి. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం రాకడ ప్రారంభమైంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. బకాయిలు భారీగా పేరుకుపోవడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.

# ఆసుపత్రి నిధుల స్వాహా గుట్టు!

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాసుపత్రి నిధుల 'గోల్‌మాల్' వ్యవహారం ఇంకా ఎటూ తేలడంలేదు. నిధులను కాజేసిన కొందరిపై రెండేళ్ల కిందట విచారణ జరిగింది. అక్రమాలు నిజమేనని విచారణాధికారులు తేల్చారు. అయినా ఇప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. విలువైన ప్రజాధనం ఇష్టానుసారంగా పక్కదారి పట్టినా.. కనీసం ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

**రసీదుల్లేకుండానే..**రోగుల అవసరాల కోసం వచ్చిన డబ్బులను ఎలాంటి రసీదుల్లేకుండానే జిల్లాసుపత్రిలో కీలకంగా వ్యవహరించిన కొందరు కాజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద వచ్చిన సొమ్ము విషయంలో ఎలాంటి లెక్కలను నమోదు చేయలేదు. ఆడిట్‌లలో బయటపడ్డ లొసుగులను లోలోపల సమసిపోయేలా చేశారు. 2023లో ఓ మహిళా ప్రజాప్రతినిధి ఆసుపత్రిలో అధికారుల పనితీరు బాగాలేదని, జవాబుదారీతనం కొరవడుతోందని, నిధుల ఖర్చు ఇష్టానుసారంగా ఉంటుందంటూ అప్పటి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అప్పటి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి లలితాదేవి 2023 డిసెంబరు 20న విచారణ చేపట్టారు. అప్పటి సూపరింటెండెంట్‌తోపాటు అభియోగాలు వచ్చిన కీలక విభాగాల అధికారులను విచారించారు.

**ఎవరి ఒత్తిడితో..**విచారణానంతరం అప్పటి కలెక్టరు, డీహెంహెచ్‌వోలపై కొందరు రాజకీయ నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడితోనే ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఏడాదికి రూ.50–80 లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.2 కోట్ల మేర అవినీతి జరిగిందనే గతంలో ప్రచారం నడిచింది. ఆ నివేదికలను కూడా బయటకు రాకుండా కొందరు చక్రం తిప్పారు. ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్న కొందరు ఉన్నతాధికారులు ఈ పక్కదారి పట్టిన నిధుల ప్రస్తావన తెరమీదకు రాకుండా కలెక్టర్లపై ఒత్తిడి చేశారనే ప్రచారముంది. తాజాగా ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధి శేఖర్ ఈ నిధులను రికవరీ చేయాలని పోరాటం చేస్తుండటంతో ఏ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాలి. **లెక్కలేని ఖర్చు..**2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆసుపత్రి అభివృద్ధికి ఎన్‌హెచ్ఎం, కాయకల్ప కింద రూ.1.25 కోట్ల నిధులొచ్చాయి. ఇందులో రూ.93.19 లక్షలను వివిధ అవసరాల కోసం ఖర్చు చేశామని లెక్కలు చూపించారు. వీటికి రసీదుల్లేనే లేవు. నిధులకు సంబంధించి విచారణాధికారులకు రికార్డులను అందించలేకపోయారు.

# సర్వీస్ రహదారి.. అధ్వానంగా మారి

హైదరాబాద్: ' అవుటర్‌పైకి ఎక్కడానికి దిగేందుకు సర్వీసు రహదారులే కీలకం. ఆయా రోడ్లు భారీ వర్షాలతో గుంతలు పడ్డాయి. వేగంతో వెళ్లేటప్పుడు చిన్న గుంత ఉన్నాసరే... అది ప్రమాదాలకు దారి తీస్తుంది..'నిర్వహణ వీరిదే..: అవుటర్ రింగ్ రోడ్డు నిర్వహణ బాధ్యతలు ఏడాది క్రితం ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు ఇచ్చింది. ప్రధాన రహదారితోపాటు సర్వీసు రహదారులను ఆ సంస్థే చూడాలి. టోల్ వసూళ్లలో ఉన్నంత వేగం.. నిర్వహణలో కన్పించడం లేదు.

ఎక్కడంటే..: నార్సింగి, గండిపేట్‌గేట్, ఆర్థిక జిల్లా, మైహోం అవతార్ తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. వివిధ కారణాలతో రెండు వైపులా దాదాపు 14 ప్రాంతాల్లో



అనుసంధానం జరగలేదు. లింకులు లేని చోట సమీపంలోని గ్రామీణ రహదారుల నుంచి వెళ్లి సర్వీసు రహదారులపైకి చేరుకొంటున్నారు. అక్కడ నుంచి అవుటర్ రింగ్‌రోడ్డుపైకి వెళ్తున్నారు.

ఇక్కడ చెరువులు, ఇతర జలవనరులతోపాటు శంషాబాద్, ఘట్‌కేసర్, ఈదులనాగులపల్లి ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు అడ్డు వస్తున్నాయి. ఇక్కడ పై వంతెనలు నిర్మించాలి.

# కార్డొచ్చినా అందని సంక్షేమం!,

హుజూరాబాద్ : కొత్త రేషన్ కార్డులు వచ్చినా.. వీటి ద్వారా సంక్షేమ పథకాలు అందక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నాలుగైదు నెలలు గడిచినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. పురపాలికలు, మండల పరిషత్తు కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలు లేక నేరుగా దరఖాస్తులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ పథకాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. తమ చేతుల్లో ఏమీ లేదంటూ సమాధానమిస్తున్నారని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు.

**నెలల తరబడి తప్పని ఎదురుచూపులు**

రేషన్ కార్డులనే ప్రామాణికంగా చేసుకొని ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కానీ ఏళ్ల తరబడి రేషన్ కార్డులు లేక, సంక్షేమ పథకాలు అందక వేలాది మంది నిరుపేదలు నష్టపోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రేషన్ కార్డులు




జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి 87,755 కొత్త రేషన్ కార్డులు మంజూరవగా 1,91,464 మంది సభ్యులు లబ్ధిదారులుగా నమోద య్యారు. చాలా ఏళ్ల తర్వాత వీరికి రేషన్ కార్డులు వచ్చినప్పటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించక కేవలం ఉచిత బియ్యం తీసుకోవడానికే పరిమితయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఏడాదిన్నర నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఫలితంగా నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించే వారికి గృహజ్యోతి, పింఛన్లు, రూ.500లకే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అందక తీవ్ర నిరుత్సాహానికి గురవుతు న్నారు. అర్హత కలిగిన వేలాది మంది ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నా.. ప్రభుత్వం మాత్రం దరఖాస్తులు స్వీకరించడానికి అవకాశమివ్వడం లేదు. మీసేవలో వెబ్ ఆప్షన్ ఇచ్చిన తర్వాతే దరఖాస్తు చేసుకోవాలని, అంతవరకు తామేమీ చేయలేమని అధికారులు చెబుతున్నారు.

# ఆరేళ్లుగా.. హమాలీ బకాయిలు!

నల్గొండ : ధాన్యం కొనుగోలుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నల్గొండ జిల్లాలో ప్రారంభమవగా.. కేంద్రాల్లో విక్రయించడానికి వచ్చిన అన్నదాతలు హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.45 చెల్లించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ధాన్యం తూకం వేసి సంచుల్లో నింపి లోడింగ్ చేయడానికి హమాలీలకు రైతులు వీటిని చెల్లించాలి. గతంలో రూ.40 నుంచి రూ.42 వరకు వసూలు చేశారు. ఈసారి ధర పెంచారు. రైతులు హమాలీ ఛార్జీలు చెల్లిస్తే తర్వాత వారి ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం కొన్ని ఏళ్ల నుంచి చెబుతూ వస్తోంది. కానీ ఇప్పటి వరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి జమ చేసిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తుందా లేక పాత ఒరవడినే కొనసాగిస్తుందా అన్న దానిపైనా స్పష్టత లేదు.

**అన్నదాతలపై భారం** గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో దాదాపు పది విడతల్లో ధాన్యం కొనుగోలు చేశారు. ఆ ఐదేళ్లూ రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడో విడత ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏటా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. అదే అంచనాలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. రైతులకు ఉన్న ధరల ప్రకారం హమాలీ ఛార్జీల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ.10.40 కోట్లు వరకు భారం పడింది. పన్నెండు విడతలుగా ఇప్పటి వరకు రూ.58.37 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వం చెల్లించాలి సైదులు, రైతు కనగల్**

కొనుగోలు కేంద్రాల్లోధాన్యం కాంటా వేసిన వెంటనే హమాలీలు ఛార్జీలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కొన్ని రోజులు గడిచిన తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కానీ ప్రభుత్వం గత ఛార్జీలనే జమ చేయలేదు. ఈసారైనా ఇచ్చి రైతులపై భారం తగ్గించాలి

# రోడ్లు ధ్వంసం.. ఇసుక తవ్వకాలతో విధ్వంసం



కరీంనగర్ : మానకొండూర్ మండలం ఊటూరు సమీపంలో మానేరు నది నుంచి మళ్లీ ఇసుక తవ్వకాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గడిచిన కొన్ని నెలలుగా మూసి వేసిన రీచ్‌ను ఇటీవల తెరిచారు. సమృద్ధిగా ఇసుక ఉన్న ఇక్కడి ప్రాంతంలో గతంలో మూడు రీచ్‌లను టీజీఎండీసీ (తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ) పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు, తరలింపు విషయంలో ఇష్టారాజ్యమనే పంథా కొనసాగిందనే విమర్శలున్నాయి. గుత్తేదారులు స్థానికంగా ఉన్న రాజకీయ పెద్దల అండతో అడ్డూ అదుపులేకుండా సహజ సంపదను కొల్లగొట్టారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకుడి సహకారంతో నిబంధనలు అతిక్రమిస్తూ అధిక ఇసుకను లారీల్లో నింపారనే ఫిర్యాదులున్నాయి.

**దుమ్మూ.. ధూళి..**

ఊటూరులో ఇసుక రీచ్‌ల వద్దకు వచ్చే వందలాది వాహనాలతో మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే చిధ్రమైన దారులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వరుసగా వస్తున్న లారీలతో ఆయా గ్రామాల ప్రజలను దుమ్మూ ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూర్-జమ్మికుంట మార్గంలో కొన్ని నెలల కిందట వేసిన తారు రోడ్డు అన్నారం, లలితాపూర్, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ గ్రామాల చెంతన పూర్తిగా పాడైపోయింది. నిర్ణీత పరిమాణాన్ని మించి అధిక లోడుతో ఇసుక వెళ్తుండటంతో దారులు దెబ్బతింటున్నాయి. 20 టన్నులు తీసుకెళ్లాల్సిన లారీల్లో 25-30 టన్నులను వేస్తూ తీసుకెళ్తుండటంతో రోడ్లు రూపును కోల్పోతున్నాయి. ఊళ్లలోని జనావాసాల మధ్య నుంచే లారీలు వెళ్తుండటంతో దుమ్ముతో ప్రజల ఆరోగ్యానికి ఆపద పొంచి ఉంది. అతి వేగంగా నడుపుతుండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**పట్టని నిబంధనలు..**

ఊటూరులో మూడు బ్లాక్‌లకుగాను ప్రస్తుతం రెండే నడుస్తున్నాయి. ఒక బ్లాక్‌లో 5,928 క్యూబిక్ మీటర్ల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది.మరో రెండు చోట్ల కలిపి 1,53,920 క్యూ.మీ తవ్వకానికి అనువుగా ఉంది.వీటి చెంతన సీసీ కెమెరాల నిఘాను అన్ని వైపులా ఏర్పాటు చేయలేదు.లారీలో 2,3 జేసీబీ బకెట్లను అదనంగా పోస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు.రవాణా శాఖ అధికారులు దారి మధ్యలో వాహన తనిఖీలు చేపట్టడం లేదు.వే బ్రిడ్జి వద్ద పక్కాగా తూకం వేయాలి. కానీ పట్టించుకునే వారు కరవయ్యారు.నిర్ణీత పరిధిని మించి తవ్వకాలు చేస్తూ గుత్తేదారులు సొమ్ము చేసుకుంటున్నారు.

# అసలు కొలతల పుస్తకం ఎక్కడ?



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కిసాన్ నగర్ సమీకృత మార్కెట్ అభివృద్ధి పనులకు సంబంధించి మాయమైన కొలతల పుస్తకం(ఎంబీ) జిరాక్స్ ప్రతులు దొరికినట్లుగా ప్రచారం జరుగుతోంది. రెండేళ్లుగా ఈ ఎంబీపై రగడ జరుగుతుండగా అడుగు ముందుకు పడటంలేదు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రూ.4.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మించేందుకు అప్పటి అధికారులు అంచనాలు తయారు చేశారు. పనులు చేస్తుండగా అంచనాలకు మించి రికార్డు చేసి, నిధుల దుర్వినియోగంతోపాటు అక్రమాలు జరిగాయని మాజీ కార్పొరేటర్లు కమిషనర్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేశారు.

ఎంబీ పుస్తకం దొరకకపోవడం, నిర్లక్ష్యం వహించిన సంబంధిత ఏఈ గఫూర్‌ను ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మరో వైపు రెండు నెలల కిందట బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ దీనిపై కమిటీ వేశారు. కమిటీ ఆరా తీస్తుండటం, లెక్కలు తారుమారు అయ్యే అవకాశముందనే కారణాలతో జిరాక్స్ ఎంబీ బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) దగ్గర జిరాక్స్ పత్రాలు దొరికాయని అంటున్నారని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రతీ ఎంబీ పుస్తకం నకలు కాపీలు క్యూసీ దగ్గర లభిస్తాయనే నమ్మకం ఉండదు. అలాంటప్పుడు ఇదెక్కడి నుంచి వచ్చిందో తెలియడంలేదు.

**రెండింటిని పోల్చేందుకు చర్యలు**

సమీకృత మార్కెట్‌కు సంబంధించిన అసలు ఎంబీ దొరకకపోగా జిరాక్స్ ప్రతులలో ఉన్న కొలతలకు బల్దియా వద్ద వివరాలకు పోల్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. రెండింటిలో ఉన్న కొలతలు సమానంగా ఉంటే ఆ ఎంబీపై నమ్మకం కుదురుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొలతలను సస్పెండ్ అయిన ఏఈతోనే చేపట్టాల్సి ఉండగా ఆయన వచ్చేందుకు మొగ్గు చూపడంలేదని తెలిసింది.

**నివేదికలో జాప్యం**

మార్కెట్ నిర్మాణ పనులపై కొలతలు తేల్చేందుకు కమిటీ అధికారులు రెండు నెలలుగా విచారణ చేస్తున్నారు. కొలతల పుస్తకం లేకపోవడంతో కొలతలు సరిగ్గా నమోదు చేశారా? లేదా? రన్నింగ్ బిల్లు ఓచర్‌తోపాటు సీసీ ఫామ్‌లో వివరాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. దీని ఆధారంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన అంచనా పనికి, వాస్తవంగా జరిగిన బిల్లులో ఉన్న రికార్డు కొలతల తనిఖీ చేయాల్సి ఉంటుంది. నియమించిన ఇంజినీరింగ్ అధికారుల కమిటీ బృందం విచారణ చేపట్టి, నివేదిక అందించడంలో జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

# వైద్య విద్యకు వేళాయే!




గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పూర్తయి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం మొదటగా ప్రకటించిన వైద్య కళాశాలల్లో గోదావరిఖని లేకపోగా.. అనంతరం మంజూరిచ్చారు. దీంతో భవన నిర్మాణ పనులు ఆలస్యంగా మొదలైనప్పటికి త్వరితగతిన వసతి సదుపాయాలను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సింగరేణి ప్రోత్సాహంతో సంబంధిత గుత్తేదారు పనులను వేగవంతం చేశారు.

**సింగరేణి సహకారంతో ముందడుగు**

కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలంతోపాటు భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సింగరేణి యాజమాన్యమే కేటాయించింది. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తుండటంతో అంతే వేగంగా గుత్తేదారు పనులు చేపట్టారు. దంతవైద్య విభాగం(డెంటల్ కళాశాల) ఏర్పాటుకు సమాలోచనలు చేస్తున్నారు. నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు మంజూరుకాగా తరగతులు కొనసాగుతున్నాయి. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి సైతం సింగరేణి స్థలం కేటాయించగా ప్రభుత్వ నిధులతో పనులు కొనసాగుతున్నాయి. తాత్కాలికంగా నర్సింగ్ విద్యార్థుల వసతికి సింగరేణి అతిథి గృహాలను కేటాయించారు.

**రూ.510 కోట్లు కేటాయింపు**

వైద్య కళాశాల కోసం సింగరేణి యాజమాన్యం 21 ఎకరాల స్థలాన్ని అప్పగించడంతోపాటు భవనాల నిర్మాణానికి రూ.510 కోట్లు కేటాయించింది. వైద్య కళాశాలకు అవసరమైన అకడమిక్ బ్లాకులు, వసతి గృహాలు ఇతర భవనాల నిర్మాణాలకు సుమారుగా రూ.370 కోట్లు ఖర్చుకాగా.. మిగతా నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఐదంతస్తుల్లో విశాలమైన భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వైద్య విద్య పీజీ విద్యార్థులకు తరగతి, వసతి గదుల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

**16 నెలల్లోనే పూర్తి**

జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం బోధనాసుపత్రిలో పడకలు, తరగతుల నిర్వహణకు భవనాన్ని ముందుగానే సమకూర్చాల్సి ఉండగా.. సింగరేణి ఆసుపత్రిలోని పడకలను బోధనాసుపత్రికి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు కేటాయించారు. డిగ్రీ కళాశాలలో వైద్య విద్య తరగతులు నిర్వహించవద్దంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో ఆరు నెలల్లోనే మొదటి అకడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తిచేశారు. మరో రెండు అకడమిక్ బ్లాకులతోపాటు వైద్య విద్యార్థులు, ఆచార్యులకు వసతి గృహాలు, క్యాంటీన్, అతిథి గృహం తదితర భవన నిర్మాణాలు కేవలం 16 నెలల్లోనే పూర్తయ్యాయి.

# సన్నాలకు 292.. దొడ్డు రకాలకు 34

ఖమ్మం: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. దీపావళి పండుగ అనంతరం ఈనెల 25 నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో మొదట ఆరంభించనున్నారు. మిగతా ప్రాంతాల్లో వరికోతల ఆధారంగా ఏర్పాటుచేస్తారు. జిల్లావ్యాప్తంగా 326 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కల్లూరులో మొదలైన వరికోతలు**

కల్లూరు మండలంలో ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయి. బురద పొలాల్లోనూ యంత్రాలతో కోత పనులు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు మొదలుకాకపోవటం, వర్షాలకు ఆరబెట్టే వీలులేక పచ్చిధాన్యాన్ని నేరుగా ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటం, నేల తడిగా ఉండటంతో వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, సత్తుపల్లి మండలాల్లో రైతులు వేచిచూస్తున్నారు. ఎండలు కాస్తే వారం, పది రోజుల్లో వరికోతలకు పూనుకుంటారు. పాలేరు, ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాల్లో వరిపైర్లు నవంబర్‌లో కోతకు రానున్నాయి.

**3.69 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం**

వానాకాలం ధాన్యం సేకరణకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 6.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా



వేశారు. అందులో స్థానిక అవసరాలు, మిల్లర్లు, ట్రేడర్లు కొనుగోలు చేయగా.. మిగిలిన 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో 3.51 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలు, 18వేల మె.ట. దొడ్డురకాలను కొననున్నారు. సన్నాల కోసం 292, దొడ్డు రకాల కొనుగోలుకు 34 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

**గత సమస్యలు పునరావృతం కాకుండా**

జిల్లాలో కొనుగోలు లక్ష్యం మేరకు 92.40లక్షల గోనెసంచులు అవసరమవగా 43.52లక్షల సంచులే అందుబాటులో ఉన్నాయి. యాసంగిలో కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించటంతో కొన్నిచోట్ల గన్నీసంచుల కొరత నెలకొంది. సకాలంలో మిల్లులు కేటాయించలేదు. మిల్లులు కేటాయించిన కేంద్రాల నుంచి ఎక్కువ లారీల్లో వడ్లు వెళ్లటంతో దిగుమతికి నిరీక్షించాల్సి వచ్చింది. వారం పాటు ఎగుమతి, దిగుమతి సమస్యలు ఎదురయ్యాయి. 'ఈనెల 25న కల్లూరులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. కోతలను బట్టి మిగిలిన మండలాల్లోనూ ఏర్పాటుచేస్తాం. అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తాం' అని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి కు తెలిపారు.

వానాకాలంలో 35 ఎకరాల్లో వరి సాగుచేశాం. కల్లాలు లేకపోవటంతో వర్షాలకు ధాన్యం ఆరబెట్టుకునే వీలులేదు. ముందస్తుగా వరి పండే మా మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవటంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం అందజేసే బోనస్ కోల్పోతున్నా.. విధిలేక అమ్ముకుంటున్నాం.

పోట్రు కార్తీక్, యర్రబోయినపల్లి, కల్లూరు మండలం

# ఇదేం పద్ధతి 'గురూ'!

కొత్తగూడెం : జువెనైల్ హోంలో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడాల్సిన సంరక్షకుడే కామాంధుడిగా మారాడు. హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ వీధి బాలురగృహంలో ఆరుగురు బాలురపై లైంగిక దాడి చేశాడు. అభం శుభం తెలియని బాలురపై అసహజ రీతిలో తరచూ వేధింపులకు పాల్పడిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది.బాలుడిపై లైంగిక వేధింపుల ఘటన బాధిత విద్యార్థిని మానసికంగా కుంగదీయగా.. పోలీసు కేసు, అవమాన భారం సదరు ఉపాధ్యాయుడిని ఆత్మహత్యకు పురిగొలిపింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని ఓ పాఠశాలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.విద్యార్థులపై లైంగిక వేధింపులు కేవలం బాధితుల వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాదు.. గురుశిష్యుల పవిత్ర బంధం వలాలను పెకిలించి యావత్ విద్యావ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇలాంటి వేధింపులను అరికట్టడంలో విద్యాసంస్థల నిర్వాహకులు విఫలమైతే పాఠశాలలు, వసతిగృహాలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకం కోల్పోతారు.

**ప్రశ్నార్థకంలో ఉపాధ్యాయ వృత్తి..**

కొంతమంది కీచక ఉపాధ్యాయుల చర్యల వల్ల ఉపాధ్యాయ వృత్తికే మచ్చపడుతోంది. తల్లిదండ్రులు, విద్యార్థులు.. టీచర్లను అనుమానంగా చూసే పరిస్థితి ఏర్పడుతోంది.భవిష్యత్తులో నిందపడుతుందనే భయంతో.. మంచి ఉపాధ్యాయులు సైతం విద్యార్థులతో వ్యక్తిగత సమస్యలు, మానసిక వికాసం గురించి మాట్లాడటానికి సంకోచిస్తారు. ఇది గురుశిష్యుల మధ్య ఆరోగ్యకరమైన బంధాన్ని అడ్డుకుంటుంది.

పోలీసు కేసులు, ఆరోపణలతో తమ పరువుకు భంగం కలిగిందని భావిస్తారు. మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకూ వెనుకాడరు.

విద్యార్థులపై మానసిక ప్రభావం..

పాఠశాలలు, వసతిగృహాలు సురక్షిత ప్రాంతాలు కాదనే భావన విద్యార్థుల్లో దీర్ఘకాలిక భయాన్ని సృష్టిస్తుంది.

గురువులను ఆదర్శంగా, రక్షకులుగా భావించాల్సిన పిల్లలు వారిపై నమ్మకాన్ని కోల్పోతారు.

బాధిత విద్యార్థులు తీవ్రమైన మానసిక ఆందోళన, కుంగుబాటు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలతో బాధపడతారు.

చదువుపై దృష్టిసారించలేరు. ఈ ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుంది.

**వీటిపై దృష్టిసారిస్తేనే..**

లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం(పోక్సో) గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ఈ చట్టం కింద శిక్షలు కఠినంగా ఉంటాయనే విషయం తెలియాలి. వేధింపులకు పాల్పడే ఉపాధ్యాయులపై తక్షణం శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదుచేయాలి. విద్యార్థులు ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి. బాలల హెల్ప్‌లైన్ నంబర్-1098తో కూడిన ఫ్లెక్సీలను విద్యాసంస్థల్లో ఏర్పాటుచేయాలి.

వ్యక్తిగత భద్రత విద్యను పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి. పిల్లలు ఏవిషయమైనా తల్లిదండ్రులతో చెప్పుకొనే వాతావరణం కల్పించాలి. పిల్లల అసాధారణ ప్రవర్తన గమనించి వారికి కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలి. ఉన్నతమైన వృత్తిలో ఉన్నామనే విషయాన్ని ప్రతి ఉపాధ్యాయుడు గుర్తించాలి.జువ్వాది వెంకటేశ్వరబాబు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కొత్తగూడెం

# సరదా స్నానం.. కారాదు ప్రాణాంతకం

నిడదవోలు : ఈ ఏడాది ఫిబ్రవరిలో మహాశివరాత్రి వేళ తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరి రేవులో స్నానానికి దిగిన అయిదుగురు విద్యార్థులు మృతి చెందారు. 2023లో రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు కొవ్వూరు వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. 2022లో బొబ్బర్లంక బ్యారేజీ, కొవ్వూరు వద్ద గోదావరిలో స్నానానికి దిగిన రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు యువకులు, ఒక వ్యక్తి మృతి కార్తిక మాసంలో విహార యాత్రల కు పంట కాలువలు, చెరువులు, వాగులు, కొండవాగులున్న ప్రాంతాలకు వస్తుంటారు. స్నానాలకు దిగి, లోతు తెలియక మృత్యువాత పడుతున్నారు.

**ప్రమాదకర ప్రాంతాలు..**



పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు, నిడదవోలు మండలం పందలపర్రు, పెండ్యాల, తాళ్లపూడి, తాడిపూడి, కాతేరు, బొబ్బర్లంక, విజ్జేశ్వరం, ధవళేశ్వరం ఆర్మ్

**ఏం చేయాలంటే..**

రేవులు ఉన్న చోటే స్నానాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పలు రేవుల వద్ద కనీసం గోదావరిలోకి దిగేందుకు కూడా అవకాశం ఉండదు. అటువంటి ప్రాంతాల్లో ఎవరూ దిగకుండా గస్తీతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించి యాత్రికులు అటువైపు వెళ్లకుండా రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

యాత్రికులు ఎక్కువగా వచ్చే సెలవు దినాల్లో ప్రధాన ప్రాంతాల్లో అధికారులు గస్తీ ఏర్పాటు చేయాలి.

# రుచుల 'కుండపోత'.. ట్రెండ్‌కు అనుగుణంగా పూతరేకులు

ఆత్రేయపురం : కోనసీమ అంటే కట్టిపడేసే దృశ్యాలే కాదు. నోరూరించే రుచుల పసందు. ఆ రుచుల్లో ఆత్రేయపురం పూతరేకులది ప్రత్యేక స్థానం. పూతరేకులంటే పంచాదార, బెల్లం డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసేవే కాదు.. ఇంకా బోలెడు రకాలు ఉన్నాయి. మధుమేహ బాధితులు తినేందుకు వీలుగా కాకరకాయ పొడి, కారంపొడి వేసి చుట్టిన పూతరేకులూ ఉన్నాయి. చిన్నపిల్లలు ఇష్టంగా తినడానికి చాక్లెట్ పౌడర్, బూస్ట్, హార్లిక్స్ చల్లినవీ లభిస్తాయి. ఇష్టంగా ఒక్క రోజులో తినేందుకు వీలుగా క్యారెట్, బీట్‌రూట్, తేనె జోడించి మరీ విభిన్న రుచుల్లో అందుబాటులోకి తెస్తున్నారు.

**ఎక్కడికైనా ఇక్కడి నుంచే..**

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రకరకాల పూతరేకులు అందుబాటులో ఉండటంతో ఇటీవల అమ్మకాలు పెరిగాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో ఫంక్షన్లు జరిగేటప్పుడు



వారి ఆహ్వానంపై వెళ్లి అక్కడే తయారు చేసి అందజేస్తున్నారు. శనివారం వచ్చిందంటే చాలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చేవారు వేల మంది ఇక్కడ ఆగి పార్సిళ్లు తీసుకెళ్లుతుంటారు.

**ఏటా రూ.6కోట్లు**

ఒకప్పుడు ఇంటింటా.. ఊరూరా తిరిగి అమ్మకాలు జరిపే స్థాయి నుంచి ఆన్‌లైన్ వరకు వ్యాపారం చేరింది. తయారీ, విక్రయంలో మహిళలదే కీలక పాత్ర. సినీ, ఇతర ప్రముఖులు, వివిధ సంస్థలకు ఇక్కడి నుంచే పూతరేకుల పార్సిళ్లు వెళ్తుంటాయి. ఆర్టీసీ, రైల్వే, విమాన కార్గోల ద్వారా ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఏటా రూ.6 కోట్ల వరకు లావాదేవీలు సాగుతున్నాయి.

**1200 మహిళా సంఘాలకు ఉపాధి**

ఒక్క ఆత్రేయపురం మండలంలోనే 1200 స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ పరిశ్రమపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఒక్కో మహిళ అమ్మకాల ద్వారా రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

# పేరుకున్న బకాయిలు.. తడారుతున్న గొంతులు..!


రాజమహేంద్రవరం : ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షిత జలాలు అందివ్వాలన్న 'జల్‌జీవన్ మిషన్' లక్ష్యానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టక, తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారుల బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని గాడిలో పెట్టినా.. బకాయిలు చెల్లించకపోవడంతో దాదాపు రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయి. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 65 పనులు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైతే 46 పనులు పూర్తి చేశారు. కానీ ఆరు పనులకే బిల్లులు చెల్లించారు. రంగంపేటలో పనులన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల పరిధిలో 34.16 కోట్ల అంచనా వ్యయంతో 86 పనులు మంజూరవ్వగా అయిదు మాత్రమే పూర్తయ్యాయి. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో రూ.28.57కోట్లతో 92 పనులకు గాను 76 పూర్తి చేశారు.

నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో రూ.48.78 కోట్లతో 92 పనులు కేటాయించారు. అవన్నీ నేటికీ ప్రారంభదశలోనే ఉన్నాయి. రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం మండలాలకు రూ.32.26 కోట్ల అంచనాలతో 51 పనులు మంజూరవగా సగం నిధులు సైతం ఖర్చు చేయలేని దుస్థితి. 27 పనులు వివిధ దశలో ఉన్నాయి.

త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. కొంత మేర బకాయిలు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. అని ఎస్ఈ గిరి అన్నారు.

రూ.216.30 కోట్లు: అంచనా వ్యయం రూ.35 కోట్లు: చెల్లించాల్సిన బకాయిలు
508: మంజూరైన పనులు 337: పూర్తి చేసింది
139: వివిధ దశల్లో ఉన్నవి 60,635: ఏర్పాటు చేయాల్సిన కుళాయిలు

# లెక్కలకు ఆటలే సమాధానం




ఆళ్లగడ్డ : విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు.. కానీ అడిగింది చెప్పడానికి 'లెక్క'లేనంత భయపడుతున్నారు. దీన్ని పోగొట్టడానికి కోటకందుకూరు ఆదర్శ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు (టీజీటీ) తూపల్లె వెంకటచంద్ర ఓ ఉపాయం పన్నారు. సమస్యకు సమాధానం చెబితే చరవాణిలో వీడియో తీస్తానని పిల్లలను ఉత్సాహపరిచారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో పెట్టి విద్యార్థులకు చూపించేవారు. వాటిని చూసిన వారు శెభాష్ అంటూ ప్రశంసించేవారు. దీంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది.

కేవలం బోర్డుల మీదే చెప్పడం కాకుండా ఆటపాటలతో చెప్పడం ఆరంభించారు. సంఖ్యారేఖపైన కూడిక, తీసివేతలను గీత గీసి దానిపై గెంతుతూ చెప్పడం, తొమ్మిదో తరగతిలో కోఆర్డినేట్ జామెట్రీలో వర్టికల్, హారిజాంటల్ గీతలు వేసి గమ్యస్థానానికి చేరడాన్ని విద్యార్థులతో గెంతులాట ఆడిస్తూ బోధిస్తున్నారు. ఛార్టుపైన రాయడం, రంగుల బొమ్మలు వేయించడం, వివిధ ఆకారాలను కృత్యాధారంగా చూపించడం, కర్రసాము, చెక్కభజన, కోలాటం ఆడిస్తున్నారు. ఇటీవల 'రఘుకుల తిలక' పాటకు కోలాటం చేస్తూ విద్యార్థులతో ఆయన చేసిన ప్రదర్శన వీడియో సామాజిక మాధ్యమాల్లో 6 లక్షల వ్యూస్ వచ్చాయి. ఇప్పటి వరకు చదువు, ఆటలకు సంబంధించి 500 వరకు వీడియోలు తీశారు. విద్యార్థులకు బోధించే వీడియో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చూసి ఎక్స్ వేదికగా అభినందించారు.

# ఘనులు మాటేసి.. ఖనిజం కాజేసి



నంద్యాల : అటవీ భూముల్లో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. డోన్ మండలంలోని కొచ్చెరువు, కన్నప్పకుంట, బాయిపల్లి అటవీ ప్రాంతాల్లో డొలమైట్, వైట్‌క్లే, తెల్ల సుద్ద, క్వార్ట్జ్ తవ్వకాలు భారీగా సాగుతున్నాయి. అక్రమార్కులకు రాజకీయ అండదండలు సమృద్ధిగా ఉండటంతో దందా సాగుతోంది.

**రాత్రి వేళల్లోనే...** ఎంపిక చేసిన కూలీలను లారీలు, టిప్పర్లలో ఎక్కించి అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్దేశిత ప్రాంతానికి తరలిస్తున్నారు. ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి నుంచి తీస్తున్న వైట్‌క్లే బలపాల పరిశ్రమలకు తరలివెళ్తుంది. బేతంచెర్ల మండలంలో అక్రమంగా బయటకు తీస్తున్న ఐరన్‌ఓర్.. చిన్న మల్కాపురం వద్ద బళ్లారి నుంచి దిగుమతి అవుతున్న ఇనుప ఖనిజంతో కలిపి ఇటీవలే ఏర్పాటైన పరిశ్రమకు తరలిస్తున్నారు.

**పర్మిట్లు లేకుండానే..**

జీరో బిల్ (బిల్లులు లేకుండా)తో ఖనిజాల రవాణాకు ఎర్రమల కొండల ప్రాంతంలో ప్రత్యేకంగా ఒక మాఫియా ఉందన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి పర్మిట్లు లేకుండా తరలిస్తున్నప్పటికీ కేసులు నమోదు చేస్తున్న ఘటనలు అంతంతమాత్రమే. ఇటీవల బేతంచెర్ల మండలంలో 1,000 టన్నుల ఐరన్ ఓర్‌ను అధికారులు పట్టుకున్నారు.

**వారి 'కనుసన్నల్లో'**

ఎవరు అధికారంలో ఉంటే ఆ ప్రాంత నాయకుల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్ సాగుతుంది. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెల కొండ అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, పేలుళ్లన్నీ ఎవరు 'గద్దె' నెక్కుతారో వారి నేతృత్వంలోనే జరుగుతాయి. ప్యాపిలి మండలం చంద్రపల్లిలో ఓ నాయకుడి ఆధ్వర్యంలోనే పదేళ్లుగా సాగుతోంది. బేతంచెర్ల మండలంలో ఐరన్‌ఓర్ అక్రమ తవ్వకాల సొమ్ము కొందరికి నెల మామూళ్లుగా మారిపోయాయి. డోన్ మండలంలోని మైనింగ్ మాఫియాతో పెట్టుకుంటే 'పీఠాలు' కదులుతాయన్న భావన ఉంది.

**అటవీ భూముల్లో యథేచ్ఛగా..**

ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి ప్రాంతంలో వైట్‌క్లే తవ్వకాలు సాగుతున్నాయి. అక్రమ మైనింగ్‌తో అటవీ ప్రాంతం దెబ్బతింటోంది. బేతంచెర్ల మండలంలో ఐరన్‌ఓర్ అక్రమ తవ్వకాలకు అంతే లేకుండా పోయింది. గూటుపల్లె, ముద్దవరం, రంగాపురం, ముసలాయిచెరువు ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి.

పాపసానికొట్టాల ప్రాంతంలో ఐరన్‌ఓర్‌ను పెద్దఎత్తున తవ్వి తరలించేస్తున్నారు.

డోన్ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెలికి తీస్తున్న క్వార్ట్జ్, డోలమైట్, తెల్ల సుద్ద ఇతర ప్రాంతాలకు తరలివెళ్తోంది.

# రాయి'తీయని'ఉపాధి

కర్నూలు : గ్రామీణ యువకులు, నిరుద్యోగులకు తేనెటీగల పెంపకం ద్వారా ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఉద్యానశాఖ ద్వారా సమగ్ర ఉద్యాన మిషన్ (ఎంఐడీహెచ్) కింద విరివిగా రాయితీలు అందిస్తున్నాయి. దీనికి ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందొచ్చు.

**ఎవరు అర్హులు**

తేనెటీగల పెంపకంపై శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రం కలిగుండాలి. ఎమ్మిగనూరులోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో వారం రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో శిక్షణ ఇప్పించి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

**ఈగలు ఎవరిస్తారు**

తేనె ఉత్పత్తికి సంబంధించి ఈగలు, పెట్టెలు ఉద్యాన శాఖ రాయితీపై అందిస్తోంది. బాక్సు, స్టాండు, తేనెటీగల తెట్టు కలిపి ఒక యూనిట్. ఒక యూనిట్‌లో 8 తేనెటీగల తెట్లు (రాణి ఈగలు, కూలీ ఈగలు) ఉంటాయి.

**ఎంత ఖర్చవుతుంది..**

ఒక వ్యక్తికి 50 యూనిట్లు (50 బాక్సులు) వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. ఒక యూనిట్ పూర్తి ధర రూ.4 వేలు కాగా అందులో 40 శాతం రాయితీ (రూ.1,600) ఇస్తారు. ఒక వ్యక్తి 20 నుంచి 50 వరకు బాక్సులను ఏర్పాటు చేసుకోవచ్చు. తెట్టు నుంచి తేనె తీసే యంత్రం (ఎక్స్‌ట్రాక్టర్) పూర్తి ధర రూ.20 వేలు కాగా.. అందులో 40 శాతం (రూ.8 వేలు) రాయితీ ఇవ్వనున్నారు.

**ఎక్కడ పెట్టాలి**

సొంత పొలం ఉండాల్సినవసరం లేదు. పూత ఉండే పంటల దగ్గర పెట్టెలను ఏర్పాటు చేయాలి. నువ్వులు, పొద్దుతిరుగుడు, వాము, కంది తదితర పంటల వద్ద పెట్టాలి. ఆయా పంటలకు రసాయనిక మందులు ఎక్కువగా పిచికారీ చేయరు కాబట్టి తేనెటీగల పెంపకానికి అనువుగా ఉంటుంది. పొలాల వద్ద పెట్టెలు పెట్టిన 20 రోజులకు తేనె ఉత్పత్తి అవుతుంది. 30 రోజుల తర్వాత నాణ్యమైంది వస్తుంది. ఒక బాక్సు నుంచి 3- 4 కిలోల తేనె వస్తుంది. కిలో రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయించొచ్చు.

# హాల'దారి' అవస్థలు

నందికొట్కూరు : జాతీయ రహదారి వెంట పొలాలకు వెళ్లేందుకు అవసరమైన బాటలు నిర్మించకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. బాటకు ఇరువైపులా ఉన్న పొలాలకు వెళ్లేందుకు రహదారుల సౌకర్యం లేక రైతులు కి.మీ.ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు దిగితే 10 మీటర్ల దూరంలో ఉన్న పొలానికి 4 నుంచి 6 కి.మీ దూరం చుట్టూ తిరిగి వెళ్తున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు పొలాలకు మార్గం లేకపోవడంతో ఆరు మండలాల పరిధిలో సుమారు 40 ప్రాంతాల్లో అన్నదాతలు తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసుకున్నారు. రహదారికి ఇరువైపులా.. పొడవునా గుత్తేదారులు దిమ్మెలు ఏర్పాటు చేయగా రైతులు వీటిని తొలగించి కంకర, మట్టి వేసి చదును చేసుకుని పొలాల్లోకి రాకపోకలు సాగిస్తున్నారు. దీనిని తొలగించాల్సిందేనని గుత్తేదారులు చెబుతున్నారని అన్నదాతలు వాపోయారు. పొలాలను పోగొట్టుకుని నష్టపోవడమేకాక పొలాలకు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారులు, పాలకులు స్పందించాలని వారు విన్నవిస్తున్నారు.

రస్తాలు మాయం

340సీ నంబరు జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా భూములు పోగొట్టుకున్న రైతులకు పరిహారం చెల్లించారు. సుమారు 750 మంది రైతులు తమ భూములను ఇవ్వాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లే రస్తాలు సైతం కనుమరుగయ్యాయి. ఎన్‌హెచ్ నిర్మాణ సమయంలో పొలాలకు వెళ్లేలా రహదారులు నిర్మించాలంటూ రైతులు గుత్తేదారులను నిలదీశారు. పనులను సైతం అడ్డుకున్నారు. తగిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిబంధనలు ఒప్పుకోవంటూ అధికారులు చేతులెత్తేశారు.

ఐదు వేల మందికి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా సమీపం నుంచి ఆత్మకూరు శివారు వరకు సుమారు 66.115 కి.మీ. మేర 340సీ నంబరు జాతీయ రహదారిని నిర్మించారు.

కల్లూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల పరిధిలోని పొలాల మీదుగా ఏర్పాటుచేశారు.

ఆరు మండలాల పరిధిలో ఎన్‌హెచ్ వెంబడి సుమారు 30 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంతో దీనిని ఆనుకుని ఉన్న 7,500 హెక్టార్లకు చెందిన సుమారు 5 వేల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

# పారిశ్రామికోత్సాహం

కాకినాడ: విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో ప్రపంచస్థాయి సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో మిగతా జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలతో సందడి తీసుకువస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో ఏపీఐఐసీ, పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ చేపడుతున్నారు. ఐలా, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలతో కలిసి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, పెట్టుబడులను ఆకర్షించేలా సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**పెట్టుబడులను ప్రోత్సహించేలా..**

ప్రస్తుతమున్న పరిశ్రమల యాజమన్యాలతో పాటు, కొత్త పారిశ్రామికవేత్తలు స్థానికంగా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తారు. ఇందుకోసం ఔత్సహికులతో 'ఐలా' పరిసరాల్లో పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులు సమావేశాలు నిర్వహిస్తారు.

**రూ.7.80 కోట్లతో మౌలిక వసతులు..**



ఐలా నిధులతో పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. వాకలపూడిలో రూ.3.98 కోట్లు, సర్పవరం రూ.3.13 కోట్లు, పెద్దాపురం ఐలా పరిధిలో రూ.87 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతారు. రెండుచోట్ల పనులకు టెండర్లు పిలిచారు. రహదారుల మరమ్మతులు, భద్రతా క్యాబిన్లు, ప్రవేశద్వారాల ఆర్చ్‌లను నిర్మించనున్నట్లు ఏపీఐఐసీ జెడ్ఎం రమణారెడ్డి తెలిపారు.

**ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ..**

వాకలపూడి, సర్పవరం, పెద్దాపురం పారిశ్రామికవాడలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జేసీబీలతో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు, కాలువల్లో పేరుకున్న పూడిక తొలగిస్తున్నారు. ఏపీఐఐసీకి చెందిన ఖాళీ స్థలాల్లో అటవీశాఖ నుంచి మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గ్రీన్ బెల్ట్ తగినంత ఉండేలా చూస్తున్నారు.

# 'సిండికేట్'గా నంజుకున్నారు

ఒంగోలు : సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘంలోని అక్రమాల పుట్ట పగిలింది. 2024-25 ఆడిట్ నివేదికలో మొత్తం బండారం బయటపడింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో త్రిమెన్ కమిటీతో సొసైటీ నిర్వహించారు. ఆ సమయంలో బైలాకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని రూ.కోటి మేర నిధులు పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూకట్ల విజయమ్మ ఛైర్‌పర్సన్‌గా త్రీమెన్ కమిటీని నియమించారు. ఆమె బాధ్యతలు స్వీకరించాక గతంలో చోటుచేసుకున్న అక్రమాలను గుర్తించి అధికారుల దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్రా సురేంద్రబాబుతో విచారణ




జరిపించారు. సమగ్ర పరిశీలన అనంతరం ఆడిట్ నివేదికను డీసీవోకు ఆయన సమర్పించారు. ప్రధానంగా ఆరు అంశాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు.

**ఇదిగో అక్రమాల చిట్టా...**

సంఘం భవనం, గోదాము నిర్మాణానికి టెండర్లు పిలవకుండా నాటి ఛైర్మన్ కనుసన్నల్లో పనులు చేపట్టారు. నిబంధనల ప్రకారం అంచనా వ్యయం రూ.5 లక్షలు దాటితే టెండరు పిలవాలి. దీనికి సంబంధించి ఎంబుక్‌లో లెక్కలకు, బ్యాంకులో డ్రాచేసిన నిధులకు సైతం రూ.లక్షల్లో వ్యత్యాసం ఉంది. ఎంబుక్‌లో రూ.64 లక్షల ఖర్చు చూపగా... బ్యాంకు నుంచి సుమారు రూ.98 లక్షలు డ్రాచేశారు.

సామాజిక, రైతు సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాల్సిన కామన్ గుడ్ ఫండ్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ.40 లక్షలను రిజర్వ్ ఫండ్ ఖాతాకు బదిలీ చేశారు.

మహాజనసభ ఆమోదం లేకుండా కార్యాలయం ఎండీని నియమించి... నెలకు రూ.50 వేలు వేతనంగా చెల్లించారు. నిబంధనలను కాదని విశ్రాంత అధికారిని నియమించారు. ప్రభుత్వం మారాక సదరు ఎండీ ఆ పోస్టు నుంచి తప్పుకున్నారు. నియామకాలకు సంబంధించి డీసీవో, మహజన సభ అనుమతి తప్పనిసరి. అటువంటిది... ప్రకటన ఇవ్వకుండా తమకు అనుకూలమైన వ్యక్తిని జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. మరో ఉద్యోగిని రెగ్యులర్ చేశారు.

ఇష్టానుసారం నియామకాలు, నిధులు ఖర్చు చేయడంపై సెక్షన్ 51 విచారణ అవసరమని ఆడిట్ నివేదికలో సిఫార్సు చేశారు.

# పేరుకే జాతీయం.. దారంతా గుంతలమయం

టంగుటూరు: కోల్‌కతా - చెన్నై 16వ నం.జాతీయ రహదారి టంగుటూరు మీదుగా పోతుంది. దీని మీదుగా వెళ్లే కారుకు రూ.105, బస్సుకు రూ.355, లారీకి రూ.555, భారీ వాహనాలకు రూ.675 మేర టోల్ గేట్ పన్ను వసూలు చేస్తున్న నిర్వాహకులు ఎలాంటి సౌకర్యాలను కల్పించడంలేదు. నిర్వహణ సరిగ్గా లేక రోడ్డంతా గుంతలు పడినా పట్టించుకోవడంలేదు.

జిల్లాలో సమారు 60 కి.మీ. దూరం ప్రకాశం జిల్లాలో 16వ నం.జాతీయ రహదారి సుమారు 60 కి.మీ వెళ్తుంది. ప్రజారవాణా, వాణిజ్యం, వంటి వ్యవహారాల్లో జిల్లాకే మణిహారంలాంటి ఈ మార్గం టోల్‌ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యానికి అధ్వానంగా మారింది. టంగుటూరు- వల్లూరు - సింగరాయకొండ మార్గం మధ్య 24 కి.మీ మేర పరిశీలిస్తే ఒక్కో గుంత అడుగు నుంచి మూడు అడుగుల వరకు లోతు ఉంటోంది. ఇలా సుమారు 400 గుంతల వరకు దర్శనమిస్తున్నాయి. అలాగే పలు చోట్ల 20 అడుగుల మేర తారు దెబ్బతింది. రాకపోకల సమయంలో ఆయా గుంతలను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. జాతీయ రహదారి రోడ్డు మరమ్మతులు, పారిశుద్ధ్యం, గ్రీనరీ, రోడ్డు భద్రత, సిగ్నల్స్, యాక్సిడెంట్ జోన్ ఎంపిక వంటి బాధ్యతల విషయంలో పన్ను వసూలు చేస్తున్న కంపెనీలదే పూర్తి బాధ్యత.

# ముడిపట్టు ధర పైపైకి

ధర్మవరం : నేతన్నకు కొత్త సమస్య ఎదురైంది. ముడిపట్టు ధర పెరగడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పట్టుచీరల తయారీకి ఉపయోగించే వార్పు, సర్పూరి ధరలు ఆరు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200 పెరిగాయి. పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గడంతో ముడిపట్టుకు డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత మగ్గాలు, మరమగ్గాలకు ప్రతినెలా 3.25 లక్షల కిలోల ముడిపట్టు వినియోగిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్ నుంచి స్థానిక రీలర్లు పట్టుగూళ్లు కొనుగోలు చేసి దారం తీస్తున్నారు. వీరు ఉత్పత్తి చేసే ముడిపట్టు 20 శాతం మగ్గాలకు మాత్రమే సరిపోతోంది. దీంతో కర్ణాటకపై ఆధారపడాల్సి వస్తోంది. కర్ణాటకలోనూ ఆరు నెలలుగా పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గడంతో ముడిపట్టు ధరలు పెరిగాయి. ఫలితంగా ఒక్కో పట్టు చీరపై రూ.800 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు.

**తగ్గిన పట్టుపురుగుల పెంపకం**

శ్రీసత్యసాయి జిల్లాలో 18 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. రైతులు పండించిన పట్టుగూళ్లను హిందూపురం, ధర్మవరం మార్కెట్లలో విక్రయిస్తారు. వర్షాకాలంలో పట్టుపురుగుల పెంపకం తగ్గింది. దీంతో మార్కెట్కు తక్కువ స్థాయిలో గూళ్లు వస్తున్నాయి. ఇవి జిల్లాలోని రీలింగ్ పరిశ్రమలకు ఏమాత్రం సరిపడటం లేదు. కిలో పట్టుగూళ్ల ధర



రూ.750 వరకు పలుకుతోంది.

**రాయితీ ఇస్తేనే ఊరట**

రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకొని పట్టుచీరలు, పావడాలు నేస్తున్నాను. ముడిపట్టు ధర పెరగడంతో ఒక్కో పట్టు చీర తయారీపై రూ.800కు పైగా అదనపు భారం పడుతోంది. అందుకు అనుగుణంగా పట్టుచీరల ధరలు పెరగడం లేదు. తయారీదారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలాగే ధర పెరిగితే మగ్గాలు నడపడం కష్టమవుతుంది.

**చిప్పల మార్కండేయ**

ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాలు: 20 వేలు
మర యంత్రాలు..: 25 వేలు
కేంద్రాలు: ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, యాడికి, ఉరవకొండ, సోమందేపల్లి, గోరంట్ల
నెలకు అవసరమైన ముడిపట్టు: 80,000 కిలోలు
మరమగ్గాలకు.. : 2,25,000 కిలోలు
ముడిపట్టు ప్రస్తుతం కిలో: రూ.6,400
ఆరు నెలల కిందట : రూ.5,200

# నిధుల్లేక.. నిలువెల్లా గండ్లు

తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతాంగాన్ని చెరువులే ఆదుకుంటున్నాయి. ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. అయితే శతాబ్దాలనాటి చెరువులను ఏటా తుపాన్లు, భారీ వర్షాలు దెబ్బతీస్తున్నాయి. దీంతో ఎప్పుడు కట్ట తెగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు బతుకుతున్నారు. ఇది ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి చెరువు. మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతింది. వెంటనే స్పందించి మరమ్మతులు చేయడంతో నష్టం తగ్గింది. తాజాగా గురువారం కేవీబీపురం మండలంలోని పాతపాలెం రాయలచెరువు కట్ట తెగిపోవడంతో గ్రామాల్లోకి వరద పోటెత్తింది. ఎక్కడికక్కడ పశువులు కొట్టుకుపోయాయి.

**నివర్ తుపానుతో అపారనష్టం**

ఐదేళ్ల కిందట నివర్ తుపాను జిల్లాను వణికించింది. దాదాపు 25 శాతం చెరువులకు తీవ్రనష్టం జరిగింది. మరో 15 శాతం జలవనరులు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.450 కోట్లతో శాశ్వత మరమ్మతులకు అధికారులు ప్రతిపాదించినా వైకాపా ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. రూ.21 కోట్లతో పైపైన బాగుచేసి మమ అనిపించారు. అనంతరం నాలుగైదు సార్లు జలవనరుల శాఖ నివేదించినా పట్టించుకోలేదు.

**19 గ్రామాలకు కునుకులేదు..**

2021 నవంబరులో కురిసిన వర్షాలతో 500 ఏళ్ల కిందట నిర్మించిన రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు కట్టకు లీకేజీలు ఏర్పడ్డాయి.
0.50 టీఎంసీల సామర్థ్యమున్న చెరువుకు 0.90 టీఎంసీల నీరు రావడంతో ఏ క్షణమైనా కట్ట తెగుతుందనే భయం ఏర్పడింది. దాంతో 19 గ్రామాల్లోని 20వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 50వేల సంచుల ఇసుక బస్తాలు వేసి భారీ ప్రమాదం జరగకుండా చూశారు. తాజాగా గండి పడినా ప్రాణనష్టం జరగలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరువులు 5,871
ఆయకట్టు 1.13 లక్షల ఎకరాలు
మొంథా ప్రభావంతో దెబ్బతిన్న చెరువులు 680
మరమ్మతులకయ్యే వ్యయం రూ.71.49 కోట్లు
శాశ్వత పనులకు ప్రతిపాదనలు : రూ.450 కోట్లు,
వైకాపా ప్రభుత్వం ఇచ్చింది : రూ.21 కోట్లు

# కళ్లెదుటే బీభత్సం

కేవీబీపురం : రాయల చెరువు గండితో రైతుల ఆశలన్నీ జలసమాధయ్యాయి. వరద ఉద్ధృతికి చెరువు కట్ట తెగిపోవడంతో భీతావహ పరిస్థితి నెలకొంది. ఐదు గ్రామాల ప్రజలు ముంపులో చిక్కుకున్నారు. నిమిషాల వ్యవధిలోనే పాతపాళెం, కళత్తూరు ఎస్సీ కాలనీలు, పాతపాళెం అరుంధతివాడ, కళత్తూరు గ్రామంలో కొంతమేర ఇళ్లలోకి వరద నీరు చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఆవులు, గేదెలు వరదలో కొట్టుకుపోయాయి. 900కు పైగా పశువులు మృతిచెంది ఉంటాయని ప్రాథమిక అంచనా. రాత్రవుతున్నా యంత్రాంగం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. 25 స్తంభాలు నేలకూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ బాధితులతో మాట్లాడి సహాయ చర్యలను పర్యవేక్షించారు. శెభాష్ సుందరయ్యగిరిజన వ్యక్తి సుందరయ్య చొరవ రాయలచెరువు గండి ఘటనలో వందల మంది ప్రజల ప్రాణాలను నిలబెట్టింది. ఓళ్లూరు గిరిజనకాలనీకి చెందిన ఆయన చెరువులో నిత్యం చేపల వేటకు వెళ్తుంటాడు. అలా కట్టకు బొగడ ఏర్పడటాన్ని గుర్తించారు. హుటాహుటిన రెండు కిలోమీటర్లు నడిచి ఉప సర్పంచి మస్తాన్‌కు తెలియజేశారు. ఆయన పరిశీలించి.. సర్పంచి సురేష్‌చౌదరికి చరవాణిలో సమాచారం ఇచ్చారు. ఆయన సీఐ రవీంద్ర, ఎస్ఐ నరేష్‌లతో కలిసి కళత్తూరు, పాతపాళెం ఎస్సీ కాలనీలతో పాటు అరుంధతివాడ ప్రజలను అప్రమత్తం చేశారు. ఆపై ఏరాజులకండ్రిగ, ఎగువపూడి, జయలక్ష్మీపురం కాజ్‌వేల వద్ద రాకపోకలు తహసీల్దార్, ఎంపీడీవోలు నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఎప్పుడు.. ఎలా..ఉదయం రాయల చెరువుకు పడిన బొగడను గుర్తించిన సుందరయ్య. ఉప సర్పంచి మస్తాన్ గండిపడుతుందని సర్పంచి సురేష్‌చౌదరికి చరవాణిలో సమాచారం.

# కాసులిస్తేనే కదలిక!



పుట్టపర్తి: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ మండలంలో ప్రతి పనికీ సీఐ చేయి తడపాల్సిందేనన్న ఆరోపణలున్నాయి. ఈయన ఈ ప్రాంతంలో వద్దని.. ఇటీవల మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు డీఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాద ఘటనలో వాహనం వెనక్కి ఇచ్చేందుకు ఓ సీఐ రూ.25 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ సతీశ్‌కుమార్ దృష్టి సారించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నెలన్నర వ్యవధిలోనే జూదం, చోరీల నియంత్రణకు తగు చర్యలు తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొందరు పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**వైకాపా నాయకులతో కలిసి..**

పెనుకొండకు చెందిన ఓ ఉపాధ్యాయుడు 2017లో కొంతమందితో కలిసి సర్వే నం.693లో 2.93 ఎకరాలు కొని వాటా ప్రకారం పంచుకున్నారు. మిగులును అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లుగా మార్చుకున్నారు. వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి తనకు సదరు స్థలం కావాలని అడగ్గా.. ఇవ్వకపోవడంతో కబ్జా చేయాలని చూశారు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని అప్పటి ఎస్ఐ, సీఐలు వేధింపులకు గురిచేశారు. ఈ క్రమంలో కొందరు నాయకులు, అనుచరులతో కలిసి ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి నగదు, అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లు ఎత్తుకెళ్లారు. ఈక్రమంలో నాయకులకు సహకారం అందించిన ఎస్ఐ, సీఐలను వీఆర్‌కు పంపించారు. తర్వాత ఎస్ఐకు సీఐగా పదోన్నతి కల్పించి ఉమ్మడి జిల్లాలోనే మరో ప్రాంతానికి బదిలీ చేశారు. సీఐను కడప జిల్లాకు పంపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరినా.. స్పందన లేకపోవడంతో సదరు ఉపాధ్యాయుడు గతేడాది డిసెంబరు 12న అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో అప్పటి ఎస్పీ పూర్తి విచారణ చేసి.. నివేదికను డీఐజీకి పంపించారు. వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

**కేసు నమోదు చేయక..**

ముదిగుబ్బకు చెందిన ఇర్ఫాన్ బేల్దారి పనులు చేయిస్తుంటాడు. పెనుకొండకు చెందిన షరీఫ్ గతంలో అతనివద్ద బేల్దారి పనులు చేసేవాడు. బెంగళూరులో తెలిసినవారి వద్ద బంగారం ఎక్కువ ఉందని, సగం ధరకే ఇప్పిస్తానని ఇర్ఫాన్‌కు ఆశ చూపాడు. షరీఫ్, అతని స్నేహితుడు బాబాకు రూ.2 లక్షలు ఇచ్చాడు. బంగారం నకిలీదని తేలడంతో ఇర్ఫాన్ ముదిగుబ్బలో ఫిర్యాదు చేశాడు. వారు పెనుకొండకు వెళ్లమన్నారు. సంఘటన జరిగింది సోమందేపల్లి పరిధిలో అక్కడికే వెళ్లాలని సూచించారు. వారు మళ్లీ తిరిగి పెనుకొండకు వచ్చారు. అయినా ఎక్కడా కేసు నమోదు కాలేదు.

**ఇసుక తరలిపోతున్నా..**

ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా అవుతోంది. ముదిగుబ్బలోని పీసీరేవు, తాడిమర్రిలోని సీసీరేవు నుంచి పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్ల ద్వారా రాత్రివేళల్లో బెంగళూరుకు తరలిస్తున్నారు. ముదిగుబ్బ మీదుగా కదిరి, బత్తలపల్లి మీదుగా అనంతపురానికి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నెలనెలా మామూళ్లు అందుతుండటంతోనే దందా జరగుతోందన్నది బహిరంగ రహస్యమే.

# అనర్థమని చెప్పరు.. అవగాహన కల్పించరు!



అనంతపురం : రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంతలో బాల్యవివాహాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, యాడికి, గార్లదిన్నె, శింగనమల ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఘటనలు ఆందోళన కల్గిస్తున్నాయి. తాజాగా మరొక ఘటన తెరపైకి వచ్చింది. ఇవన్నీ నెల వ్యవధిలోనే బహిర్గతం కావడం ప్రస్తావనార్హం. విద్యాసంస్థల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బాల్యవివాహాల అనర్థాలు, నియంత్రణపై అవగాహన కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు.

**చాపకింద నీరులా..**

సెప్టెంబరు, అక్టోబరులో ఏకంగా 13 బాల్యవివాహాలు జరిగినట్లు ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఆనంద్ ఆవేదన వెలిబుచ్చారు. సంబంధిత యంత్రాంగం తూతూమంత్ర సమీక్ష.. ప్రచార పత్రాల విడుదలతోనే సరిపుచ్చుతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నా అవగాహన శిబిరాలు నిర్వహించలేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి.

**540 మంది.!**

అంగన్‌వాడీ కేంద్రాల్లో 23,596 మంది గర్భిణి, బాలింతలు లబ్ధిదారులుగా ఉన్నారు.
540 మంది 19 ఏళ్లలోపు వారు ఉండటం విశేషం. వీరిలోనూ 257 మంది గర్భిణులు, 283 మంది బాలింతలు ఉన్నట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. 540 మందికి పెళ్లిళ్లు అయినట్లు తెలుస్తోంది.
వారంతా ఉరవకొండ, శింగనమల, కంబదూరు, కణేకల్లు, గుత్తి, తాడిపత్రి వంటి ప్రాజెక్టుల పరిధిలో ఉన్నారు. యుక్త వయసులోనే పెళ్లి అయినా యంత్రాంగం పసిగట్టలేదు. కనీసం అడ్డుకునే ప్రయత్నాలు చేయలేదు.

**ముందుగా గుర్తించక..**

జిల్లాలో బాల్యవివాహాలు జరగడం, మోసానికి గురై గర్భం దాల్చడం.. వంటి ఘటనలు ఈ మధ్యనే ఎక్కువ తెరపైకి వచ్చాయి. యాడికి, గార్లదిన్నె, శింగనమల ప్రాంతాల్లో బాలికలు గర్భం దాల్చిన తర్వాతే వెలుగుచూశాయి.
కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం ప్రాంతాల్లో వివాదాలు తలెత్తడంతో బాల్యవివాహాలను ఆపారు. తాజాగా.. శింగనమలలో తన బిడ్డ కనపించలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సదరు బాలిక పెళ్లి చేసుకొని వచ్చింది. అంతా అయ్యాక.. బుధవారం ఆ బాలిక, తల్లిదండ్రులతో అధికారులు సమావేశమయ్యారు.
ఘటనలు జరుగుతున్నా ముందస్తు సమాచారం అందడం లేదు. సంబంధిత ప్రాంతాల్లో అవగాహన సమావేశాలను నిర్వహించకనే ఇలాంటి దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి.

# పెన్నా తీరంలో జూదం



అనంతపురం :తాడిపత్రి మండలం ఆలూరు గ్రామ సమీపంలోని కొండల్లో నిత్యం జూదం నిర్వహిస్తున్నారు. రోజుకొక చోట ఆడిస్తున్నారు. ఏ రోజు ఎక్కడ ఆడిస్తున్నారనే విషయాన్ని కొన్ని గంటల ముందు ఫోన్ ద్వారా తెలియజేస్తారు. కొంత దూరం వరకు కార్లలో తీసుకెళ్లి అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై తరలిస్తున్నారు. చుక్కలూరు క్రాస్, సజ్జలదిన్నె పారిశ్రామికవాడలో మూతపడిన గ్రానైట్ పరిశ్రమల్లో పెద్దఎత్తున ఆడిస్తున్నారు.
నందలపాడు, పాత వంతెన, కొత్త వంతెన ప్రాంతాల్లో పెన్నానది ఆనుకుని ఉన్న తోటల్లోనూ స్థావరాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు అక్కన్నపల్లి, హుస్సేనాపురం, బ్రహ్మణపల్లి, చిన్నపొలమడ గ్రామాల పరిధిలోనూ దందా సాగుతోంది.
పెన్నా తీరంలో జూదరులు విజృంభిస్తున్నారు. తాడిపత్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో స్థావరాలు ఏర్పాటు చేసి ఆడిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు బహిరంగంగానే స్థావరాలను నిర్వహిస్తున్నారు. వారికి స్థానిక పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెన్నాతీరం, పండ్లతోటలు, కొండల్లో జూదం సాగుతోంది. అనంతపురంతో పాటు నంద్యాల, కడప జిల్లాల నుంచి తాడిపత్రి వస్తున్నారు. ప్రత్యేక నెట్‌వర్క్ ద్వారా ఒకచోటుకు చేరుస్తున్నారు. పగలే కాకుండా రాత్రి వేళల్లోనూ దందా జోరుగా సాగుతోంది. ఒక్కో ఆటకు గెలిచిన వారి నుంచి 10 నుంచి 20 శాతం కమీషన్ తీసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

**పోలీసుల సహకారం..**

తాడిపత్రికి చెందిన కొందరు స్థానిక నాయకుల కనుసన్నల్లో నడిచే జూదానికి పోలీసుల నుంచి పూర్తి సహకారం లభిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఆదేశించినప్పుడు మాత్రం నామమాత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేయడం లేదు.

**కట్టడి చేస్తున్నాం..**

జిల్లాలో జూదం నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు పెడుతున్నాం. తాడిపత్రిలోనూ ఇటీవలే కొందరిని అరెస్టు చేశాం. జూద నిర్వాహకులకు సహకరిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదు.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

# కార్మికులకు కార్డు.. భద్రతకు రివార్డు!

తిరుపతి : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడగు వేస్తున్నాయి. ఈ - శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్మికుల గుర్తింపునకు పోర్టల్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నా.. చాలామంది నమోదు చేసుకోలేదు.

**అర్హులు ఎవరు:**

18- 59 ఏళ్లలోపు వారు అర్హులు. ఈ- శ్రమ్ కార్డులతో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.
ఇప్పటివరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరిద్దరు కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి సామాజిక భద్రతతోపాటు వివిధ పథకాలు అందుతాయి.
దరఖాస్తు ఇలా..: ఈ - శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణిలో సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుపతి, చిత్తూరు కార్మిక శాఖ కార్యాలయాలలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేశారు. సీఎస్‌ఈ




కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుతోపాటు వివరాలు నింపి కార్డులు పొందవచ్చు. ఒకసారి తీసుకుంటే ఐదేళ్లు అమలులో ఉంటుంది. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవగాహన సదస్సులు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టారు.
మాన్‌ధనం: పీఎం - శ్రమ యోగి మాన్ ధన్ (ఎస్వైఎం) పథకానికి 18 - 40 ఏళ్ల వయస్సున్న కార్మికులు అర్హులు. కార్మికులు వయస్సు ఆధారంగా కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వం చెల్లిస్తాయి. 61 ఏళ్లు దాటిన తర్వాత కార్మికులకు పింఛను వర్తిస్తుంది. కనిష్ఠంగా రూ.55.. గరిష్ఠంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్థిక ప్రయోజనం:**

ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద మరణ, అంగ వైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.
వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.
కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా సాయం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తారు.
కార్మికురాలు, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.
ఉమ్మడి జిల్లాలో కార్మికులు: 9 లక్షల మంది ఇందులో భవన నిర్మాణ కార్మికులు: 1,45,341 మందిఈ శ్రమ్‌లో నమోదైన కార్మికులు
చిత్తూరు: 4,66,831
తిరుపతి: 78,912
మదనపల్లె: 1,08,117

# తెలుగు అకా'డమ్మీ'

తిరుపతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థ కేటాయించాలని నిర్ణయించారు. తిరుపతి కేంద్రంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీని తిరుపతికి 2020 జూన్ 16న నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధి బాధ్యతల్ని తెలుగు అకాడమీకి అప్పగిస్తూ తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతర్గత సమస్యలతో అకాడమీ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోగా.. 2022 జూన్ 1 ఎట్టకేలకు తిరుపతిలోని తుమ్మలగుంట మార్గంలో తితిదే గోశాలకు చెందిన భవనంలో ప్రారంభమైంది. వైకాపా ప్రభుత్వ పాలనలో అకాడమీని విజయవాడ నుంచి తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలో అకాడమీ కాగితాలకే పరిమితమైంది.

**ఉద్యోగులు విజయవాడలో..** అకాడమీని అధికారికంగా తిరుపతిలో ఏర్పాటు చేసినప్పటికీ అనధికారికంగా ఇప్పటికీ విజయవాడ నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**స్థలాన్వేషణతో సరి**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతిని గత ప్రభుత్వం నియమించగా ఆమె అకాడమీ భవన నిర్మాణ స్థలాన్వేషణకే పరిమితమయ్యారు.

**వారు తిరుపతి వస్తే ఒట్టు**

తెలుగు అకాడమీ కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించిన రీసెర్చ్, సేల్స్, పరిపాలనాధికారులతో సహా 14 మంది ఉద్యోగులు తిరుపతిలోని కార్యాలయంలో ఇప్పటి వరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

**అక్కడి నుంచి అటే..**

విజయవాడలో పుస్తకాలను ముద్రించి వాటిని అక్కడి నుంచే రాష్ట్రంలోని అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతీయ కేంద్రాలకు చేరవేసి విక్రయాలు సాగిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆర్.డి.విల్సన్ సైతం తిరుపతిలోని అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని కన్నెత్తి చూడలేదు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలకే పరిమితం**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, ఆధునిక తెలుగుబోధన, ఎంసెట్ పుస్తకాలతో పాటు వివిధ అనువాదాలు, మోనోగ్రాఫులు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళి, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నిఘంటువులు, పరిపాలన న్యాయ పదకోశం వంటి 158కి పైగా ప్రచురణలు ముద్రించేది. ప్రస్తుతం కేవలం ఇంటర్, డీఎడ్, బీఎడ్, పాఠ్యపుస్తకాలు, పరిమిత సంఖ్యలో టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ మాత్రమే ముద్రించి సరఫరా చేస్తోంది.
ప్రస్తుతం తిరుపతి ప్రాంతీయ కేంద్రం తరహాలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్, పొరుగుసేవల విధానంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సహాయకులే తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

**భాషాభిమానుల ఆకాంక్షలివీ..**

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.250 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే తెలుగు అకాడమీ, ప్రస్తుతం రూ.15 కోట్లకు మించలేదని అంటున్నారు. త్వరలో పాఠశాలల పాఠ్యపుస్తకాలు, డిగ్రీ, పోటీ పరీక్షల పుస్తకాలు, సివిల్స్‌కు సిద్ధం అవుతున్న వారికి అకాడమీ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ వ్యవహారంపై స్పష్టతను భాషాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ఓర్వకల్లు.. పరిశ్రమల ఇల్లు

కర్నూలు: ఓర్వకల్లు పారిశ్రామిక వాడ.. 'ఉపాధి' మేడ కానుంది.. పారిశ్రామికవాడను అభివృద్ధి చేయాలని 2017-18లో తెదేపా నిర్ణయించింది. 9,750 ఎకరాలు సేకరించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. రూ.వెయ్యి కోట్లు వెచ్చించి 2,621 ఎకరాలు అభివృద్ధి చేయడానికి కేంద్రం ముందుకొచ్చింది.. గత బడ్జెట్‌లో నిధులు ప్రకటించింది.. మౌలిక సదుపాయాల కల్పనకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ) రెండు నెలల కిందట టెండర్లు ఆహ్వానించింది. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే పలు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్నాయి. ఈనెల 16న జిల్లాకు రానున్న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పరిశ్రమల ఏర్పాటు మరింత వేగవంతం కానుంది.

**వేలాది మందికి ఉపాధి**

ఇటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్(జపాన్), హైడ్రస్, బీఎస్(భారత్) గ్రూప్‌లు కలిపి సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.14వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి



ముందుకొచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి 14వేల మందికి ఉపాధి లభించనుంది.

1,200 ఎకరాల్లో 'ఈవీ పార్క్'ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 25వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ పలురకాల ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ 500 మందికి ఉపాధి కల్పిస్తుంది.మహిళలకు ఉపాధి కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అలీప్ సంస్థ రూ.36.25 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఇందులో 3వేల మందికి ఉపాధి లభించనుంది.కాల్వ గ్రామంలో ఉన్న ఫ్రెష్‌బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను రూ.33 కోట్లతో విస్తరించనున్నారు. ఇందులో 200 మందికి ఉపాధి కల్పించనున్నారు.

# కాలం చెల్లినా.. అతీగతి లేదు

నంద్యాల: ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు వ్యవస్థ అధ్వానంగా ఉంది. చాలా ప్రాంతాల్లో స్తంభాలు దెబ్బతిని కూలిపోయేలా ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. వీటిని సరిచేయడంలో విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా మరమ్మతులు చేసి మమ అనిపించేస్తున్నారు. ఫలితంగా జనం ప్రాణాలు కోల్పోతున్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల సమయంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోంది.

**ఎవరూ పట్టించుకోక..**

జిల్లాలో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన విద్యుత్తు లైన్లు ఎక్కువగా ఉన్నాయి. కొలిమిగుండ్ల, జూపాడుబంగ్లా, పాములపాడు, డోన్, నందికొట్కూరు, కొత్తపల్లి, ప్యాపిలి, బనగానపల్లి తదితర మండలాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగలకు కాలం చెల్లింది. వీటిని ఎప్పటికప్పుడు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది.

నిధుల కొరత నేపథ్యంలో డిస్కంలు వీటిని ఏర్పాటు చేయలేకపోతున్నాయి. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో స్తంభాలు ఒరిగిపోతున్నాయి. వీటిని సరిచేయడం.. లేకుంటే కొత్తవి ఏర్పాటుచేయాల్సి ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది వీటిపై దృష్టి సారించడం లేదు.

**పరిస్థితి ఇదీ**

గడివేముల మండలం కొర్రపోలూరు ప్రాంతంలో రహదారి పక్కన ఏర్పాటుచేసిన విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. ఏడాదిగా ఇలానే ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

గడివేముల మండలం కె.బొల్లవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక, స్తంభాలు రెండూ ఒరిగి ప్రమాదకరంగా మారాయి. నియంత్రికను సరిచేయకుండా అలానే నడిపిస్తున్నారు. దీని ద్వారానే వ్యవసాయ విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఏడాదికిపైగా ఇలానే నడిపిస్తుండటం గమనార్హం.

గడివేముల, పాణ్యం, కొలిమిగుండ్ల, మిడుతూరు మండలాల్లో కొన్నిచోట్ల స్తంభాలకే ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడంతో బరువు కారణంగా పక్కకు ఒరిగిపోతున్నాయి. నియంత్రికలు కాలిపోయిన సమయంలో



వాటిని రైతులే మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలేవీ..**

జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రుద్రవరం, మహానంది, వెలుగోడు, చాగలమర్రి, ఉయ్యాలవాడ, గడివేముల, శిరివెళ్ల, ఆత్మకూరు తదితర మండలాల్లోని పొలాల్లో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయి.

గడివేముల నుంచి గని గ్రామం వరకు ఉన్న 33 కేవీ విద్యుత్తు లైను స్తంభాలు పదుల సంఖ్యలో వాలిపోయాయి. మూడేళ్ల కిందటే ఇవి ఒరిగిపోయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

నెల రోజుల కిందట కురిసిన వర్షాలకు స్తంభాలు నేలకూలడంతో 24 గంటలపాటు మంచాలకట్ట, గని, ఎల్‌కేతండా, వైకే తండా, పైబోగుల తదితర గ్రామాలకు 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. చిన్నపాటి సమస్య వచ్చినా గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఆగిపోతుండటంతో జనం నరకయాతన అనుభవిస్తున్నారు. పంపిణీ వ్యవస్థ నిర్వహణలో లోపాలు, మానవ తప్పిదాలతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

# కనికరం ఉంది... పరికరమే లేదు



తిరుపతి : వైద్యులున్నారు.. మందులున్నాయి.. రోగులపై కనికరం ఉంది.. కానీ వ్యాధి నిర్ధారణ పరికరాలే లేవు. ఇది తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రిలోని పరిస్థితి. ఉన్నవి పని చేయక.. మరికొన్ని లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని ప్రభావం మెరుగైన వైద్య సేవలపై పడుతోంది. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని పరీక్షలకు పరికరాలు లేకపోవడంతో డబ్బులు పెట్టి బయట చేయించుకోవాల్సి వస్తోంది.

**ఓపీలో లేని బీపీ:** స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాలతో కొలువుదీరిన రుయాలో విభాగానికి ఒక బీపీ మిషన్ ఇచ్చామని అధికారులు అంటున్నా.. రద్దీ కారణంగా చాలావరకు చూడటం లేదు. ప్రస్తుతం రుయాలో ఉన్న 250 బీపీ పరికరాలలో 80 మూలనపడ్డాయి. మరో 50 అవసరం ఉంది. అత్యవసర విభాగం, ఆర్‌ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, చిన్నపిల్లల విభాగంతోపాటు వార్డుల్లో పరికరాలు మూలనపడటంతో వ్యాధి నిర్ధారణ జాప్యం జరుగుతోంది.

**ఇదీ పరిస్థితి**

లెక్కల్లో 30 ఈసీజీ పరికరాలు ఉంటే అందులో పనిచేసేవి 13 మాత్రమే.

అత్యవసర విభాగంలోని 30 పడకలకు ఒక్కటే ఈసీజీ ఉంది. అదీ అప్పుడప్పుడు మొరాయిస్తోంది.

జనరల్ మెడిసిన్ విభాగంలో వెంటిలేటర్లు కూడా లేవు.

2డీ ఎకో మిషన్ ఒకటే ఉంది. రోజుకు 50 - 60 మందికి పరీక్షలు చేస్తున్నా ఫలితాలకు ఎదురుచూడాల్సి వస్తోంది.

గుండె జబ్బును గుర్తించే ట్రెడ్ మిల్ టెస్ట్ (టీఎంటీ) మిషన్ లేకపోవడం శోచనీయం.

గుండెపోటుకు గురైన వారికి ఎలక్ట్రికల్ షాక్ ఇచ్చే పరికరం, ఏబీజీ రక్త పరీక్షల పరికరాలు లేవు.

ఎనిమిది జిల్లాల రోగులకు అభయమిచ్చే రుయాలో క్యాథ్‌ల్యాబ్ లేదు.

గుండెపోటుకు గురైన వారికి స్టంట్లు అమర్చడం, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ చేసే అవకాశం లేకపోయింది.

సీటీ, ఎంఆర్‌ఐ ఒకటి చొప్పున ఉన్నాయి.

**హెచ్‌డీఎస్ దృష్టికి తీసుకెళ్తాం..**

- కె.రాధ, సూపరింటెండెంట్

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం జరగనుంది. కమిటీ దృష్టికి పరికరాల కొరత అంశాన్ని తీసుకెళ్తాం. కలెక్టర్ అనుమతితో పరికరాలు తీసుకొని రోగులకు మెరుగైన సేవలందిస్తాం.

పని చేయని పరికరాలు: 40 శాతం

అవుట్ పేషెంట్లు: 1500 నుంచి 1700

ఇన్ పేషెంట్లు: 1200

ఇంకా కావాల్సినవి

వర్క్‌స్టేషన్ పరికరాలు

వెంటిలేటర్లు

మల్టీ ఛానల్ మానిటర్స్

ఈఎన్‌ఎంజీ

కాగ్లోమీటర్,

ప్లేట్లెట్ అగిటేటర్స్

# కష్టం ధరల్లేక నష్టం



పుంగనూరు : ఎకరాకు 30 టన్నుల వరకు దిగుబడులు రావాల్సి ఉండగా 15 టన్నులకు మించి ఉండటం లేదు.

ఎకరాలో సాగుకు రూ.2.9 లక్షలు ఖర్చు కాగా ప్రస్తుత దిగుబడులు, ధర ప్రకారం రూ.2.5 లక్షలు వస్తోంది. దీంతో ఎకరాకు రూ.40 వేలు నష్టపోగా.. అప్పులే మిగులుతున్నాయని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

మార్కెట్ కనెక్టివిటీ, విక్రయం

సమీప రైతు బజార్లను గుర్తించి, అమ్మకాలు చేయించాలి. 5-10 మంది రైతుల బృందాలతో సూపర్ మార్కెట్లు, రిటైలర్లకు సరఫరా చేయించాలి. ఈ-నామ్, వాట్సాప్ రైతుల గ్రూపులు లాంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ధరల సమాచారం, కొనుగోలు అవకాశాలు తెలపాలి.

ఫలితం: మధ్యవర్తుల లాభం తగ్గి, మంచి ధరలకు చేరువ అవుతారు.

**పంట సంరక్షణ, నిల్వ**

పండ్లను నాణ్యత ఆధారంగా పెద్ద, చిన్న వర్గీకరణ చేయాలి.

ప్రాంతీయ కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సహకార సంఘాల ద్వారా తాత్కాలిక నిల్వ చేయించాలి.

ప్రాసెసింగ్ యూనిట్లలో పండ్లతో పేస్ట్, సాస్, కెచప్, పొడి తయారు చేయించాలి.ఫలితం: అధిక సరఫరాతో ధరలు పడిపోకుండా పంట నిల్వ కాలం పెరుగుతుంది.

**మార్కెట్లు పతనం**

చిత్తూరు: పలమనేరు, కుప్పం, వి.కోట వంటి ప్రాంతాల్లో టమాటా ధరలు కేజీ రూ.10-రూ.20 మధ్య పడిపోయాయి. మదనపల్లె మార్కెట్‌లో 15 కేజీల క్రేట్ రూ.150కి విక్రయించారు. అంటే కేజీ ధర రూ.10 మాత్రమే. రైతులకు కనీసం పెట్టుబడులూ రాలేదు.

తిరుపతి జిల్లా: తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి పట్టణాల్లో టమాటా ధర కిలోకు రూ.30 వరకు ఉన్నా.. రైతులకు కిలోకు రూ.10 మాత్రమే లభిస్తోంది. మధ్యవర్తులే లాభాలు పొందుతున్నారు.

**ప్రభుత్వం ఇలా చేస్తే రైతులకు లాభాలు**

తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ

ప్రతి 2-3 రోజులకు ఒకసారి పొలాలు పరిశీలించాలి.

తక్షణమే నీమ్ ఆయిల్, బీటీ లేదా సూచించిన పురుగు మందుల్ని ఉపయోగించాలి. ఫలితం: తెగుళ్లు, వ్యాధుల వల్ల పంట నష్టం తగ్గుతుంది.ఆర్థిక సహాయం, పథకాలు

వ్యవసాయ కార్యాలయాల ద్వారా రుణ సాయం అందించాలి.

రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయాలి.

కనీస మద్దతు ధరకు నమోదు చేయించాలి.

ఫలితం: నగదు చేయూత, ఖర్చు తగ్గింపు.

24% ఈ ఏడాది చిత్తూరు జిల్లాలో తగ్గిన టమాటా సాగు

# ఆన్‌లైన్‌లో విక్రయం.. వ్యాపారం విస్తృతం



పుత్తూరు :మహిళా సంఘాల సభ్యుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న వస్తువులను సైతం జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే సదుద్దేశంతో ప్రభుత్వాలు అడుగేశాయి. వాటిని ఆన్‌లైన్‌లో అమ్ముకునేందుకు వీలుగా ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)ని అందుబాటులోకి తీసుకురావడం విశేషం.

**ప్రత్యేకంగా యాప్..**

ఉత్పత్తుల విక్రయానికి ఓఎన్‌డీసీ యాప్‌ను తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి చీరలు, చేనేత వస్త్రాలు, టెర్రకోట బొమ్మలు, గాజులు, లక్ష్మీదేవి విగ్రహాలు, చిన్న పిల్లల బ్లౌజులు, మిలెట్స్, చాక్లెట్స్, సౌందర్య వస్తువులు వంటివి విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే వినియోగదారులకు అందిస్తున్నారు.

**వివరాలు నమోదు..**

ప్లేస్టోర్‌లో మై స్టోర్ (ఐకాన్‌పై ఆంగ్లంలో పూర్తి పేరు ఉంటుంది) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మెయిల్‌ఐడీ, వ్యాపారం పేరు, జీఎస్టీ నంబరు, ఇతర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. నాన్ జీఎస్టీ సభ్యులూ చేరవచ్చు.

సంఘం సభ్యులు తమ ఉత్పత్తుల చిత్రాలు, ధరలు పొందుపర్చాలి.

ఆహార ఉత్పత్తులకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ధ్రువీకరణపత్రం తప్పనిసరి.

వెయ్యి మంది చేరిక..

ఉమ్మడి జిల్లాకు చెందిన వేయి మంది తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తుండటం గమనార్హం. ఇప్పటి వరకు పలమనేరుకు చెందిన టెర్రకోట బొమ్మలకు ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి.

**అమ్మకాలు ఇలా..**

పుత్తూరుకు చెందిన స్వయం సహాయక సంఘం సభ్యులు కర్పూరం తయారు చేసి అమ్ముతున్నారు. రూ.62,332 మేర విక్రయించారు.

: నగరి వస్త్రాలకు ప్రసిద్ధి. ఇక్కడి సంఘాలకు 1604 ఆర్డర్లు వచ్చాయి. తద్వారా రూ.1,75,710 వ్యాపారం చేశారు. : పలమనేరుకు చెందిన టెర్రకోట బొమ్మలు, శ్రీకాళహస్తి కళంకారీ వస్తువులు, వెంకటగిరి చేనేత వస్త్రాలు అమ్ముతున్నారు.

# మార్కెట్ స్థలం మాయం

నంద్యాల: జిల్లా కేంద్రంలో నూనెపల్లి మార్కెట్లో ఖాళీ స్థలంపై అక్రమార్కులు కన్నేశారు. మూడెకరాలు తమదంటూ కొందరు న్యాయస్థానం మెట్లెక్కారు. దీని విలువ రూ.200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. లేదు ఆ స్థలం మార్కెటింగ్ శాఖకు సంబంధించిందని అధికారులు కోర్టుకు వెళ్లారు.. ఇంకా పదెకరాలకుపైగా స్థలం ఖాళీగా ఉంది.. ఇది ఆక్రమణకు గురికాకముందే అధికారులు అప్రమత్తం కావాల్సినవసరం ఉంది.

**ఎకరా రూ.25 కోట్లు పలుకుతోంది**

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రైతు నగరం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఆ స్థలానికి విపరీతమైన గిరాకీ ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.25 కోట్లు పలుకుతోంది. ఈ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించుకొంటే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ఖాళీ స్థలాన్ని అద్దె ప్రాతిపదికన ఇస్తే తాము ఉపయోగించుకుంటామని ప్రభుత్వ శాఖల అధికారులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖాళీ స్థలం వినియోగంపై దృష్టి పెట్టింది. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండేలా గోదాములు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని మార్కెట్ కమిటీ ప్రతిపాదించింది.



**ఏళ్ల కిందట 8 ఎకరాల్లో**

దశాబ్దాల కిందట ఎనిమిదెకరాల విస్తీర్ణంలో నూనెపల్లి మార్కెట్ యార్డు ఏర్పాటు చేశారు. పది భారీ గోదాములు, పరిపాలన భవనం నిర్మించారు. భారీగా దిగుబడులు వస్తుండటం.. స్థల సమస్య నేపథ్యంలో టెక్కె ప్రాంతంలో కొత్తది నిర్మించారు. పాత మార్కెట్ యార్డు స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. 20ఏళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. భవనాల కిటికీలు, తలుపులను చోరీ చేశారు. గోదాముల నిర్వహణ గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కేవలం అరెకరం స్థలంలో మాత్రమే షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అందులో పది దుకాణాలుండగా నేటికీ ఆరు ఖాళీగానే ఉన్నాయి.

# స్థలం కోసం సిగపట్లు!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నడిబొడ్డున కీలకమైన వ్యాపార కూడలిలో ఉన్న స్థలమది. విలువ రూ.3 కోట్లు పైమాటే. ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో దాని చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. సమస్య సంక్లిష్టంగా మారుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

**ఎవరికి వారే తమదంటూ...**

వై.పాలెం ఆర్టీసీ బస్టాండ్ పక్కనే సుమారు పన్నెండు సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉండేది. మలేరియా కార్యాలయం, ఆరోగ్య ఉప కేంద్రం ఇక్కడే నడిచేవి. గత వైకాపా ప్రభుత్వం బస్టాండ్ విస్తరణ పేరిట ఇక్కడి కట్టడాలను కూల్చేసింది. తరువాత ఎలాంటి పనులు చేపట్టలేదు. సంరక్షణ చర్యలు సైతం లేక ఖాళీగా మారిన స్థలంపై కొందరి కళ్లు పడ్డాయి. అప్పట్లోనే ఇందులోని అయిదు సెంట్లు గిరిజన భవన్‌కు కేటాయించారని బోర్డు పెట్టారు. మరో కుల సంఘం వారూ బోర్డు పాతారు. కూటమి ప్రభుతం వచ్చాక దీనిని తొలగించారు. మరోవైపు ఆ స్థలం అప్పటి మంత్రి మహిళా మార్ట్ కోసం కేటాయించారని వెలుగు అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు డీఆర్‌డీఏ పీడీ నారాయణ సైతం ఇటీవల పరిశీలించి



వెళ్లారు. మరోవైపు అది పంచాయతీకి చెందినదని... పంచాయతీ వాహనాలను అక్కడ నిలుపుతున్నారు. ఇదిలా ఉంటే... తమకు కేటాయించాలంటూ ఓ సంఘం వారు ఓ నాయకుడి అండతో కొద్ది రోజుల క్రితం తహసీల్దారుకు అర్జీ అందజేశారు. స్థలం తమ శాఖదేనని అవసరమైతే కోర్టుకు వెళ్తామని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే ఎన్జీవో నాయకుడు చెబుతున్నారు.

**రెవెన్యూ అధికారుల చోద్యం...**

స్థలం చుట్టూ ఇన్ని వివాదాలు, రాజకీయాలు నడుస్తున్నా... ఎవరికి వారు తమదంటే తమదని సిగపట్లు పట్టుకుంటున్నా... సమస్య పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం ఇటుగా కన్నెత్తి చూడడం లేదు. పరిస్థితి మరింత జటిలం కాకముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కార్యదర్శి రామసుబ్బయ్యను సంప్రదించగా... సంబంధిత దస్త్రాలు పరిశీలించి వివరాలు తెలియజేస్తామన్నారు.

# గ్రానైట్ కళ.. మసకబారుతోంది..!

చీమకుర్తి : గ్రానైట్ పరిశ్రమకు ప్రకాశం జిల్లా పెట్టింది పేరు. దేశ విదేశాలకు సైతం ఇక్కడనుంచే గ్రానైట్ రాయి వెళ్తోంది. ప్రభుత్వానికి విదేశీ ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. అలాంటిది ఇటీవలి కాలంలో యజమాన్యాలు సమ్మె చేయడం, కార్మికులు వలసలు వంటి కారణాలతో ఫ్యాక్టరీల్లో కార్యకలాపాలు నిలిచి గ్రానైట్ పరిశ్రమ కళ తప్పుతోంది. ఆయా పరిశ్రమల్లో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల్లో దాదాపుగా 90 శాతం మంది తమ స్వస్థలాలకు తరలి పోయారు.

ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో చిక్కులు మొదలు

అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రానైట్ తదితర చిన్న తరహా ఖనిజాల సీనరేజి వసూళ్లను ప్రైవేటు సంస్థ ఏఎంఆర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో ఫ్యాక్టరీల యజమానులు ఎండీఎల్ కోసం ఒక్కో బ్లేడుకు చెల్లిస్తున్న మొత్తాన్ని సుమారుగా 30శాతం వరకు పెంచారు. జీఎస్టీతో కలిపి ఒక్కో బ్లేడుకు రూ.40 వేలు అవుతుండగా దీనిపై అదనపు మొత్తాలను చెల్లించాలని ప్రైవేటు సంస్థ వారు అడుగుతున్నారంటూ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఫ్యాక్టరీ యజమానులు సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో పరిశ్రమల యజమానులు ఈనెల 11న జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి పరిశ్రమను కాపాడే దిశగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.నిత్యం వేలాది మంది కార్మికులతో సందడిగా ఉండే మర్రిచెట్లపాలెం కూడలి ప్రస్తుతం బోసి పోయి కనిపిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారుగా లక్ష మందిపై ప్రభావం చూపుతోంది.

# అలుపెరగని కృషికి అరుదైన గుర్తింపు

సింధియా : నగరంలోని 'హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్' కు మినీరత్న హోదా దక్కడంపై అంతటా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ విషయం ప్రకటించాక ప్రతి ఒక్కరూ హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దీనిని 1941లో స్థాపించారు. సంస్థ ఒకప్పుడు ఆర్డర్లు రాక.. వచ్చినా సకాలంలో చేయలేక ఆర్థికంగా సతమతమైంది. పెద్దసంఖ్యలో కార్మికులు స్వచ్ఛంద పదవీ విరమణ పథకంలో ఇంటిముఖం పట్టారు. 1980 నుంచి ఎన్నో రకాల సవాళ్లను ఎదుర్కొంది. అయితే 2010లో కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆధీనంలోకి వెళ్లి 'కేంద్ర రక్షణ ఉత్పత్తుల సంస్థ'గా అవతరించింది. అప్పటి నుంచి నష్టాలను తగ్గించుకుంటూ వచ్చింది.

**కొవిడ్ సమయంలో మినహా:** 2015 నుంచి సంస్థ నౌకాదళానికి చెందిన పలు యుద్ధనౌకల నిర్మాణం, జలాంతర్గాముల మరమ్మతులు




సకాలంలో చేసి ఆర్థికంగా పుంజుకుంది. కొవిడ్ సమయం (2020-21) మినహా 2025-26 ఆర్థిక ఏడాది వరకు నష్టాలను భారీగా తగ్గించుకుంటూ వచ్చింది. అదే ఇప్పుడు మినీరత్నా హోదాకు దోహదం చేసింది. ఈ హోదా వల్ల సంస్థ స్వయం నిర్ణయాధికారం చేసుకునే అవకాశం కలుగుతుంది. నవరత్న హోదావైపు వెళ్లే అవకాశం ఉంటుంది.

**సంతోషించదగ్గ విషయం:** అధికారులు, ఉద్యోగులు ఐక్యంగా కనబర్చిన పనితీరుకు నిదర్శనమే ఈ 'మినీ రత్న' హోదా. సంస్థకు ఆర్డర్లను ఎంతో నమ్మకంగా ఇచ్చి అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందించిన కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ, వ్యాపార భాగస్వామ్య సంస్థలకు హృదయపూర్వక ధన్యవాదాలు.

కమొడోర్ గిరిదీప్‌సింగ్, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డు

# లాటరీ వచ్చిందంటే టోకరే

చిత్తూరు : ఈ-కామర్స్ కొనుగోళ్లు విస్తృతంగా పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త దందా మొదలుపెట్టారు. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేరుతో లక్కీ డ్రా, స్క్రాచ్ కార్డు అంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. లక్కీ డ్రాలో భాగంగా తాము చెప్పినట్లు చేస్తే నగదు, కారు, విదేశీ విహారయాత్రలకు ఎంపికవుతారంటూ మోసగిస్తున్నారు. ఇటీవల ఇలాంటి కేసులు పెరిగాయి. ఈ-కామర్స్ సంస్థల వినియోగదారుల డేటా కొట్టేస్తున్న నేరగాళ్లు వాటితో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ-కామర్స్ వెబ్‌సైట్లు వినియోగదారులు, ఇతర డేటా బాధ్యతను తృతీయ పక్ష (థర్డ్ పార్టీ) సంస్థలు నిర్వహిస్తుంటాయి. ఈ సంస్థలు వినియోగదారుల సమాచారాన్ని అమ్మేస్తున్నాయి. ఏ వినియోగదారుడు ఏ చిరునామాలో ఉన్నారు, ఏయే తేదీల్లో వస్తువులు కొన్నారు, తదితర సమస్త సమాచారం నేరస్థుల చేతుల్లోకి వెళ్తుంది.



**ఇవీ జాగ్రత్తలు**

ఈ-కామర్స్ సంస్థలు ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలు, స్క్రాచ్‌కార్డులు పంపి బహుమతులు ఇవ్వవు. వ్యక్తిగతంగా ఫోన్ చేయడం లేదా సందేశం ద్వారా సంప్రదింపులు జరపవు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వాట్సప్ సందేశాలు పంపించి ఏదైనా లింకు క్లిక్ చేయాలని సూచిస్తే నమ్మొద్దు. ఆఫర్ గెలుచుకోవాలంటే ముందస్తుగా డబ్బు అడిగితే మోసమని గుర్తించాలి. అధికారిక వెబ్‌సైట్లలోనే షాపింగ్ చేయాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులు, ఆఫర్లని చూసి మోసపోవద్దు.

**ఒకవేళ మోసపోతే** 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయాలి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

# భూములు నొక్కి.. చిక్కినా నక్కి!!

పుత్తూరు : గత వైకాపా పాలనలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు చకచకా జరిగిపోయాయి. కొన్ని మండలాల్లో అర్హత లేని భూములకూ చోటు కల్పించి.. అందుకు ప్రతిఫలంగా వైకాపా నాయకులు భారీగా ముడుపులు తీసుకున్నారు. అదే సమయంలో రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించి అందిన కాడికి దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అక్రమాల నిగ్గు తేల్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 453 ఎకరాలు, తొట్టంబేడులో 209 ఎకరాలు, రేణిగుంటలో 17 ఎకరాలు, చంద్రగిరి నియోజకవర్గంలో 316 ఎకరాలు రిజిస్ట్రేషను చేసేశారు.

బాలాయపల్లి, శ్రీకాళహస్తి, కేవీబీపురం, ఎర్రావారిపాళెం, డిక్కలి, గూడూరు, తొట్టంబేడు, ఏర్పేడు, కోట, తడ, పెళ్లకూరు, నాయుడుపేట, చంద్రగిరి మండలాల్లో ఏడు వేల నుంచి వెయ్యి ఎకరాల వరకు రిజిస్ట్రేషను జరిగాయి.

రెవెన్యూ డివిజన్లు వారీగా చూస్తే.. (ఎకరాల్లో)

తిరుపతి: 7611

సూళ్లూరుపేట: 8069

గూడూరు: 15198

శ్రీకాళహస్తి: 15,647

679 ఎకరాలు: జిల్లాలోనే అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగిన నియోజకవర్గం శ్రీకాళహస్తి

7,548 ఎకరాలు: అత్యధికంగా ఫ్రీహోల్డ్ జరిగిన గ్రామం బాలాయపల్లి 44,526 ఎకరాలు: ప్రత్యేక బృందాల ద్వారా గతేడాది చేపట్టిన సర్వేలో తేలిన భూమి

# నిలిచిన నెట్‌వర్క్ వైద్యసేవలు!



అనంతపురం : అనంతపురంలోని ఓ ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద రోజు వారీగా 10 నుంచి 15 మంది రోగులు రిజిస్టర్ చేసుకుని చికిత్స పొందేవారు. ప్రస్తుతం ఒకటి నుంచి రెండు మాత్రమే నమోదు చేసుకుని సేవలు అందిస్తున్నారు. అవి కూడా అత్యవసరమైనవి ఉంటున్నాయి. మరో ఆసుపత్రిలో సగటున రోజుకు ఐదు కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం ఒక కేసుని కూడా తీసుకోవటం లేదు. కదిరికి చెందిన ఓ మహిళకు మంగళవారం గుండె సంబంధిత సమస్య తలెత్తటంతో స్థానిక వైద్యులు పరీక్షలు చేసి అనంతపురంలోని ఓ ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఆమె అక్కడికి రాగా ఎన్‌టీఆర్ వైద్యసేవలు నిలిపివేశామని రూ.1.50 లక్షలు కడితే చికిత్స అందిస్తామని సదరు ఆసుపత్రి నిర్వాహకులు తెగేసి చెప్పారు.

ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం కింద ఈనెల 10నుంచి చికిత్సలను నిర్వాహకులు ఆపేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులు కడితే చికిత్స అందిస్తామని కొన్ని యాజమాన్యాలు చెబుతుండటం గమనార్హం. దీంతో చేసేది ఏమీలేక ప్రభుత్వ సర్వజన, సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

ఎన్‌టీఆర్ వైద్యసేవ సేవలు అందించే ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు : 59

గతంలో రోజు వారీగా రిజిస్టర్ అవుతున్న కేసులు: సుమారు 50

ప్రస్తుతం కేసుల సంఖ : సగటున 5 నుంచి 10

గతంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆర్థోవిభాగంలో రోజూ ఐపీ కేసులు: దాదాపు 50 ప్రస్తుతం నమోదు : 70 నుంచి 75

**ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం**

డాక్టర్ కిరణ్కుమార్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, ఎన్‌టీఆర్ వైద్యసేవ

కొన్నిచోట్ల ప్రభుత్వాసుపత్రులకు వెళ్లాలని రెఫర్ చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే 104కు గాని, తమ విభాగం నంబరు 92810 68151కు వివరాలు తెలియజేస్తే వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రుల్లో ఉండే ఆరోగ్యమిత్రలను కలిసి సమస్య తెలిపినా.. వారు తమ దృష్టికి తీసుకొస్తారు. తొమ్మిది అత్యవసర కేసుల కు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సత్వర చికిత్సలు అందించాం.

# నీటిబొట్టును ఒడిసిపట్టేలా..



నక్కపల్లి : ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో జలసంరక్షణకు మరింత అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సంకల్పించింది. ఇకపై జరిగే పనుల్లో దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ ఆదేశాలిచ్చింది. ఈ దిశగా జిల్లా యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది.

ఉపాధి హామీ ద్వారా చెరువులు, కాలువల్లో పూడికతీత, ఇంకుడు గుంతలు, రహదారులు, కాలువలు తదితర నిర్మాణాలు, మొక్కల పెంపకం వంటి పనులు చేస్తున్నారు. ఏటా జిల్లాలో దాదాపు రూ. 400 కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రజలకు ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించడం తొలి ప్రాధాన్యంగా తీసుకోగా.. మలిప్రాధాన్యంగా జలసంరక్షణ, అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తున్నారు. తాజాగా కేంద్రం దిశానిర్దేశకాల ప్రకారం భాగంగా చెరువుల్లో పూడికతీతలు, నూతన చెరువులు, పంటకుంటల తవ్వకాలు, కాలువల తవ్వకాలు చేపట్టనున్నారు. జిల్లాలో ఇప్పటికే ఇలాంటి పనులు చేస్తున్నారు. తాజా ఆదేశాలతో మరింత పెంచనున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు 40 శాతం కేటాయిస్తుండగా.. మిగిలినవి జలసంరక్షణ, వ్యవసాయ పనులకు కేటాయిస్తున్నారు.

జిల్లాలో 15 మండలాల పరిధిలో 53 గ్రామాల్లో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నట్లు అధికారిక నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో వాటర్‌షెడ్ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం పెంచేలా అధికార యంత్రాంగం కార్యచరణ సిద్ధం చేసింది. దీనిపై కలెక్టర్ ఇటీవల ఉపాధి, జల వనరులు, భూగర్భ జల శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. గొలుసుకట్టు చెరువులు, కాలువల్లో నూరుశాతం పూడిక తీత, లోతు పెంచడం, పంట కుంటల నిర్మాణం, కొండల నుంచి వచ్చే నీటికి అడ్డుకట్ట వేసే చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు, పూడికతీత, నూతన నిర్మాణాలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రానున్న మూడేళ్లకు ప్రణాళికలు రూపొందించుకుని, ఈ నవంబరు నుంచే మూడు శాఖలు సమన్వయం చేసుకుంటూ పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. ఇకపై భూగర్భ జలాలు బాగా అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ఏటా కేటాయిస్తున్న బడ్జెట్‌లో 65 శాతం నిధులను కేటాయించనున్నారు. భూగర్భ జలాలు తక్కువుంటే 40శాతం నిధులను వెచ్చించనున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భూగర్భ జలాల సమస్య రాకుండా ముందు జాగ్రత్తగా 30 శాతం నిధులను ఖర్చు చేస్తారు.

# విశాఖ.. 'గూగుల్ ఇలా'కా!




విశాఖపట్నం : విశాఖపట్నం విశ్వ నగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడింది. నగర చరిత్రను మలుపు తిప్పే 'గూగుల్ డేటా సెంటర్' ఏర్పాటుకు దిల్లీలో ఒప్పందాలు సాగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. భూముల కేటాయింపు, ప్రోత్సాహకాల నేపథ్యంలో విశాఖ నగరం వైపు గూగుల్ దృష్టిసారించింది. త్వరలో పనులు ఆరంభమై మరికొద్ది సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించనుంది.

'సిఫీ' ఆధ్వర్యంలో 50 మెగావాట్ల ఏఐ ఆధారిత డేటా ఎడ్జ్ సెంటర్‌కు ఇటీవల భూమి పూజ జరిగింది. ఏ1 గ్రాండ్ బీచ్ సమీపంలో సిఫీ సొంత భూమిలో సబ్‌మెరైన్ ల్యాండింగ్ కేబుల్ స్టేషన్ ఏర్పాటు చేయనుంది. అలాగే.. రూ.7,210 కోట్లతో అదానీ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది.

**ఏఐ క్యాపిటల్‌గా విశాఖ:** 'గూగుల్‌తో ఒప్పందం చారిత్రాత్మకం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో భారతదేశానికే కాదు దక్షిణాసియాకే విశాఖ క్యాపిటల్‌గా నిలుస్తుంది. గూగుల్ డేటా సెంటర్‌తోపాటు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్ లైన్, అధునాతన ఎనర్జీ స్టోరేజీ ప్లాంటు అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. గూగుల్‌కు కావాల్సిన కంప్యూటర్లు, ఏఐ బేస్డ్ ఎకోసిస్టమ్ ఇక్కడ అభివృద్ధి చేస్తారు. గూగుల్ రావడం విశాఖ ఎకనమిక్ జోన్‌కు బాగా ఉపయోగంగా ఉంటుంది. అనుబంధ రంగ సంస్థలు, స్టార్టప్‌లు భారీగా వస్తాయి' అని నిపుణులు చెబుతున్నారు.

డేటా సెంటర్లు..భూముల కేటాయింపు

సిఫీ: పరదేశిపాలెంలో 50 ఎకరాలు, రుషికొండ ఐటీ హిల్-3లో 3.6 ఎకరాలు.

గూగుల్ (రైడెన్): అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 160 ఎకరాలు. విశాఖ జిల్లా అడవివరం, ముడసర్లోవలో 120 ఎకరాలు, ఆనందపురం మండలం తర్లువాడలో 200 ఎకరాలు.

టీసీఎస్: భూములు పరిశీలిస్తున్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం పరిధిలో ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

అదానీ: రుషికొండ హిల్-4లో 60.29 ఎకరాలు

శుభపరిణామం : ఏపీకి గూగుల్ రావడం శుభపరిణామం. దీని వెంట మరికొన్ని కంపెనీలు వరస కడతాయి. ఏఐ అవసరాల మేరకు డేటా సెంటర్ ఆవశ్యకత పెరుగుతుంటుంది. గ్రాఫిక్ ప్రాసెస్ యూనిట్ (జీపీయూ), టెన్సర్ ప్రాసెస్ యూనిట్ (టీపీయూ)లను గూగుల్ ఇక్కడే ఏర్పాటు చేస్తుంది. డేటా సెంటర్‌కు విద్యుత్ ఎక్కువ ఉపయోగించడం వల్ల రెవెన్యూ వస్తుంది' అని ఏపీడీటీఏ నెట్‌వర్క్ ఛైర్మన్ కొసరాజు శ్రీధర్ పేర్కొన్నారు.

# సర్వజనం విన్నవిస్తోంది.. ఎయిమ్స్ తరహా సేవలకు!

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యకళాశాలను ఎయిమ్స్ స్థాయిలో తీర్చిదిద్ది స్వయం ప్రతిపత్తి గల తుంగభద్ర మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని.. రాష్ట్ర విభజన అనంతరం 2015లో ప్రతిపాదించారు.. ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడలేదు.. ఏడు దశాబ్దాలుగా రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది.. ఏటా సుమారు పది లక్షల మంది ఓపీ, లక్ష మందికిపైగా ఐపీ సేవలు అందిస్తూ రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకొని తుంగభద్ర మెడికల్ ఇన్‌స్టిట్యూట్ అంశాన్ని ఈనెల 16న నగరాకొస్తున్న ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా వాసులు విన్నవిస్తున్నారు.

**అసంపూర్తిగా అభివృద్ధి పనులు**

సర్వజన వైద్యశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి, ఆధునికీకరణ పనులు, మరమ్మతులు ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. 2022లో నాడు-నేడు కింద చేపట్టిన ఓపీడీ బ్లాక్ నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయింది. సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన దీనికి



గత ప్రభుత్వం సరిపడా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టకపోవడంతో పురోగతి కరవైంది. దీంతో వివిధ వార్డుల్లో సరిపడా గదులు, పడకలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీడీ బ్లాక్ పూర్తయితే సుమారు 650 పడకలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయి.

**వైద్య పరీక్షలు ఖరీదే**

బోధనాసుపత్రికి అనుబంధంగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అందుబాటులోకి వచ్చి ఏడాది గడిచినా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. ఇక్కడ వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు కరవయ్యాయి. దీంతో సర్వజన వైద్యశాల లేదా ప్రైవేటుగా పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ చేరిన పేదలు ఖరీదైన వైద్య పరీక్షలను ప్రైవేటు చేయించుకునేందుకు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**మెట్రో నగరాలకెళ్తేనే మెరుగైన వైద్యం**

వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికీ గ్యాస్ట్రో సర్జికల్ విభాగం, కార్డియో థొరాసిక్ విభాగంలో డీఎంసీట్లు లేవు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రత్యేక విభాగం, పీడియాట్రిక్, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జరీ ప్రత్యేక ఐసీయూ వంటి విభాగాలతో పాటు కొన్ని యూనిట్లలో మొక్కుబడి సేవలు అందుతున్నాయి. ఇప్పటికీ కర్నూలు వైద్య కళాశాలలో కొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు ప్రొఫెసర్లు లేక ఇన్‌ఛార్జులతో నడుస్తున్నాయి.

సర్జికల్ గ్యాస్ట్రో, పీడియాట్రిక్ కార్డియో సర్జరీ, కొన్ని క్యాన్సర్ సర్జరీలు క్రిటికల్ కేర్‌కు సంబంధించిన కొన్ని జబ్బులకు వైద్యసేవల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వజన వైద్యశాలలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నా దీనికి గుర్తింపు లేకపోవడంతో ప్రత్యేకంగా వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. దీనికి గుర్తింపు లభిస్తే ప్రత్యేక వైద్యులు, సిబ్బంది అందుబాటులోకి వస్తారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడేందుకు వీలవుతుంది.


# తామ్ర శాసనాలు.. చరిత్రకు ఆనవాళ్లు

నంద్యాల : శ్రీశైలం ఆలయ చరిత్రను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తెలియజేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన మల్లన్న ఆలయం గొప్పదనానికి దర్పణం పట్టే తామ్ర శాసనాలను ప్రధాని స్వయంగా వీక్షించనున్నారు. ప్రాచీనకాలం నాటి పంచ మఠాలను పునరుద్ధరించేందుకు కొన్నేళ్ల కిందట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఘంటామఠం జీర్ణోద్ధరణ పనులు చేస్తుండగా 53 తామ్ర శాసనాలు బయటపడ్డాయి. వీటిల్లోని విషయాలను ప్రధానికి వివరించనున్నారు.

**ఇలా చేస్తే..** శతాబ్దాల నాటి చరిత్రను భక్తులు తెలుసుకునేందుకు శ్రీశైలంలో పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేయాలని చాలాకాలం నుంచి ప్రతిపాదన ఉంది. నిధుల కొరతతో మ్యూజియం ఏర్పాటుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రాచీనకాలం నాటి నిర్మాణాలు, విగ్రహాలను భక్తులు వీక్షించేందుకు అవకాశం లేకుండా పోయింది. పంచమఠాల నిర్మాణ సమయంలో రుద్రాక్ష మఠంలోని సొరంగంలో వందల ఏళ్ల నాటి వస్తువులు బయటపడ్డాయి. శ్రీశైలం, దాని పరిసరాల్లో లభించిన తామ్ర, శిలా శాసనాలతో మ్యూజియం ఏర్పాటుచేస్తే భావితరాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

**ఆసక్తికర అంశాలెన్నో..**

శ్రీశైలంలో దొరికిన తామ్ర శాసనాలను పురావస్తు శాఖ అధికారులు అధ్యయనం చేసినప్పుడు పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఇక్ష్వాకులు, శాలంకాయనులు, ఆనందగోత్రులు, విష్ణుకుండినులు శ్రీపర్వతాన్ని పూజించిన దాఖలాలున్నాయి. చాళుక్యులు, రెడ్డి రాజులు,



రేచెర్ల వంశీయులు, కాకతీయ, విజయనగర రాజులు, గజపతులు తదితరులు శ్రీశైలం ఆలయాన్ని దర్శించుకున్నట్లు ఆయా శాసనాల్లో ఉన్న వివరాల ఆధారంగా స్పష్టమైంది. కర్నూలు నవాబు ఇబ్రహీంఖాన్ సైతం శ్రీశైలానికి విరివిగా దానాలు చేశారు. కొందరు ముస్లిం రాజులు శ్రీశైల అగ్రహారాలన్నింటినీ స్వాధీనం చేసుకుని స్వామివారికి కైంకర్యాలు జరగకుండా అడ్డుకున్నట్లు కొన్ని తామ్ర శాసనాల్లో బయటపడింది. 1421లో రేచర్ల రాజైన లింగమనాయకుడు వారిపై పోరాడి ఆయా అగ్రహారాలను తిరిగి స్వాధీనం చేసుకుని స్వామివారి కైంకర్యాలు పునరుద్ధరించారు.

**సమగ్ర వివరాలతో పుస్తకం రాశా**

-మునిరత్నంరెడ్డి, సంచాలకులు, భారత పురావస్తు శాఖ

శ్రీశైలంలో లభించిన తామ్ర శాసనాల వివరాల ఆధారంగా 'శ్రీశైల నూతన తామ్ర శాసనాలు' పేరుతో పుస్తకం రచించా. భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలంలో తామ్ర శాసనాల ప్రదర్శనతోపాటు ఆ పుస్తకాన్ని ఆవిష్కరిస్తాం. శ్రీశైలం ఆలయానికి సంబంధించిన తామ్ర, శిలా శాసనాలు, అందులోని వివరాలు ప్రజలకు తెలిసేలా మ్యూజియం ఏర్పాటుచేయాలని కేంద్రానికి ప్రతిపాదిస్తున్నాం.

చురకలు



## అందాలతో ఆకట్టుకుంటున్న చికిరి.. రాత్రి వేళల్లో!

ఈమధ్య కాలంలో హీరోయిన్లు గ్లామర్ తో అభిమానులను కట్టిపడేయడమే కాకుండా తమ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా పలు విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటున్నారు. అంతేకాదు అప్పుడప్పుడు తమ పాత్రలను ఇలా సోషల్ మీడియా ద్వారానే రివీల్ చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా అందాల తార అతిలోకసుందరి కూతురు నయా అతిలోక సుందరి జాన్వీ కపూర్ సోషల్ మీడియాను ఏ రేంజ్ లో ఉపయోగిస్తోందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా గ్లామర్ తో ఫాలోవర్స్ ను పెంచుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని కూడా అభిమానులతో పంచుకోవడానికి సోషల్ మీడియాను అధికంగా ఉపయోగిస్తోంది. మొన్నటి వరకు పరమ్ సుందరి, సన్నీ సంస్కారీకి తులసి కుమారి వంటి చిత్రాలను సోషల్ మీడియా ద్వారా జోరుగా ప్రమోట్ చేసిన ఈమె.. అప్పుడే పెద్ది సినిమాని కూడా ప్రమోట్ చేయడం మొదలుపెట్టింది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్గా నటిస్తున్న చిత్రం పెద్ది. వచ్చే ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇకపోతే భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి మేకర్స్ ఇప్పటి నుంచే అప్డేట్స్ వదులుతున్న విషయం తెలిసిందే .



అందులో భాగంగానే జాన్వి కపూర్ పై రాసిన "చికిరి చికిరి" అనే పాటను విడుదల చేశారు.. నిజానికి లిరికల్ సాంగ్ విడుదల చేస్తారన్నారు కానీ ఏకంగా వీడియో సాంగ్ ని రిలీజ్ చేసేసరికి అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. ఇందులో తన అందాలతో ఆకట్టుకుంది జాన్వి కపూర్..ఇదిలా ఉండగా ఇప్పుడు తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ.." మీ చికిరి" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోల విషయానికి వస్తే.. గోల్డెన్ గ్లిట్టర్ కలిగిన వన్ స్లీవ్ లెస్ హ్యాండ్ కలిగిన లెహంగా ధరించిన ఈమె రాత్రి వేళల్లో ఈ గ్లిట్టర్ వెలుగుల్లో తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది. అంతేకాదు మరికొన్ని ఫోటోలలో రెడ్ అండ్ క్రీం కలర్ కాంబినేషన్ లో ఉన్న హెవీ ఎంబ్రాయిడరీ శారీ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా బ్లౌజ్ ను ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్న జాన్వీ.. అందమైన ఆభరణాలు ధరించి మరీ తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం జాన్వీ కపూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఏది ఏమైనా తన అందంతో ఆకట్టుకుంటున్న జాన్వీ కపూర్ పెద్ది సినిమాతో సక్సెస్ అందుకోవాలని అభిమానులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## టైమ్ వచ్చింది.. అలా చేయక తప్పదు!

ఇండస్ట్రీలో రాణించటం అనేది అంత సులువైన పని కాదు. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిన తర్వాత చాలామంది తమ టాలెంట్ బయట పెడుతూ సినిమాల్లో అవకాశం అందుకుంటున్నారు. సినిమాల్లో సక్సెస్ అయితేనే ఎక్కువ శాతం నిలబడగలం. సక్సెస్ అవ్వాలి అంటే ముందు ఎంచుకునే కథల విధానంలోనే సరైన క్లారిటీ ఉండాలి. ఏ పాత్ర పడితే.. ఆ పాత్ర చేయకుండా ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేస్తే ఎక్కువ కాలం ఇండస్ట్రీలో నిలబడవచ్చు. ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అయిన వాళ్ళు కూడా చాలామంది ఉన్నారు. అయితే వారసత్వం నుంచి వచ్చిన కొంతమంది మాత్రం విపరీతంగా సక్సెస్ అవ్వాల్సిందే. ఎందుకంటే వాళ్ల మీద విపరీతమైన అంచనాలు ఉంటాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రామ్ పోతినేని మాట్లాడుతూ దేవదాస్ సినిమా నేను చిరంజీవి, గారు, రామ్ చరణ్ కలిసి చూసాము. రామ్ చరణ్ చాలా టెన్షన్ పడుతున్నాడు ఆ సినిమా చూసినప్పుడు. నేను చాలా ఫ్రీగా కూర్చున్నాను అప్పుడు అర్థమైంది అంచనాలు అనేది ఉంటే ఎలా ఉంటుందో నాకు ఆరోజు తెలుసొచ్చింది అంటూ క్లారిటీగా చెప్పాడు. అయితే ఇప్పుడు జాన్వీ



కపూర్ గురించి చెప్పుకోవాలి. ముందుగా నటి శ్రీదేవి గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగానే సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి ఎన్నో అద్భుతమైన సినిమాలు తెలుగులో చేసింది. కేవలం తెలుగులో మాత్రమే కాకుండా బాలీవుడ్ లో కూడా ఆమె సినిమాలు మంచి సక్సెస్ సాధించాయి. ఆ తర్వాత బోని కపూర్ ను పెళ్లి చేసుకుంది శ్రీదేవి. శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ కూడా ఇప్పుడు సినిమాల్లో నటిస్తున్నారు. జాన్వి కపూర్ హిందీ లో కొన్ని సినిమాలు చేశారు. అవి ఊహించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేసినా కూడా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే తెలుగులో ఎన్టీఆర్ సరసన నటించిన దేవర సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దేవర సినిమా సక్సెస్ అయ్యింది అటువంటి దాంట్లో ఎటువంటి సందేహం లేదు. కానీ జాన్వి కపూర్ కి రావాల్సినంత పేరు రాలేదు. ప్రస్తుతం రామ్ చరణ్ తేజ్ సరసన పెద్ది అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. అయితే గతంలో జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నా పాత్ర ప్రత్యేకంగా ఉంటుంది అని చెప్పారు. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత ఎంత ప్రత్యేకమో తెలుస్తుంది. జాన్వి కపూర్ కి సపరేట్ ఫ్యాన్ బేస్ పెద్ది సినిమా తీసుకొస్తుందా అంటే అది డౌటే, ఎందుకంటే మరోవైపు చరణ్ క్యారెక్టరైజేషన్ అదిరిపోయింది. అయితే ఎవరైనా కూడా తండ్రిని మించిన తనయుడు అని అనిపించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. కొంతమేరకు మెగాస్టార్ చిరంజీవి పేరును నిలబెట్టారు రామ్ చరణ్.




## టాప్ స్టార్స్.. టాలీవుడ్ లో ఫెయిల్యూర్స్..



ఇండస్ట్రీకి ఎక్కువ శాతం మంది ఎంట్రీ ఇచ్చేదే సరైన గుర్తింపు కోసం. డబ్బులు వచ్చే పనులు ఎన్ని ఉన్నా కూడా ఇండస్ట్రీ వైపు ఆసక్తి చూపుతున్నారు అంటే ఖచ్చితంగా ఫేమ్ గురించి ఆలోచిస్తున్నారు అని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అలానే యాక్టింగ్ మీద విపరీతమైన ప్యాషన్ తో కూడా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చే వాళ్ళు ఉన్నారు. అయితే వాళ్లలో కొంతమంది సక్సెస్ అవుతారు. ఇంకొంతమంది సక్సెస్ కోసం ట్రై చేస్తూనే ఉంటారు. కేవలం ఒక లాంగ్వేజ్ లోనే సినిమాలు చేయడం కాకుండా మిగతా లాంగ్వేజ్ లో కూడా రాణించిన హీరోయిన్లు ఉన్నారు.అలా తెలుగులో ' ఈ రోజుల్లో' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది ఆనంది. ఆ తరువాత తమిళ్ సినిమాల్లోనే మంచి గుర్తింపు సాధించుకుంది. వెట్రి మారన్, మారి సెల్వరాజ్ వంటి దర్శకుల తో కూడా పనిచేసింది తెలుగు హీరోయిన్ ఆనంది. అలానే చాలామంది బాలీవుడ్ ఇండస్ట్రీలో పరిచయం అవుతూ తెలుగులో తమను తాము ప్రూవ్ చేసుకోవాలి అనే ఉద్దేశంతో తెలుగు సినిమాలు కూడా చేస్తారు.కానీ అన్నిసార్లు అది వర్కౌట్ కాదు. బాలీవుడ్ లో కంగనా రనౌత్ కు ఏ రేంజ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అయితే పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన ఏక్ నిరంజన్ సినిమాతో తెలుగులో కూడా ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమా తెలుగులో అప్పుడు ఊహించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అందుకనే తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో ఎక్కువగా నిలబడలేకపోయారు కంగనా. ఇక ప్రస్తుతం మాత్రం ఏ లాంగ్వేజ్ లో సినిమా చేసినా అన్ని భాషలకి రీచ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఎన్నో అద్భుతమైన సినిమాలతో విపరీతమైన గుర్తింపు సాధించుకున్న బిపాసా బసు. జయంత్ సి దర్శకత్వంలో వచ్చిన టక్కరి దొంగ సినిమాలో మహేష్ బాబు సరసన కనిపించింది. బాక్స్ ఆఫీస్ వద్ద ఆ సినిమా ఊహించిన సక్సెస్ సాధించలేకపోయింది. మల్లీశ్వరి సినిమాలో వెంకటేష్ సరసన కత్రినా కైఫ్ నటించారు. బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా మంచి సక్సెస్ కూడా సాధించింది. కానీ ఆ తర్వాత తెలుగులో అల్లరి పిడుగు సినిమా చేసింది కానీ డిజాస్టర్ గా నిలిచింది. దీంతో ఆమె మళ్ళీ తెలుగులో సినిమాలు చేయలేదు కత్రినా. బాలీవుడ్ లో మంచి గుర్తింపు సాధించుకుంది స్నేహ ఉల్లాల్. తెలుగులో కరుణాకర్ దర్శకత్వంలో వచ్చిన ఉల్లాసంగా ఉత్సాహంగా సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఆ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద సక్సెస్ అయింది ఆ తర్వాత వచ్చిన సినిమాలేవి పెద్దగా ఆకట్టుకోలేదు. బాలీవుడ్ లో గుర్తింపు తెచ్చుకొని తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో ప్రస్తుతం సినిమాలు చేస్తుంది నిధి అగర్వాల్. ఇస్మార్ట్ శంకర్ సినిమా మినహాయిస్తే తెలుగులో ఈమెకు కూడా ఊహించిన రేంజ్ లో సక్సెస్ రాలేదు. ప్రస్తుతం రాజా సాబ్ సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా ఏ రేంజ్ లో సక్సెస్ అవుతుందో వేచి చూడాలి. సోనాక్షి సిన్హా గురించి ప్రత్యేకించి పరిచయాలు అవసరం లేదు. కాస్ట్యూమ్ డిజైనర్ గా కెరియర్ మొదలుపెట్టిన ఈమె దబాంగ్ సినిమాతో విపరీతమైన గుర్తింపు సాధించుకుంది. ఇదే సినిమాను తెలుగులో గబ్బర్ సింగ్ పేరుతో కూడా రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. అయితే సోనాక్షి జటాధర సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. బాక్స్ ఆఫీస్ వద్ద ఈ సినిమా కంప్లీట్ డిజాస్టర్ గా మారిపోయింది. నవంబర్ 7న విడుదలైన ఈ సినిమా గురించి ఎక్కడా కూడా పాజిటివ్ టాక్ వినిపించడం లేదు. ఇక మళ్లీ తెలుగులో మరోసారి తను ప్రయత్నిస్తుందా, లేకపోతే వదిలేస్తుందా అనేది చూడాలి.

## రజనీ - కమల్.. మరోసారి హారరా? ఆరుణాచాలమా?



ఇండియన్ సినిమా ఫ్యాన్స్ దశాబ్దాలుగా వెయిట్ చేస్తున్న ఒక మూమెంట్ ఇది. ఇండస్ట్రీని ఏలిన ఇద్దరు లెజెండ్స్.. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్.. మళ్లీ ఒకే సినిమా కోసం చేతులు కలిపారు. అయితే, ఫ్యాన్స్ ఊహించినట్టుగా ఇద్దరూ స్క్రీన్ షేర్ చేసుకోవడం లేదు, దానికి మించిన ఒక మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్తో ఈ అనౌన్స్మెంట్ వచ్చింది. రజనీకాంత్ హీరోగా, కమల్ హాసన్ ప్రొడ్యూసర్గా సినిమా రాబోతోంది. ఈ హిస్టారిక్ కొలాబరేషన్ను అఫీషియల్గా అనౌన్స్ చేస్తూ, కమల్ హాసన్ ప్రొడక్షన్ బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' (RKFI) ఒక స్పెషల్ వీడియోను డ్రాప్ చేసింది. "తలైవర్ 173" వర్కింగ్ టైటిల్తో వస్తున్న ఈ ప్రాజెక్ట్ అనౌన్స్మెంట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ వీడియోలో రజనీకాంత్, కమల్ హాసన్, డైరెక్టర్ సుందర్ సి. ముగ్గురూ 'రాజ్ కమల్' ఆఫీస్లో చాలా హ్యాపీగా కనిపించారు. ఈ కాంబోలో మూడో పేరు కూడా ఫ్యాన్స్కు పూనకాలు తెప్పిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్కు డైరెక్టర్ సుందర్ సి. ఫిక్స్ అయ్యారు. రజనీకాంత్, సుందర్ సి. కాంబినేషన్ అంటే ఫ్యాన్స్కు 'అరుణాచలం' లాంటి ఆల్-టైమ్ క్లాసిక్ ఎంటర్టైనర్ గుర్తొస్తుంది. సుమారు 28 ఏళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ కలుస్తుండటంతో, రజనీ మార్క్ కామెడీ టైమింగ్, స్టైల్ను సుందర్ సి. ఏ రేంజ్లో చూపిస్తాడో అని ఫ్యాన్స్ ఈగర్గా వెయిట్ చేస్తున్నారు. అయితే సుందర్ ఇటీవల కాలంలో హారర్ కామెడీ కథలతోనే ఎక్కువగా క్లిక్కయ్యాడు. చంద్రకళ, కళావతి అంటూ ఒక సిరీస్ తో వరుసగా కమర్షియల్ హిట్స్ కొట్టాడు. అలాంటిది సూపర్ స్టార్ తో ఎలాంటి సినిమా చేస్తాడా అని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక రజినీకాంత్ చంద్రముఖి తరువాత మళ్ళీ హారర్ కథలను టచ్ చేయలేదు. కాబట్టి అలాంటి కాన్సెప్ట్ టచ్ చేస్తే చూడాలని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక "తమిళ సినిమాకు బ్లాక్ అండ్ వైట్ రోజుల నుంచి గోల్డెన్ ఎరా వరకు రెండు పిల్లర్స్లా నిలిచారు" అంటూ రాజ్ కమల్ ఫిల్మ్స్ వదిలిన ట్వీట్.. ఈ కాంబో రేంజ్ ఏంటో చెప్తోంది. ఒక లెజెండ్ (కమల్) తన సొంత బ్యానర్పై, మరో లెజెండ్ (రజనీ)తో సినిమా తీస్తుండటం ఇండియన్ సినిమా చరిత్రలోనే ఇది ఫస్ట్ టైమ్. ఈ కలయికపై ఇద్దరు హీరోలు ఫుల్ ఎగ్జయిటింగ్గా ఉన్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ను 2027 పొంగల్ కానుకగా రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా రిలీజ్ చేయనున్నట్లు అఫీషియల్గా ప్రకటించారు.

## స్టైలిష్ ఫోజులతో ఆకట్టుకుంటున్న రకుల్!

ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటనతో తెలుగు ఆడియన్స్ హృదయాలను దోచుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్లో దేదే ప్యార్ దే 2 సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్లో జోరుగా పాల్గొంటున్న ఈమె అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్గా ఉంటూ పలు గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా వైట్ కలర్ లేటెస్ట్ ట్రెండీ అవుట్ ఫిట్ ధరించిన ఈమె అందులో స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిస్తూ వాటిని అభిమానులతో పంచుకుంది. కుర్చీలో కూర్చొని స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె మరొకవైపు అందాలు ఆరబోస్తూ తన అందంతో ప్రేక్షకులను మెప్పించింది. ఈ ఫోటోలను షేర్ చేస్తూ దేదే ప్యార్ దే 2 మూవీ ప్రమోషన్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది ఈ ముద్దుగుమ్మ. ఇక ప్రస్తుతం రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు



సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రకుల్ నటిస్తున్న దేదే ప్యార్ దే 2 మూవీ విషయానికి వస్తే.. అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్ 2019లో నటించిన దేదే ప్యార్ దే సినిమా సీక్వెల్ గా దేదే ప్యార్ దే 2 రాబోతోంది ఇటీవల ఈ ట్రైలర్ విడుదల అవ్వగా ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమాని టీ సిరీస్, లవ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి. అన్షుల్ శర్మ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్ మాధవన్ ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ కి తండ్రి పాత్రలో కనిపిస్తున్నారు. నవంబర్ 14వ తేదీన ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలోనే వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టిన చిత్ర బృందం అటు రకుల్ కూడా గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రముఖ తెలుగు చలనచిత్ర నటిగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. తమిళ్, కన్నడ , హిందీ భాషలలో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఈమె ఒక పంజాబీ కుటుంబంలో జన్మించినప్పటికీ.. తెలుగు ప్రేక్షకులు ఈమెను ఓన్ చేసుకోవడంతో ఇక్కడే సినిమాలు చేస్తూ కొంతకాలం హైదరాబాదులో కూడా నివసించింది. ఇక్కడ అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ కి వెళ్ళిపోయిన ఈమె.. అక్కడే ప్రముఖ నటుడు , నిర్మాత అయిన జాకీ భగ్నానీతో ఏడు అడుగులు వేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తోందని చెప్పవచ్చు. మరి ఈసారైనా ఈ చిత్రంతో రకుల్ కి సక్సెస్ లభిస్తుందో లేదో చూడాలి.

## గర్ల్ ఫ్రెండ్.. రష్మిక అంత తక్కువ తీసుకుందా?

స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం నార్త్ టు సౌత్ వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా తెలుగుతోపాటు హిందీలో భారీ విజయాలు అందుకుంటున్న రష్మిక.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. రీసెంట్ గా థామా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ ను అందుకున్నారు. తాజాగా ది గర్ల్ ఫ్రెండ్ మూవీతో థియేటర్స్ లోకి వచ్చిన అమ్మడు.. తన యాక్టింగ్ తో అందరినీ అలరిస్తున్నారు. విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా అందుకుంటున్నారు. ముఖ్యంగా సినిమాలోని ప్రతీ ఫ్రేమ్ లో రష్మిక తన నటనతో ఫిదా చేశారని అంతా కొనియాడుతున్నారు. అదే సమయంలో ఇప్పుడు ఆమె పారితోషికం కోసం డిస్కస్ చేసుకుంటున్నారు. ఎందుకంటే స్టార్ హీరోయిన్ గా ఇండస్ట్రీని ఏలుతున్న రష్మిక.. ఇప్పుడు రెమ్యునరేషన్ ను కూడా భారీగా తీసుకుంటున్నారు. రూ.5- రూ.10 కోట్ల రేంజ్ లో అందుకుంటున్నట్లు తెలుస్తోంది. అలా ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు కూడా రష్మికకు పెద్ద



ఎత్తున డబ్బులు అందుకుని ఉంటారని కొందరు నెటిజన్లు అంచనా వేశారు. కానీ అది నిజం కాదని సమాచారం. గర్ల్ ఫ్రెండ్ మూవీ కథ నచ్చి రెమ్యునరేషన్ ఏమి వద్దని.. సినిమా చేశాక చూసుకుందామని రష్మిక షూటింగ్ కు ముందే మేకర్స్ కు చెప్పారట. ఆ విషయాన్ని మేకర్స్ ప్రమోషన్స్ టైమ్ లోనే వెల్లడించారు. కానీ పారితోషికం ఇవ్వడం తమ బాధ్యత అని తెలిపారు. ఆమెకు తాము డబుల్ రెమ్యునరేషన్ ఇస్తామని కూడా చెప్పారు. అయితే ఇప్పుడు రష్మిక తనకు రూ.3 కోట్ల రెమ్యునరేషన్ చాలు అని చెప్పినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. సినిమా కోసం 50 రోజులకు పైగా కేటాయించినప్పటికీ అంత మొత్తం సరిపోతుందని అన్నట్లు తెలుస్తోంది. లేడీ ఓరియెంటెడ్ మూవీ స్టోరీలపై ఉన్న మక్కువ కారణంగా తక్కువ పారితోషికం తీసుకున్నట్లు టాలీవుడ్ ఇండస్ట్రీలో వినికిడి. ఏదేమైనా రష్మిక తక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్నారని చెప్పాలి. ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్న ఆమె.. తెలుగు సినిమాలకు రూ.5-6 కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు టాక్. బాలీవుడ్ చిత్రాలకు మాత్రం రూ.8-10 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కానీ ఇప్పుడు ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు గాను.. తెలుగు మూవీస్ కు తీసుకునే మొత్తంలో సగం మాత్రమే అందుకున్నట్లు ఉన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536